ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 7, ఫిబ్రవరి 2025



ప్రకృతి.. ప్రతిబింబం!

ఉన్నది ఉన్నట్టు చూపడంలో దర్పణానికి మించిన రుజువు లేదంటారు. అద్దానికి ఏ మాత్రం తీసిపోనన్నట్టు.. సమయం, సందర్భం కలిసొస్తే ఒక దృశ్యాన్ని యథాతథంగా చూపే శక్తి తనకూ ఉందన్నట్టు.. నిశ్చలంగా నిలిచి ప్రతిబింబాన్ని చూపుతున్న నీటి దృశ్యం కనువిందు చేసింది.

(ఉదయం 8 గంటలకు మంచు తొలగిపోతున్న సమయాన ఒంగోలులోని రంగారాయుడు చెరువు వద్ద కనిపించిన దృశ్యమిది)



మకాం మార్చాయి!

వసతులు లేక విడిదిని మార్చిన నైజీరియా పక్షులు



- వెలమవారిపాలెం నుంచి మైలవరం రాక
- చెట్లులేక ఊరు మార్చినట్లు అంచనా
- ఇక్కడా వసతులు అంతంతమాత్రమే
- ప్రత్యేక దృష్టిసారిస్తే భవిష్యత్‌లో విడిదికి అవకాశం

7



యాప్‌లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి



సోలార్‌పవర్ ప్లాంట్లు ఏర్పాటు కోసం పీఎం సూర్యఘర్ యాప్‌లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి. ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్లు ఉచితంగా తీసుకుంటున్నవారు ఇప్పటికే 80వేల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. మా సిబ్బంది అన్ని ఇళ్లకు తిరిగి ఈ ప్రక్రియ చేస్తున్నారు. మిగిలిన వారు రిజిస్ట్రేషన్లు చేయించుకుంటే సంబంధిత సిబ్బంది సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. పీఎం కుసుమ్ కింద కూడా జిల్లాలో 19 ప్యాకేజీలు కింద సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. **- కట్టా వెంకటేశ్వరు, విద్యుత్తుశాఖ ఎస్ఈ**



ఒంగోలు రూరల్ మండలం యరజర్లలో లబ్ధిదారుడికి పీఎం సూర్యఘర్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

పేద, మధ్యతరగతి కుటుంబాల్లో విద్యుత్ 'సౌర'భాలు విరబూయనున్నాయి. కరెంటు చార్జీల భారాలు తొలగిపోనున్నాయి. ప్రతి కుటుంబమూ సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఇందుకు అవసరమయ్యే సోలార్ యూనిట్ ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నాయి. గృహావసరాలతోపాటుగా పారిశ్రామికవాడల్లో, రైతులు పొలాల్లో వినియోగించుకునే విద్యుత్‌ను సౌరశక్తి ద్వారా తయారుచేసుకోవచ్చు. అందుకోసం కేంద్రప్రభుత్వం సూర్యఘర్, సూర్యకుసుమ్ పథకాలను రూపొందించింది. ఔత్సాహికులను ప్రోత్సహించడం కోసం సబ్సిడీ కూడా ఇస్తోంది. సోలార్ ప్యానల్స్ కోసం బ్యాంక్‌లు రుణాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయి. సూర్యఘర్ కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు రాష్ట్రప్రభుత్వం ఉచితంగా యూనిట్ సౌకర్యం కల్పించే యోచన చేస్తోంది.

భలే సౌరభాలు

సౌర విద్యుత్ వాడకానికి ప్రోత్సాహం

- గృహాలకు పీఎం సూర్యఘర్
- ఎస్సీ, ఎస్టీలకు ఉచితం
- మిగతా వారికి రాయితీ
- రైతులకు పీఎం కుసుమ్
- కిలోవాట్‌కు రూ.20వేలు సబ్సిడీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సౌర శక్తి యూనిట్‌లు, ప్లాంట్ల ఏర్పాటుకు ముందు కొచ్చే ఔత్సాహికుల కోసం కేంద్రప్రభుత్వం రాయితీలు అందజేస్తుంది. బ్యాంకర్లు సైతం రుణాలు మంజూరు చేస్తున్నారు. ఎవరికి వారే సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని, తాము వాడుకోవడంతోపాటు మిగిలిన విద్యుత్ తిరిగి డిస్కంకు విక్రయించుకునే అవకాశం ఉంది.

గృహ వినియోగదారులకు సూర్యఘర్

ఇంటిపైన అమర్చే సోలార్ ప్యానల్స్ ద్వారా విద్యుత్‌ను ఉత్పతి చేసుకునేందుకు సూర్యఘర్ పథకాన్ని రూపొందించారు. దీని కింద మూడు కిలోవాట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. ఒక కిలో వాట్ యూనిట్‌కు రూ.20వేలు, రెండు కిలోవాట్లకు అయితే రూ.40 వేలు, మూడు కిలోవాట్లకు అయితే రూ.78వేల వరకు రాయతీ ఇస్తోంది. ఈ సౌకర్యాన్ని ఎవరైనా వినియోగించుకోవచ్చు. ఇందుకు పీఎం సూర్యఘర్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సుమారుగా మూడు కిలోవాట్ల

మిగతా 6లో...

పకడ్బందీగా..

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 13 పరీక్షా కేంద్రాలు పెంపు
- జిల్లాలో మొత్తం 183 కేంద్రాలు
- ఆరుచోట్ల సీసీ కెమెరాలు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చేనెల 17వతేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పగడ్బందీగా జరిగాయి. కేంద్రాలు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల ఎంపికకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి ఆమోద ముద్ర వేశారు. ఈ ఏడాది పదవ తరగతి రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూలు సొసైటీ విద్యార్థులను కూడా కలిపి ఒకేసారి పరీక్షలు నిర్వహించనున్నారు. గతేడాది రెగ్యులర్ విద్యార్థులకు 170 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది ఓపెన్ స్కూలు విద్యార్థులకు ఒకేసారి పరీక్షలు నిర్వహించాల్సి రావడంతో 13 కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 183 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిలైనవారు 29,843 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 29,602 మంది, ఒకసారి ఫెయిలైనవారు 241 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. ఆరు సమస్యాత్మక కేంద్రాలలో కాపీయింగ్‌ను నిరోధించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఓపెన్ విద్యార్థులకు 23 కేంద్రాలు

జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూలు సొసైటీ విద్యార్థులు 23 పరీక్షా కేంద్రాల్లో కలిసి పరీక్ష రాయనున్నారు. ప్రతి కేంద్రంలో రెండు గదులను ఓపెన్ స్కూలు విద్యార్థులకు కేటాయిస్తారు. ఓపెన్ స్కూలు సొసైటీ రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులు 1,564 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒంగోలు, మార్కాపురంలలో రెండేసి కేంద్రాలు, కనిగిరి, వైపాలెంలో ఐదు కేంద్రాలు, దర్శిలో అత్యధికంగా ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా గిద్దలూరులో మూడు కేంద్రాల్లో రెగ్యులర్‌తోపాటు ఓపెన్‌స్కూలు విద్యార్థులు కూడా పరీక్షలు రానునున్నారు.

ఆరు కేంద్రాల్లో సీసీ కెమెరాలు

జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు రాయనున్నారు. సమస్యాత్మక కేంద్రాలుగా ఈ కేంద్రాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పిటికాయగుళ్ల, యేనుగులదిన్నెపాడు, చంద్రశేఖరపురం, యాచవరం, రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఈ పాఠశాలలకు సమర్థులైన అధికారులు, ఉపాధ్యాయులను పరీక్షల విధులకు నియమించమని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఆదేశించారు.



- కర్ణాటకలో రూ.318 పలికిన కిలో పొగాకు
- సీజన్‌లో ఇదే అధిక ధర
- మీడియం, లోగ్రేడ్‌లకు అదే పరిస్థితి
- విదేశీ ఆర్డర్లే కారణం
- ఇది తాత్కాలికమే అంటున్న నిపుణులు

పొగాకు రైతులకు శుభవార్త. కర్ణాటకలో మార్కెట్ హాట్‌హాట్‌గా సాగుతోంది. మేలురకం, మీడియం, లోగ్రేడ్ ధరలు గణనీయంగా పెరిగాయి. వారం పదిరోజుల క్రితం కూటమి కట్టి ధరలపై సీలింగ్ పెట్టి కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం బేళ్ల కోసం పోటీ పడుతున్నారు. విదేశీ ఆర్డర్లు రావడంతో ధరలు పెంచి కొనుగోలు చేస్తున్నారు. మేలురకం పొగాకు కిలో గరిష్ఠ ధర గురువారం రూ.318 పలికింది. ఈ సీజన్‌లో ఇదే అధిక ధర కావడం విశేషం.

పొగాకు మార్కెట్

హాట్‌హాట్

ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో వారం పదిరోజుల క్రితం వరకు కిలో రూ.300 లోపుగానే ఉంది. అక్కడ ఈ సీజన్‌కు 100 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా ఇంచుమించు అంతమేర రైతులు పండించారు. తొలుత కిలో రూ.230తో కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు తొలి నెల రోజులు ధరలు పెంచకుండానే కొంటూ వచ్చారు. అనంతరం క్రమంగా ధరలు పెరిగి డిసెంబర్‌లో అలా గరిష్ఠ ధర రూ.300లకు, జనవరిలో రూ.315కు పెరిగాయి. సంక్రాంతి అనంతరం తిరోగమనంలో మార్కెట్ నడిచింది. వ్యాపారులు కూటమి కట్టి ధరలను కిలో రూ.300కు సీలింగ్ పెట్టి కొన్నారు. మీడియం, లోగ్రేడ్లను కూడా అప్పటివరకు ఉన్న ధరల కన్నా కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు తగ్గించి వేశారు.

విదేశీ ఆర్డర్ల ఖరారుతో..

గత పక్షంరోజుల పాటు తిరోగమనంలో సాగిన మార్కెట్ ప్రస్తుతం తిరిగి ఊపందుకుంది. గరిష్ఠ ధర కిలో రూ.315 నుంచి రూ.318 వరకు పలుకుతుండగా మీడియం ధరలు కిలో రూ.280 నుంచి రూ.290 వరకు అలాగే లోగ్రేడ్‌లు సైతం కిలో రూ.250 వరకు లభిస్తున్నాయి. ఎందుకు పనికిరాదనుకునే

మిగతా 6లో...





5వ స్థానంలో డోలా

- ఫైళ్ల పరిష్కారంలో మంత్రి ర్యాంక్
- కేబినెట్ భేటీలో ప్రకటించిన సీఎం

ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫైళ్ల పరిష్కారంలో జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఐదవ స్థానంలో నిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల కన్నా ముందు వరుసలో డాక్టర్ స్వామి ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జూలై నుంచి డిసెంబరు వరకు ఆరు మాసాల కాలాన్ని పరిగణనలోకి తీసుకొని పరిష్కారంలో మంత్రుల పనితీరు ఎలా ఉందనే అంశాన్ని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం ప్రస్తావించారు. తాను ఆరవ స్థానంలో ఉన్నట్లు స్వయంగా ప్రకటించిన చంద్రబాబు ఆరు నెలల్లో అందరికన్నా వేగంగా ఫైళ్లను పరిష్కరించి మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తొలిస్థానంలో ఉన్నట్లు చెప్పారు. అలాగే మంత్రులందరూ ఎవరెవరు ఏ స్థానాల్లో ఉన్నారన్న విషయాన్ని కూడా ప్రకటించారు. అందులో జిల్లాకు చెందిన డాక్టర్ స్వామి 5వ స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. సీఎం 6వ స్థానంలో, డిప్యూటీ సీఎం 10వ స్థానంలో, నారా లోకేష్ 8వస్థానంలో ఉండగా ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 13వ స్థానంలో ఉన్నారు.

పాఠశాలల హేతుబద్ధీకరణ పూర్తి

పునర్నిర్మాణ ప్రక్రియకు కలెక్టర్ ఆమోదం



విద్యాశాఖ అధికారితో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాఠశాలల హేతుబద్ధీకరణకు విద్యాశాఖ రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆమోదించారు. జిల్లాలో పాఠశాలల పునర్నిర్మాణానికి సంబంధించి మండలాల వారీగా తయారుచేసిన పీపీటీలను ఆమె సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాలతో బడులను హేతుబద్ధీకరించేందుకు పాఠశాల యాజమాన్య కమిటీల అభిప్రాయాలను సేకరించారు. తదనుగుణంగా జిల్లాలోని 38 మండలాల పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియను ఆమోదించడంతోపాటు కొన్నిచోట్ల చిన్నచిన్న మార్పులు చేయాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు సమర్పించిన వివరాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలల హేతుబద్ధీకరణకు తీసుకున్న పలు అంశాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఈవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఐదు పోస్టులకు..

ఒక్కరు

- మరో మూడు పోస్టులలో ఇంకొకరు
- జలవనరులశాఖలో విచిత్ర పరిస్థితి
- డీఈలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తే ఈఈ పోస్టులు భర్తీ

ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సాగునీటి వనరులను పర్యవేక్షించే జలవనరులశాఖ ఒంగోలు కేంద్రంగా ఉన్న సర్కిల్ పరిధిలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. అత్యంత కీలకమైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పోస్టులు పలు రెగ్యులర్ అధికారులు లేక ఖాళీగా ఉండగా ఒకే అధికారి ప్రస్తుతం ఐదు పోస్టులు నిర్వహిస్తున్నారు. మరో అధికారి మూడింటిలో కొనసాగుతున్నారు. ఒంగోలు కేంద్రంగా ఉన్న సర్కిల్ పరిధిలో సుమారు 4.47 లక్షల ఎకరాల ఆయకట్టు ఎన్ఎస్‌పీ పరిధిలోనూ, 40వేల ఎకరాలు మీడియం, లక్షా 35వేల ఎకరాలు మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్నాయి. అంటే ఉమ్మడి జిల్లాలోని మొత్తం సాగర్ ఆయకట్టు, మోపాడు రిజర్వాయర్, కంభం చెరువు, పీబీ ఆనకట్ట వంటి మీడియం, 953 సాగునీటి చెరువులు అన్ని ఈ సర్కిల్ పరిధిలో ఉంటాయి. వాటి పర్యవేక్షణ ఒంగోలు సర్కిల్ ఎస్ఈ చూస్తుండగా అత్యంత కీలకమైన డివిజన్‌స్థాయి ఈఈలు ఎనిమిది మంది ఉంటారు. వాటిలో ప్రస్తుతం ఎస్ఈగా రెగ్యులర్ అధికారైన వరలక్ష్మి మూడు మాసాల క్రితం బాధ్యతలు స్వీకరించి పనిచేస్తుండగా ఎన్ఎస్‌పీ విభాగంలో ఉన్న మూడు ఈఈ పోస్టులలో ఒక్కరే ఉన్నారు.

దర్శి ఈఈకి 4 ఇన్‌చార్జి బాధ్యతలు

- గతంలో చీమకుర్తికి ఈఈగా ఉన్న అధికారి పదోన్నతిపై లింగంగుంట్ల ఎస్ఈగా వెళ్లగా అద్దంకి ఈఈని ఒంగోలులోని ప్రాజెక్టుల ఎస్ఈగా నియమించారు.
- దర్శిలో ఈఈగా రామకృష్ణ ఉన్నారు. ఆయన గతంలో ఎస్ఈ కార్యాలయంలో డిప్యూటీ ఎస్ఈగా పనిచేస్తుండగా దర్శి ఈఈగా బదిలీ చేశారు.
- ఇటీవల ఉద్యోగోన్నతిపై అద్దంకి, చీమకుర్తి ఈఈలను బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానాల్లో ఇంతవరకు ఎవరిని

మిగతా 6లో...

ఐదు పోస్టులకు.. ఒక్కరు

(5వ పేజీ తరువాయి)
నియమించలేదు.

● ఎస్ఈ ఆఫీసులో డీఈఈగా ఉన్న అధికారిని దర్శికి మార్చారు. ఎస్ఈ ఆఫీసులో ఎవరిని నియమించలేదు. మూడు ఈఈ పోస్టులు ఖాళీగా ఉండగా ప్రస్తుతం దర్శి ఈఈగా ఉన్న రామకృష్ణ దర్శిలో రెగ్యులర్ బాధ్యతలతోపాటు ఒంగోలు ఎస్ఈ కార్యాలయంలో డీఎస్ఈ పోస్టు, చీమకుర్తి ఈఈ పోస్టులకు మూటింటికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

● ఒంగోలులోని గెస్టుహౌస్ ప్రాంగణంలో ఉన్న ఎన్ఎస్‌పీ నిర్వహణ అనే మరో ఈఈ పోస్టును కూడా చాలాకాలంగా ఇన్‌చార్జిగా ఉన్నారు. అంటే రామకృష్ణ అనే అధికారి ఈఈతోపాటు మరో నాలుగు ఇన్‌చార్జిలు కలిపి మొత్తం ఐదు పోస్టులలో ఒక్కడే పనిచేస్తున్నారు.

● సాగర్ నీరు ఆయకట్టు భూములకు అందించడం, తాగునీటి వనరులకు చేర్చడంలో ఈఈ స్థాయి అధికారి అత్యంత కీలకం. అదేసమయంలో సర్కిల్ కార్యాలయంలో మొత్తం క్షేత్రస్థాయి శాఖపరమైన ఉత్తర, ప్రత్యుత్తరాలు, ఇతర నిర్వహణ పరమైన అంశాలు, జిల్లా యంత్రాంగం సమీక్షలు, ఉన్నతస్థాయి అధికారులకు నివేదికలు పంపడం వంటి అంశాలలో సర్కిల్ ఆఫీసులోని డీఎస్ఈ పోస్టు చాలా ప్రధానమైనది. అలా కీలకమైన పలు పోస్టులలో ఒకే అధికారి ఉండగా ఆయన సర్కిల్ ఆఫీసులోని డీఎస్ఈ పోస్టు బాధ్యతలతోనే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుండగా ఇతర ప్రాంతాలలో పర్యవేక్షణ కొరవడింది.

● వారానికి ఒకరోజు కష్టమే..

మార్కాపురంలో రెగ్యులర్ ఇరిగేషన్ ఈఈ పోస్టు ఉండగా అక్కడ పూర్ణానందరెడ్డి పనిచేస్తున్నారు. ఆయనకు రాళ్లపాడు ప్రాజెక్టుతో పాటు దోర్నాలలోని వెలిగొండ ప్రాజెక్టు ఈఈ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలా మూడు పోస్టులలో ఆయన కొనసాగుతున్నారు. ఒంగోలు రెగ్యులర్ ఈఈ పోస్టులో డీఈ స్థాయి అధికారైన శివరాం ఇన్‌చార్జిగా ఉన్నారు. అలా ఇతర ఈఈ పోస్టుల్లోనూ డీఈలను ఇన్‌చార్జిలుగా నియమించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం స్థానిక అవసరాలకు అనుగుణంగా జిల్లాస్థాయిలో సర్దుబాటుకు అవకాశం కల్పించలేదు. దీంతో ఐదు కీలక పోస్టులలో ఒకరు, మరో మూడింటిలో ఇంకొక అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కీలకమైన ఈ సమయంలో కనీసం వారు ఇన్‌చార్జిలుగా ఉన్న కార్యాలయాలకు వారానికి ఒకరోజు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక సాగునీటి పర్యవేక్షణ, పనుల పరిశీలన, కార్యాలయాలకు వచ్చే రైతులు, ఇతర ప్రజలకు సమాధానం చెప్పే పరిస్థితి లేకుండాపోయింది.

కొత్త మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

- వ్యాపారులు సహకరిస్తే మరింతగా అభివృద్ధి
- సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా
- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వెల్లడి


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటి మేయర్ బుజ్జి, కార్పొరేటర్ శైలజ

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కొత్త కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, అందుకోసం అందరూ సహకరిస్తే మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. గురువారం ఒంగోలులోని ఊరచెరువులో గల దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. ఈ మేరకు అక్కడి వ్యాపారులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. మార్కెట్ ఆరుబయట అమ్మకాలను కార్పొరేషన్ అధికారులు తొలగించారని, అలాగే దుకాణాలకు సంబంధించి అద్దె బకాయిలకు వడ్డీని మినహాయించాలని, దాంతోపాటుగా కొవిడ్ సమయంలో వ్యాపారాలు లేక తీవ్ర ఇబ్బందులు పడినందున ఆ రెండేళ్ల అద్దె లేకుండా చూడాలని కోరారు. మార్కెట్ నిర్మాణం బాగాలేనందున ఇబ్బందులు వస్తున్నాయని పలువురు వ్యాపారులు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తానని, అయితే అందరి సహకారంతోనే సాధ్యపడుతుందన్నారు. ముఖ్యంగా అద్దెలు సక్రమంగా చెల్లించకపోవడంతో వడ్డీలు పెరిగాయన్నారు. వడ్డీ మాఫీ, అద్దె మినహాయింపులు ప్రభుత్వ మునిసిపల్ గజిట్ ఆమోదం మేరకు నిర్ణయం ఉంటుందని, అది అధికారులు, ప్రజాప్రతినిధుల పరిధిలోనిది కాదని చెప్పారు. ఇప్పటికే హోల్‌సేల్ దుకాణంలో రూ.5.2కోట్లు, రిటైల్ షాపుల్లో రూ.4.8 కోట్లు పెండింగ్ ఉండగా, ఇతర దుకాణాల్లో మరో రూ.2కోట్లు పెండింగ్ ఉందన్నారు. వ్యాపారాలు సజావుగా జరగాలంటే ఎవరికి కేటాయించిన దుకాణాల్లో వారే ఉండటం వల్ల అందరికీ న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. బకాయిలను వీలైనంత త్వరలోనే వాయిదాల పద్ధతిన చెల్లించాలని తెలిపారు. వ్యాపార రంగంలోనే పేరు ఉన్న కర్నూలు రోడ్‌కు దగ్గరలో మార్కెట్ ఉందని, ఆ ప్రాంతంలో రూ.లక్షల్లో అద్దెలు ఉండగా, మార్కెట్‌లో వ్యాపారులను దృష్టిలో ఉంచుకుని రూ.వేలలోనే అద్దెకు కేటాయించినట్లు పేర్కొన్నారు. వ్యాపారులు వాస్తవ పరిస్థితుల గురించి ఆలోచించాలన్నారు. యూనియన్ నాయకులు కూడా వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని దామచర్ల సూచించారు. కూరగాయల మార్కెట్ వ్యవహారంలో ఎలాంటి రాజకీయాలు ఉండవని, అందరూ సామాన్య, పేద, మధ్యతరగతి వారే అన్నారు. వారి జీవనోపాధుల రీత్యా వ్యాపారాలు చేసుకుంటున్నందున సమష్టిగా కలిసి మార్కెట్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. దుకాణాలకు పెయింటింగ్, కాపలాగా వాచ్‌మెన్‌లు, లైటింగ్, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం మెరుగు వంటివి సౌకర్యాలు ఏర్పాటు చేస్తానని చెప్పారు. అనంతరం కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అద్దె బకాయిలు చెల్లింపుకు మూడు వాయిదాల అవకాశం కల్పిస్తామన్నారు. వడ్డీ మినహాయింపు, రెండేళ్ళు అద్దె రద్దు అవకాశం లేదని, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి వెంకట సూర్యనారాయణ (బుజ్జి), కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, కార్పొరేషన్ అధికారులు, వ్యాపారుల సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు.

12నుంచి బెంగళూరులో స్టోనా మహోత్సవం

- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- జిల్లా నుంచి స్టాల్స్ ఏర్పాటు చేయనున్న ప్రముఖ కంపెనీలు

చీమకుర్తి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే అతిపెద్ద స్టోన్ ప్రదర్శనగా భావించే స్టోనా మహోత్సవాన్ని ఈనెల 12నుంచి 15వ తేదీ వరకు బెంగళూరు శివారున నిర్వహించనున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ గ్రానైట్ అండ్ స్టోన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్టోనా అంతర్జాతీయంగా పేరుగాంచింది. 1987వ సంవత్సరం నుంచి స్టోనాను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమకు ఈ స్టోనా వరంలాంటిది. దేశ, విదేశాలనుంచి విచ్చేసే బయ్యర్లు ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఉంచిన గ్రానైట్ ఉత్పత్తులను చూసి కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. దీంతో పాటు క్వారీయింగ్ ప్రక్రియలో ఉపయోగించే అధునాతన పరికరాలను ప్రదర్శనలో ఉంచుతారు. వాటిని కొనుగోలు చేసుకొనే అవకాశం క్వారీ ఓనర్లకు లభిస్తుంది. పరిశ్రమలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, పరిశ్రమ అభివృద్ధిపై చర్చించటానికి సెమినార్లు నిర్వహిస్తారు. దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, నిపుణులు, ఈ సెమినార్లలో పాల్గొంటారు. కాగా 12 తేదీ నుంచి జరగనున్న 16వస్టోనాలో తమ ఉత్పత్తులను ప్రదర్శించటానికి, స్టాల్స్ ఏర్పాటు చేయటానికి జిల్లాలో ఉన్న ప్రముఖ గ్రానైట్ కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఈసారి ఈ-స్టాల్స్‌ను ఏర్పాటు చేయటానికి కూడా అనుమతినివ్వటం విశేషం. కంపెనీ ప్రతినిధి స్టోనాలో పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శన ఈస్టాల్స్ ద్వారా కూడా చేసే అవకాశం ఇవ్వటం వల్ల ఖర్చు తగ్గటంతో పాటు బయ్యర్లను ఆకర్షించే విధంగా ప్రజెంటేషన్ కూడా చేసే అవకాశం లభిస్తుంది. ఈ స్టోనాలో జిల్లా నుంచి గ్రానైట్ క్వారీ, ఫ్యాక్టరీ ఓనర్లు పెద్దఎత్తున పాల్గొననున్నారు. గ్రానైట్ పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావాలని పరిశ్రమ వర్గాలు కోరుకుంటున్నాయి.


గత స్టోనాలో ప్రదర్శించిన గ్రానైట్ ఉత్పత్తులు, స్టాల్స్

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కుడిచేయి మణికట్టు, కాళ్లకు తీవ్ర గాయాలు
- మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలింపు


తీవ్ర గాయాలతో ఏరియా వైద్యశాలలో సత్యనారాయణ

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఆర్వోబీ వంతెన సమీపంలో స్థానిక హరి ప్రసాద్ నగర్‌కు చెందిన కన్నపరెడ్డి సత్యనారాయణ గురువారం రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో అతని కుడిచేయి మణికట్టు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. రైల్వే పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : అప్పు చెల్లించే విషయంలో తల్లిపై మనస్తాపం చెందిన కుమార్తె(వివాహిత) ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ఉరి నుంచి తప్పించి చీరాల్లోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామంలోనే మరొకరి వద్ద తల్లికి కొంత అప్పు ఇప్పించగా అవి చెల్లించే క్రమంలో జాప్యం జరిగింది. ఈక్రమంలో అప్పు ఇచ్చిన వారు కుమార్తెను నిలదీశారు. ఈవిషయంపై తల్లీకూతుళ్ల మధ్య వాదన జరిగింది. దీంతో మనస్తాపం చెందిన కుమార్తె గురువారం ఈ ఘటనకు పాల్పడింది.

వరిగడ్డి వామి దగ్ధం

మార్టూరు,ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో ఎస్టీకాలనీ సమీపంలో చెరువుకట్టపై గురువారం మల్లా వీరయ్యకు చెందిన వరిగడ్డి వామి దగ్ధమయింది. సుమారు రూ. 12 వేల విలువైన ట్రాక్టరు గడ్డి కాలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. గడ్డివామి నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు సమీపంలో ఉన్న చెరువులోనుంచి ట్యాంకరుతో నీటిని తీసుకువచ్చి మంటలను ఆర్పివేశారు.అయితే అప్పటికే గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది.

20 కేసులు నమోదు

ఇంకొల్లు,ఫిబ్రవరి 6,(ఆంధ్రజ్యోతి) : స్థానిక జెండా చెట్టు కూడలిలో ఇంకొల్లు ఎస్సై సురేష్ గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సక్రమంగా రికార్డులు లేని లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై 20 కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.1200 జరిమానా విధించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

వేటకువెళ్లి సముద్రంలో అదృశ్యం

- ఐదు రోజులైనా కానరాని ఆచూకీ
- రోదిస్తున్న మత్స్యకార కుటుంబం



విచార వదనంలో మత్స్యకారుడి బంధువులు (ఇన్‌సెట్లో) అదృశ్యమైన రమణ (ఫైల్)

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బతుకు పోరాటంలో సముద్రతీరంలో ప్రమాదవశాత్తు అదృశ్యమయ్యాడు. ఎంత వెదికినా ఆచూకీ లేదు. దీంతో వాడరేవు మత్స్యకార కుటుంబం రోదిస్తోంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని వాడరేవు గ్రామానికి చెందిన ఓసిపిల్లి రమణ(53)మత్స్యకారుడు. ఇతనికి భార్య నూకమ్మ, కుమారుడు సత్తిబాబు, ఇద్దరు కుమార్తెలు. ఆదివారం ఉదయం మనవడు చింతకాయల ప్రసాద్, మురళీ, పారా సూరిరావులతో కలిసి రమణ చేపల వేటకు వెళ్లాడు. ఈక్రమంలో రాత్రి సమయంలో సముద్రంలో బోటులో ప్రయాణిస్తూ సుమారు 100 కిలో మీటర్లు మేర విజయవాడలోని బందరు వైపు వేటకు వెళ్లారు. అక్కడ బోటులోనే మనవడితో అర్ధరాత్రి వరకు సరదాగా మాట్లాడుకున్నారు. బాగా ఆలస్యం కావడంతో ఇక పడుకుందామని చెప్పడంతో అందరూ పడుకున్నారు. 3 గంటల సమయంలో టీ పెట్టుకునేందుకు లేచి చూడగా తాత బోటులో కనిపించలేదు.. దీంతో బిత్తరపోయిన మనవడు ప్రసాద్ మిగిలిన వారితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. కనిపించిన బోట్లలోని మత్స్యకారులందరిని ఆరా తీశారు. ప్రయోజనం లేకపోవడంతో మరుసటి రోజు ఉదయం సోమవారం కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈక్రమంలో సుమారు ఐదు రోజులుగా గాలింపు చేస్తూనే ఉన్నారు. అయినా కుటుంబ పెద్ద జాడలేకపోవడంతో ఇప్పటికే ఆశలు వదిలిన కుటుంబ సభ్యులు చివరి చూపయినా దక్కాలని వేడుకుంటున్నారు. ఈ హృదయ విదారక ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

వద్దన్నా.. ఆటోల్లోనే.. తనిఖీలతో అవస్థలు


దర్శి రోడ్డులో నుంచి అద్దంకి పట్టణంలోకి బారులుగా నడిచి వస్తున్న కూలీలు

- పోలీసుల మూకుమ్మడి చెకింగ్‌లు
- మార్గ మధ్యంలోనే కూలీలను వదిలేస్తున్న డ్రైవర్‌లు
- కాలి నడకతో ఇళ్లకు చేరిక

అద్దంకి, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా పోలీస్ అధికారులు మూకుమ్మడిగా గురువారం సాయంత్రం తనిఖీలు చేపడ్డటంతో ఆటోల డ్రైవర్‌లు ఎక్కడికక్కడ నిలిపి వేసి అందులో ప్రయాణించే కూలీలను రోడ్డు పైనే వదిలివేయటంతో వారికి కాలి నడక తప్పలేదు. అద్దంకి పట్టణంతో పాటు సమీప గ్రామాల నుంచి ముండ్లమూరు, తాళ్లూరు మండలాలలో మిర్చి కోతలకు , తిమ్మాయపాలెం వద్ద ఇటుక బట్టీల పనులకు నిత్యం వందల సంఖ్యలో కూలీలు వెళ్ళి వస్తుంటారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ట్రాలీ ఆటోలతో పాటు ప్రయాణికుల ఆటోలలో పరిమితికి మించి వెళుతూ ప్రమాదపు అంచున ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఆటోలు అదుపు తప్పి బోల్తాపడి ప్రయాణికులకు తీవ్ర గాయాలు కూడా అయ్యాయి. ప్రమాదమని తెలిసి కూడా అవసరం కోసం కూలీలు ఆటోలలో ప్రయాణాలు సాగిస్తూనే ఉన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా గురువారం సాయంత్రం సీఐ సుబ్బరాజు, ఎస్సైలు ఖాదర్ బాషా, రవితేజలు అద్దంకి పట్టణంతో పాటు తిమ్మాయపాలెం, కలవకూరు రోడ్డులలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. దీంతో పోలీస్ అధికారులకు దొరికిపోతామని ఆటో డ్రైవర్‌లు కూలీలను ఎక్కడికక్కడ దించి వెళ్లిపోయారు. దీంతో కూలీలు వందల సంఖ్యలో కాలినడకన రెండు, మూడు కిలోమీటర్ల దూరం తిమ్మాయపాలెం నుంచి అద్దంకి పట్టణంలోని వివిధ కాలనీలకు చేరుకున్నారు.

పోలీస్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేసిన నేపథ్యంలో వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లే సమయాలలో ఆయా రూట్లలో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా చర్యలు చేపడితే వారికి రవాణా కష్టాలు తప్పటం తో పాటు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి కూలీలు పనులకు వెళ్లే రూట్లను గుర్తించి ఆయా సమయాలలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు సూచిస్తున్నారు.


తిమ్మాయపాలెం వద్ద తనిఖీల కోసం ఉన్న ఎస్సై రవితేజ, సిబ్బంది

అవీఇవీ

అమ్మనబ్రోలులో చోరీ


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో డూప్లికేట్ తాళంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు, అమ్మనబ్రోలు గ్రామంలోని రైల్వేస్టేషన్‌ప్రాంతానికి చెందిన రావినూతల సురేష్ ఆటోడ్రైవర్‌గా ఆయన భార్య తిరుపతమ్మ అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం సురేష్ ఆటో తీసుకొని ఒంగోలు వెళ్లారు. తిరుపతమ్మ స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహించేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళంతో పాటు బీరువా తాళంను తమ వెంట తెచ్చుకొన్న డూప్లికేట్ తాళంతో తీసి బీరువాలోని 30 గ్రాముల బంగారు చైను, బుట్టకమ్మలు, ఇతర వెండి వస్తువులతో పాటు రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన తిరుపతమ్మ ఇంటి తాళం తీసినట్లుగా గుర్తించి లోపలకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీకి పాల్పడింది స్థానికులుగా అనుమానిస్తున్నారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఓ రేషన్‌షాపులో ఉండాల్సిన వాటికన్న అధికంగా రేషన్ బియ్యం నిల్వలు ఉండటంతో బుధవారం రాత్రి 10 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మంగమూరు గ్రామంలో షాపునెంబరు 14పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీలు దాడి చేసి తనిఖీలు చేశారు. రేషన్ బియ్యం అధికనిల్వలు ఉండటంతో 6ఏ కింద కేసునమోదు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవితేజ పాల్గొన్నారు.

భలే 'సౌర'భాలు!

(5వ పేజీ తరువాయి)
సౌరశక్తి తయారీ కోసం వ్యయం రూ.2లక్షలు ఉంటే సబ్సిడీ రూ.78వేలు పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంక్‌లు రుణంగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. మూడు కిలోవాట్ల యూనిట్ ద్వారా నెలకు 375 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ఈ మొత్తంలో యజమాని వినియోగించుకున్న విద్యుత్ పోను మిగిలిన దానిని విద్యుత్ శాఖ కొనుగోలు చేస్తుంది. అదే సమయంలో నెలవారీ విద్యుత్ బిల్లులు చెల్లించకుండా బ్యాంకు రుణం తీర్చుకోవచ్చు.

ఎస్సీ, ఎస్టీలతో రిజిస్ట్రేషన్

జిల్లాలో ఇప్పటికే ఉచిత విద్యుత్ 200 యూనిట్లు పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు 1.21లక్షల మంది ఉన్నారు. వారందరికీ సోలర్ పవర్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందుకుగాను వారందరితో పీఎం సూర్యఘర్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయిస్తోంది. ఇప్పటివరకు 80వేల మంది యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరికి ఎలాంటి ఖర్చులేకుండా ప్రభుత్వం కాంట్రాక్టర్ల ద్వారా సోలార్ యూనిట్ ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. అదే సమయంలో వారి ఇంటిపై సోలార్ యూనిట్ పెట్టినందుకు అద్దె రూపేణా కూడా చెల్లించాలని ప్రతిపాదన ఉంది. ఒకవేళ ఎస్సీ, ఎస్టీ ఇళ్లపై ప్యానల్స్ ఏర్పాటు చేసే అవకాశం లేకుంటే సామూహికంగా ప్రభుత్వ స్థలంలో పలకలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందుకు సంబంధించి స్థలాల పరిశీలన కూడా జరుగుతోంది.

ప్రభుత్వ భూముల్లో ప్లాంట్లు

వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు ఉచిత విద్యుత్ అందించేందుకు కూడా సోలార్ పవర్‌ను వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక మెగావాట్ సోలర్ ప్లాంట్ ఏర్పాటుకు నాలుగు ఎకరాలు భూమి అవసరం. ప్రైవేటు భూమి అయితే ఎకరాకు ఏడాదికి రూ.31వేలు కౌలు ఇచ్చే విధంగా ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రభుత్వ భూములు ఉన్నచోట ప్యానళ్లు ఏర్పాటు చేయనున్నారు. అందుకు సంబంధించి జిల్లాలో ఒక్కో ప్లాంట్ 8.5 మెగావాట్లు సోలర్ పవర్‌ను ఉత్పత్తి చేసే విధంగా 19 ప్యాకేజీలుగా విభజించి అందుకు అనువైన స్థలాలను పరిశీలన చేస్తున్నారు. ఈ పథకంలో ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించనున్నారు. ఒక మెగావాట్ ఉత్పతికి రూ.4కోట్లు ఖర్చయితే రూ.కోటి వరకు ప్రభుత్వం సబ్సిడీగా ఇవ్వనుంది. వారు రైతులకు సోలార్ పవర్‌ను ఉచితంగా సరఫరా చేసి మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి అమ్ముకునే అవకాశం కల్పించనున్నారు. దీంతో పారిశ్రామికవేత్తలకు ఆదాయంతోపాటు రైతులకు ఉచిత విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేసే అవకాశం ఉంది.

పొగాకు మార్కెట్ హాట్‌హాట్

(5వ పేజీ తరువాయి)
ఎన్‌వోడీ బేళ్లను సైతం కిలో రూ.220పైగా కొంటున్నారు. ఇప్పటివరకు అక్కడ 51 మిలియన్ కిలోలు కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.268 ధర లభించింది. ఒక్కసారిగా ఈ స్థాయిలో అక్కడ ధరలు పుంజుకోవడానికి ప్రధాన కారణం పలు కంపెనీలకు విదేశీ ఆర్డర్లు ఖారారు కావడమేనని తెలుస్తోంది. సాధారణంగా కర్ణాటకలో ఈ సమయంలో రోజువారీ వేలంకేంద్రాలకు సగటున 1,200 నుంచి 1,500 బేళ్లు వస్తుంటాయి. అలాంటిది ఇప్పుడు 800 నుంచి వెయ్యి బేళ్ల వరకు మాత్రమే వస్తున్నట్లు సమాచారం. దీంతో వచ్చి బేళ్ల కోసం వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తుండటంతో ఆ మేర ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే మార్కెట్ తాత్కాలికమేనని రానున్న రోజుల్లో అక్కడ కూడా మళ్లీ ధరలు తగ్గే అవకాశం ఉంటుందని పొగాకు రంగంలోని నిపుణులు చెప్తున్నారు. ఆంధ్ర మార్కెట్‌ప్రారంభం నాటికి ధరలు మరింత తగ్గే అవకాశం ఉండే అవకాశాలు ఉన్నాయని చెప్తున్నారు.

రేపు జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 9,11 తరగతుల్లో ప్రవేశించేందుకు శనివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ వీకే.గీతలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కామన్ సర్వీసు సెంటర్ల ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. హాల్ టిక్కెట్లతో తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలని ఆమె సూచించారు.

ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయంలో పని చేసే ఉద్యోగులు సమయపాలన పాటించి సకాలంలో కార్యాలయానికి హాజరు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య ఆదేశించారు. గురువారం మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆ యా విభాగాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న చిన్నారులకు సంబంధించి ఆధార్ కార్డులు ఉన్నాయా, లేవా అనే విషయాలను వెంటనే పరిశీలించి తగిన సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావు, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పక్షులు పరిస్థితులను పసిగట్టగలవు.. వాతావరణాన్ని అంచనా వేయగలవు.. ఎక్కడ అనుకూలమో.. ఎక్కడ అననుకూలమో ఇట్టే తెలుసుకోగలవు.. నివాసయోగ్యమైన ప్రాంతాలను సరిగ్గా వెదుక్కోవడంలో వాటికి అవే సాటి.. ఎంపిక చేసుకున్న ఆవాసాలకు మిగిలిన పక్షుల గుంపును వేల కిలోమీటర్ల దూరం నుంచి రప్పించడంలో కొన్ని సంకేతాలు, సంజ్ఞలు ఇస్తుంటాయి. వాటిల్లో నైజీరియా పక్షులకు పరిసరాల పరిజ్ఞానం అమోఘం.. వాటి రాక, పోక తదితర విషయాలేంటో తెలుసుకుందాం...!






మైలవరంలో చెట్లపై వందల సంఖ్యలో ఉన్న నైజీరియా పక్షులు

- వసతులు లేక విడిదిని మార్చిన నైజీరియా పక్షులు
- వెలమవారిపాలెం నుంచి మైలవరం రాక
- చెట్లు లేకపోవడంతో ఊరు మార్చినట్లు అంచనా
- ఇక్కడా వసతులు అంతంతమాత్రమే
- ప్రత్యేక దృష్టిసారిస్తే భవిష్యత్‌లో విడిదికి అవకాశం

మకాం మార్చాయి..!

అద్దంకి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది నూతన సంవత్సరం వచ్చే సరికి బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వెలమవారిపాలెం నైజీరియా పక్షుల కిలకిలరావాలతో సందడిగా ఉండేది. గత ఏడాది నుంచి విదేశీ పక్షులు ఆ ఊరికి రాం..రాం పలికాయి. వందల ఏళ్ల నుంచి ప్రతి ఏటా డిసెంబరు చివరి నుంచి జనవరి మొదటి వారంలోపు నైజీరియా నుంచి పక్షులు గుంపులుగుంపులుగా వచ్చి చెట్లపై గూళ్లు ఏర్పాటు చేసుకొంటాయి. ఆరు నెలల పాటు ఉండి గుడ్లు పెట్టి పిల్లలను చేసి పెంచుకొని తిరిగి స్వదేశానికి వెళ్తాయి. వెలమవారిపాలెం గ్రామస్థులు కూడా విదేశీ పక్షులను ఎంతో ఆప్యాయంగా చూసుకునేవారు. వీటి కోసం నీటికుంట కూడా తవ్వించారు. కాలక్రమేణా విదేశీ పక్షులు నివాసం ఉండే పెద్ద పెద్ద చింత చెట్లు, ఇతర చెట్లు తగ్గిపోయాయి. ప్రస్తుతం పెద్ద చెట్లు లేకపోవడంతో గతేడాది నుంచి వెలమవారిపాలెంకు పక్షులు రావడం మానుకున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాదే అద్దంకి మండలం మైలవరానికి కొద్ది సంఖ్యలో మాత్రమే నైజీరియా పక్షులు వచ్చాయి. ఏటా జనవరి మొదటివారంలోనే వచ్చే ఈ పక్షులు ఈ ఏడాది నెల రోజులు ఆలస్యంగా మైలవరం చెరువు వద్దకు వచ్చాయి. ఐదు చెట్ల నిండా వందల సంఖ్యలో పక్షులు నిండిపోయాయి. పర్యాటకరంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్న నేపథ్యంలో విదేశీ పక్షుల విడిదిగా ఉన్న వెలమవారిపాలెం, మైలవరంలో అభివృద్ధి చేయాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.





పక్షులు వాలుతున్న చెరువు గట్టు వెంబడి చెట్లు ఇవే...

మైలవరంలో ఉన్న వసతులు

మైలవరం గ్రామ సమీపంలో గుండ్లకమ్మ నదితోపాటు వెంపరాల, భవనాసి చెరువుల నిండా నీరు ఉండటంతో పక్షుల ఆహారానికి కొదవ లేదు. గుడ్లు పెట్టుకునేందుకు ఉన్న ఐదు చెట్లపైనే సుమారు 200 విదేశీ పక్షులు ఉన్నాయి. బల్లికురవ మండలం వెలమవారిపాలెం, అద్దంకి మండలం మైలవరం పక్క పక్క గ్రామాలు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి వెలమవారిపాలెం, మైలవరం ప్రాంతాలలో ప్రభుత్వ భూమిని గుర్తించి చెట్ల పెంపకం చేపడితే భవిష్యత్‌లో కూడా విదేశీ పక్షులు వచ్చి విడిది చేసే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

నేడు, రేపు ఢిల్లీలో మంత్రి స్వామి

8న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వర్క్‌షాపునకు హాజరు

ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి శుక్ర, శనివారాల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. కేంద్ర సామాజిక న్యాయమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఢిల్లీలో దేశంలోని అన్ని రాష్ట్రాల పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రులతో ఉన్నత స్థాయి వర్క్ షాపు జరగనుంది. ఆదర్శ గ్రామ యోజన పథకం, అలాగే పీఎం అజిమ్ పథకాలపై కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ నేతృత్వంలో ఈ వర్క్‌షాపు జరగనుంది. ఎస్సీ జనాభా 40శాతం కన్నా అధికంగా ఉండే గ్రామాల్లో మౌలిక సౌకర్యాల పెంపు లక్ష్యంగా ఈ పథకాలను కేంద్రం నిర్వహిస్తోంది. ఆ పథకం కింద భారీగా కేంద్రం నుంచి గ్రాంటు రూపంలో నిధులు రానున్నాయి. తొలిదశ కార్యక్రమాలు గతంలోనే కేంద్రం చేపట్టగా అప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదు. త్వరలో రెండో దశ కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈనెల 8న ఉన్నత స్థాయి వర్క్‌షాపును కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ఏర్పాటు చేసింది. ఆ వర్క్‌షాపునకు రాష్ట్రం తరఫున మంత్రి డాక్టర్ స్వామి ఢిల్లీ వెళ్తున్నారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ వెళ్లే స్వామి తొలుత సంబంధిత కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి నిధులు పెంపుపై చర్చించనున్నారు అలాగే 8వ తేదీన వర్క్‌షాపునకు హాజరై ఆ రాత్రికి తిరిగి వచ్చి 9వ తేదీన ఒంగోలులో జరిగే జిల్లా పరిషత్ సమావేశానికి హాజరవుతారని సమాచారం.

ట్రాక్టర్, ఆటో ఢీ.. ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

సంతనూతలపాడు, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): టాక్టర్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి సంతనూతలపాడు-చంద్రపాలెం గ్రామాల మధ్య ఉన్న ఎన్ఎస్‌పీ కాలువ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. సంతనూతలపాడు నుంచి చంద్రపాలెం వైపునకు వెళ్తున్న ట్రాక్టర్, ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఆటోలోని ఒక మహిళ మృతి చెందగా, మరోముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

స్కూల్ బస్సు ఢీకొని మహిళ మృతి



ప్రమాద స్థలంలో పక్కకు వెళ్లిన బస్

మద్దిపాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని వెల్లంపల్లి-తాళ్లూరు రహదారిపై కొలచనకోట సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం, కొలచనకోట గ్రామానికి చెందిన మోరబోయిన సుబ్బారావు తన భార్య రాములుతో కలిసి పొలంలో గడ్డికోసుకొని గ్రామానికి వెళుతున్నారు. ఈక్రమంలో వెనుకవైపు నుంచి మద్దిపాడులోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెదిన బస్సు ఢీకొనడంతో భార్యాభర్తలు కిందపడిపోయారు. దీంతో వారిని 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో రాములు(46) మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై శివరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

లారీని ఢీకొట్టిన ట్రావెల్ బస్సు

- పొగమంచు కారణంగా ఘటన
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన బస్సు

సింగరాయకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై వెళ్తున్న ట్రావెల్స్ బస్సు పొగమంచు కారణంగా ముందు ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందువైపు బస్సు అద్దాలు పగిలిపోయాయి. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో తృటిలో పెనుప్రమాదం నుంచి ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలో ఉన్న లారీ యూనియన్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. బెంగుళూరు నుంచి రాజమండ్రి వెళ్తున్న ట్రావెల్స్ బస్సు గురువారం తెల్లవారు జామున లారీ యూనియన్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో దట్టమైన పొగమంచు కారణంగా ముందు వెళ్తున్న లారీ కనపడకపోవడంతో దానిని ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో అందులో ప్రయాణిస్తున్న 40 మంది ప్రయాణికులు ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకొన్న హైవే మొబైల్ పోలీసులు, స్థానిక పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన చోట ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రయాణికులను ఇతర బస్సుల్లో వారి గమ్య స్థానాలకు పంపించారు.

దొంగలను పట్టించిన నిఘా నేత్రాలు

- మోటార్ సైకిళ్లు దొంగలించే యువకుల అరెస్ట్
- రూ. 4 లక్షలు విలువ చేసే 6 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ హజరత్తయ్య



వివరాలను వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ చేసిన మోటార్ సైకిళ్లను దొంగిలించి పోలీసుల కళ్లుగప్పి తిరిగే నిందితులను నిఘా నేత్రాలు పట్టించాయి. చెడు వ్యసనాలకు బానిసలై బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న ఇరువురు యువకులను సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజ్ ఆధారంగా సింగరాయకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.4 లక్షలు విలువ చేసే ఆరు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సింగరాయకొండ సర్కిల్ కార్యాలయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ చావా హజరత్తయ్య కేసు వివరాలను వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. నెల్లూరు జిల్లా కందుకూరు బండపాలేనికి చెందిన నీలిశెట్టి గురునాథం ఆరవ తరగతి వరకు చదువుకొని మధ్యలో చదువు ఆపేసి బేల్దారీ పనులకు హైదరాబాద్ వెళ్లాడు. కొన్నేళ్ల తరువాత మరలా కందుకూరుకి తిరిగి వచ్చాడు. చిన్నతనం నుంచే వ్యసనాలకు అలవాటుపడి నేరాలు చేయడమే ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో ఇతనుకు ఒంగోలుకు చెందిన పాత నేరస్థులు శివ, శ్రీకాంత్‌లతో స్నేహం ఏర్పడింది. వీరంతా కలిసి బస్టాండ్, రైల్వేస్టేషన్ పార్కింగ్ స్థాలాలో ఉంచిన బైక్‌లను టార్గెట్ చేసి వాటిని దొంగిలించే వారు. ఇటీవల మోటార్ బైక్‌ల దొంగతనం కేసులో ఒంగోలు చెందిన శివ, శ్రీకాంత్‌లను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకి పంపించారు. చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటుపడిన గురునాథం మాత్రం మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతూనే ఉన్నాడు. తమ స్నేహితులు ఇరువురు జైలుకి వెళ్లడంతో కందుకూరు బండపాలేనికి చెందిన మరో స్నేహితుడు యనమల దినేష్‌తో కలిసి మోటార్ బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అనంతరం వాటిని తక్కువ ధరలకు అమ్మకాలు చేసి ఇద్దరూ జల్సా చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సింగరాయకొండ బస్టాండ్ ప్రాంగణంలో ఉంచిన 4 మోటార్ బైక్‌లను, రైల్వేస్టేషన్‌లో 1 బైక్‌ను, నెల్లూరు బస్టాండ్‌లో మోటార్ సైకిల్‌ను దొంగలించారు. ఈ నెల 2వ తేదీన కరేడు గ్రామానికి చెందిన కంజుల శంకర్‌రెడ్డి తన మోటార్ బైక్‌ను సింగరాయకొండ బస్టాండ్ ప్రాంగణంలో ఉంచి విజయవాడలో చదువుతున్న తన కుమార్తెను తీసుకురావడానికి వెళ్లారు. మరలా తిరిగి వచ్చి చూసే సరికి అక్కడ తన బైక్ లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచనల మేరకు సీఐ హజరత్తయ్య ఆధర్యంలో ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల ఆధారంగా నిందితులను గుర్తించారు. బుధవారం సింగరాయకొండ జాతీయ రహదారి అండర్‌పాస్ వద్ద ఉన్న బైక్‌ల దొంగతనానికి పాల్పడుతున్న గురునాథం, దినేష్‌లను ఎస్సై మహేంద్ర తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద ఉన్న ఆరు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మోటార్ బైక్‌ల నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంతో ప్రతిభ కనబరిచిన ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్‌బాబు, తిరుపతిస్వామి, భాస్కర్‌లింగంను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



బైక్‌లను పరిశీలిస్తున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర

చిన్నారుల్లో నులిపురుగుల నిర్మూలనకు కృషి

- **జిల్లా వ్యాప్తంగా 5.06 లక్షల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు**
- **6.88 లక్షల ట్యాబ్‌లెట్లను సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 1నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ 400 మి.మీ. ట్యాబ్‌లెట్లు జిల్లాకు చేరాయి. 2,718 పాఠశాలలు, 2,849 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 5,96,751 మంది పిల్లలు ఉన్నారు. అందుకోసం ప్రభుత్వం 6.88 లక్షల ట్యాబ్‌లెట్లను జిల్లాకు పంపింది. ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆ రోజున జిల్లా వ్యాప్తంగా పిల్లలకు ఈ ట్యాబ్‌లెట్లను మింగించేందుకు చర్యలు తీసుకున్నారు.

నులిపురుగులు ఉంటే వచ్చే సమస్యలు

కడుపులో నులిపురుగులు ఉన్న పిల్లలు, కిశోర బాలలు వివిధ రకాల ప్రమాదకరమైన ఆరోగ్యసమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆ వెంటనే రక్తహీనత పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటివి సోకుతుంటాయి. పిల్లలు ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ఒకే రోజున జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ ట్యాబెట్లను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టారు.

మాత్రలు ఎక్కడెక్కడ ఇస్తారంటే...

ఒకటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 6నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు ఇస్తారు. ఆయా కేంద్రాల్లో నమోదు అవ్వని, పాఠశాలలకు వెళ్లని పిల్లలు/కిశోర్‌బాలలకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేశారు. వీటిని పిల్లలకు చేతికి ఇవ్వకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోనే మింగిస్తారు. ఈ మేరకు వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నులిపురుగుల వ్యాప్తిని తగ్గించేందుకు ప్రతి ఒ క్కరూ తమ పిల్లలకు ఆల్బెండజోల్ ట్యాబ్‌లెట్లను ఆరోజున తప్పనిసరిగా మింగించాలని ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి డాక్టర్ భగిరధి కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య
- సమీక్షలో వెల్లువెత్తిన రెవెన్యూ సమస్యలు
- మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై అన్ని గ్రామాల నుంచి ఫిర్యాదులు



మాట్లాడుతున్న దామచర్ల సత్య

పొన్నలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య చెప్పారు. గురువారం పొన్నలూరులో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదేవిధంగా అన్ని గ్రామాల వారీగా ప్రజాసమస్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం సత్య మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు నాయుడు కాపాడుతూనే.. అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. మండలంలో కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు 200 కోట్ల రూపాయల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. అంతేగాక దాదాపు 50 కోట్ల రూపాయలు డ్వాక్రా మహిళలకు రుణాలు ఇచ్చామని చెప్పారు. అదేవిధంగా గ్రామాల్లో, సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు దాదాపు 150 కోట్ల రూపాయలతో జరిగాయన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి, ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ పుల్లారావు, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మాచర్ల, పీఆర్ ఏఈ కోటేశ్వరరావు, వెలుగు ఏపీఎం టి.శ్రీనివాసులు, ఎంఈవో ఇ. రవిచంద్ర, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు కర్నా కోటిరెడ్డి, కొండ్రగుంట శ్రీనివాసరావు, మండవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదులు...

అనంతరం గ్రామాల వారీగా అధికారులతో సత్య సమీక్ష మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఈసందర్భంగా అనేక మంది రెవెన్యూ సమస్యలను సత్య దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో పనులు కావడం లేదని, పాస్ పుస్తకాలు, కొలతలు, ఆన్‌లైన్‌లో సమర్పణల కోసం పదేపదే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని పలువురు ఫిర్యాదు చేశారు. ఆర్‌ఐ పనులు చేయడం లేదని, పదేపదే తిప్పుకుంటున్నారని అనేక గ్రామాల వారు ఫిర్యాదులు చేశారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. పద్ధతి మార్చుకోవాలని, న్యాయంగా ఉన్నవాటిని వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు అర్జీలు సమర్పించారు.

కుక్కల దాడిలో వీఏఏకు గాయాలు



గాయపడ్డ కొండలరావును పరామర్శిస్తున్న ఏవో విజయ్‌కుమార్

కొండపి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వెన్నూరు గ్రామ వీఏఏ జె.కొండలరావు తన స్వగ్రామం సంతనూతలపాడు మండలం మద్దులూరు నుంచి విధులకు మోటార్ సైకిల్‌పై వస్తుండగా అనకర్లపూడి గ్రామం వద్ద వీధికుక్కలు మీదపడి దాడి చేయడంతో గురువారం గాయాలపాలయ్యాడు. విధులకు వస్తున్న కొండలరావుపై కుక్కలు దాడిచేయడంతో ఆ దారిలో వస్తున్న వాహనదారులు కుక్కలను తరిమి కొండలరావును కొండపి సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న ఏవో డి.విజయ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి కుమార్ కొండలరావును సాయంత్రం సీహెచ్‌సీలో పరామర్శించారు.

కాటేస్తున్న కాలుష్యం..

చీమకుర్తి-మర్రిచెట్లపాలెం మధ్య

గ్రానైట్ పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న దుమ్ము, ధూళి

వాహనదారుల ఇక్కట్లు



దుమ్ముతో నిండిపోయిన రోడ్డు



వాహనాల రాకపోకలతో లేచిన గ్రానైట్ డస్ట్



ముఖానికి కర్చీఫ్ కట్టుకుని ప్రయాణిస్తున్న వాహనదారుడు

చీమకుర్తి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి) : గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ యజమానులకు సిరులు కురిపిస్తుండగా ఇది వెదజల్లుతున్న కాలుష్యం కోరల్లో ప్రజలు చిక్కుకొని విలవిలలాడుతున్నారు. చీమకుర్తి-మర్రిచెట్లపాలెం మధ్యన కర్నూల్‌రోడ్‌కి ఇరువైపులా గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ విస్తరించింది. గ్రానైట్ క్వారీలు, వీటికి అనుబంధంగా కటింగ్ అండ్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు, కంకరమిల్లులు ఈ ప్రాంతంలో విస్తరించాయి. ఇవి వెదజల్లుతున్న కాలుష్యం రహదారిపై ప్రయాణించే వాహనదారులను కాటేస్తుంది. కాలుష్య నిబంధనలను తిలోదకాలు ఇవ్వటంతో వీటి నుంచి పెద్ద ఎత్తున వస్తున్న దుమ్ము, ధూళి కర్నూల్‌రోడ్‌ని కమ్మేస్తున్నది. ఈ ధూళి మేఘాలతో రహదారి నిండిపోవటంతో వాహనదారులకు ఎదుట వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక ద్విచక్రవాహనంపై ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా మారింది. రహదారికి ఇరువైపులా ఉన్న మట్టిరోడ్డుపై గ్రానైట్ భారీ వాహనాలు తిరుగాడుతుండటంతో విపరీతంగా దుమ్ము లేస్తుంది. ఈ మట్టిరోడ్డుపై ఎప్పటికపుడు వాటరింగ్ చేయాల్సి ఉండగా యజమానులు పట్టించుకోకపోవటం వాహనదారులకు శాపంగా మారింది. ఇక కంకరమిల్లుల సంగతి చెప్పనవసరం లేదు. కంకర తయారీ ప్రక్రియలో డస్ట్ రేగకుండా తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా అమల్లోకి వచ్చేసరికి నోచుకోవటం లేదు. ఇక రోడ్‌కి ఇరువైపుల ఫ్యాక్టరీల నుంచి విడుదలయే స్లర్రి, వేస్టను డంప్ చేస్తుండటంతో ఆ దుమ్ము అంతా రోడ్‌పై చేరుతోంది. కాలుష్యం వెదజల్లకుండా పర్యవేక్షించాల్సిన కాలుష్యనియంత్రణ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటం సమస్యగా మారింది. ఈ ప్రాంతంలో పెద్దఎత్తున చెట్లు నాటటం, నిరంతరం వాటరింగ్ చేసేలా అధికారులు పర్యవేక్షిస్తే కొంతమేర అయినా కాలుష్యం తగ్గుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలుష్య నియంత్రణకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కాలుష్యనియంత్రణ మండలి ఛైర్మన్ కూడా ఇటీవల ఈ ప్రాంతాన్ని పరిశీలించి ఇక్కడ కాలుష్యాన్ని చూసి ఆశ్చర్యపడటం జరిగింది. కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, తదనుగుణంగా యాక్షన్‌ప్లాన్ రూపొందిస్తామని తెలిపారు. త్వరగా ఇది కార్యరూపం దాలిస్తే ఈప్రాంత వాసులకు, వాహనదారులకు ఉపశమనం లభిస్తుంది.

పోలీస్‌స్టేషన్లలో మహిళా సహాయక కేంద్రాలు : ఎస్పీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో మహిళా సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. గురువారం ఒంగోలులోని తన కార్యాలయం నుంచి జిల్లాలోని పోలీసు అధికారులతో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఫిర్యాదిదారుల పట్ల పోలీస్‌స్టేషన్‌లలో పారదర్శకంగా వ్యవహరించాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లలో మహిళ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి వారి పట్ల మర్యాదగా వ్యవహరించి ఫిర్యాదులను రిసెప్షన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే వారు ఇచ్చిన ఫిర్యాదుకు రశీదు ఇవ్వాని పేర్కొన్నారు. మహిళలు, చిన్నపిల్లలు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

సమయపాలన లేని సచివాలయ సిబ్బంది

● ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీడీవో



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీడీవో మహాలక్ష్మి

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి). సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందిపై ఎంపీడీవో వై.మహాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. కండ్లగుంట గ్రామ సచివాలయం మధ్యాహ్నం 12 గంటలైన తెరుచుకోకపోవడం, సిబ్బంది విధులకు హాజరుకాక పోవడంతో గ్రామస్థులు ఎంపీడీవో వై.మహాలక్ష్మికి గురువారం ఫిర్యాదు చేశారు. దాంతో హుటాహుటిన కండ్లగుంట సచివాలయానికి చేరుకున్న ఆమె సచివాలయానికి తాళాలు వేసి ఉండటంతో అవాక్కయ్యారు. కొద్దిసేపటికి తాపీగా విధులకు వచ్చిన సచివాలయ సిబ్బంది తీరుపట్ల ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

సదరమ్ క్యాంపులో మెరుగైన సేవలు అందించాలి

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని సర్వజన ఆస్పత్రిలోని సదరమ్ క్యాంపునకు వచ్చే వారికి మెరుగైన సేవలు, సదుపాయాలు కల్పించేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలోని సదరమ్ క్యాంపు జరిగే సైకియాట్రి, ఎముకలు, కీళ్ల విభాగాన్ని గురువారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సూరిబాబుతో కలిసి డీఎంహెచ్‌వో పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో పలు అంశాలపై మాట్లాడారు. రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి సత్వర వైద్య సేవలు అందించి వారి స్వగ్రామాలకు పంపాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి లత, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మాస్‌మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ శ్రీమన్నారాయణకు ఘన నివాళి

● సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే దామచర్ల



శ్రీమన్నారాయణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): మండవవారిపాలెం మాజీ సర్పంచ్ కారుమూడి శ్రీమన్నారాయణ(79) భౌతికకాయానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి శ్రీమన్నారాయణ కన్నుమూశారు. కాగా త్రోవగుంట గ్రామం నుంచి మండవవారిపాలెం విడవడిన తరువాత 1988 నుంచి 1993 సంవత్సరం వరకు శ్రీమన్నారాయణ సర్పంచ్‌గా సేవలు అందించారు. అనంతరం ఆయన భార్య సూర్యకుమారి కూడా సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అందరినీ ఒకతాటిపై తీసుకురాగల సమర్థుడు శ్రీమన్నారాయణ అని గ్రామస్థులు చెబుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మండవవారిపాలెం గ్రామ పరిధిలో తెలుగుదేశం మహానాడు ఏర్పాటుకు అవాంతరాలు ఏర్పడగా శ్రీమన్నారాయణ స్పందించి గ్రామ రైతులతో మాట్లాడి వారి వ్యవసాయ భూముల్లో కార్యాక్రమం జరిగేలా ప్రముఖ పాత్ర పోషించారు. ఈక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. కాగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ శ్రీమన్నారాయణ మృతి టీడీపీకి తీరనిలోటన్నారు. వారి కుటుంబసభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, మండవ రంగారావు, ఏడుగుండ్లపాడు మాజీ సర్పంచ్ మండవ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా వైసీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు విచ్చేసి శ్రీమన్నారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రాయపాటి అంకయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పులుసు సురేష్‌బాబు, దేవా పాల్గొన్నారు.

నిధులు మంజూరుకు కృషి హర్షణీయం

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ శాశ్వత భవనాల నిర్మాణం కోసం అవసరమైన రూ.50కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి దేవేంద్రప్రదాన్‌ను కలిసి విజ్ఞప్తి చేయడం అభినందనీయమని యూనివర్శిటీ ఉపకులపతి డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ళ క్రితం ఏర్పడిన ఆంధ్రకేసరి యూనివర్శిటీకి తరగతుల నిర్వహణ కోసం అవసరమైన భవనాలు, విద్యార్థుల వసతిగృహాలు, ఇతర వనరుల ఏర్పాటుకు జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

మద్దిపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయగా కమ్యూనిజం మాసపత్రిక సంపాదకులు ఎంసీ వెంకటేశ్వర్లు, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ పీ.ప్రసాద్, హనుమారెడ్డి, నాగండ్ల వెంకటేశ్వర్లు, ఆసరా ఫౌండేషన్ ప్రతినిధులు ఆధ్వర్యంలో పుస్తకాలను గురువారం అందజేశారు. ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పావులూరి అంజయ్య, టీవీ.శేషయ్య, హెచ్‌ఎం అంకబాబు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్విస్ ఫెస్ట్-2025



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు క్విస్ ఫెస్ట్-2025 నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల అధినేత సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్‌వైస్ ఛైర్మన్ శ్రీగాయత్రిలు గురువారం తెలిపారు. ప్రతి ఏటా క్విస్ ఫెస్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, అయితే ఈ ఏడాది జాతీయస్థాయిలో జరగనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది పర్యావరణహితంగా సస్టైనబులిటి అనే కాన్సెప్ట్‌తో రివైవ్, రీ యూజ్, రీ సైకిల్ థీమ్‌తో ఎక్స్‌పో, టెక్నికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు. అందుకు సంబంధించి పూర్తి ఏర్పాట్లను చేసినట్లు చెప్పారు. శుక్రవారం శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో రేంజ్ ఆపరేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ జి.గ్రహదొరై, ముగింపు కార్యక్రమానికి ఎన్ఐటీ రాయ్‌పూర్ డైరెక్టర్ ఎస్‌వీ.రమణారావులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. టెక్నికల్ ఈవెంట్స్, ఎక్స్‌పో, స్పోర్ట్స్ డ్యాన్స్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు 9వతేదీన బహుమతులు, నగదు ప్రోత్సహకాలు అందిస్తామన్నారు. క్విస్ కళాశాల ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబులు పర్యవేక్షించనుండగా క్విస్ ఫెస్ట్ కన్వీనర్‌గా సమీర్‌కుమార్, కో కన్వీనర్‌గా మౌళిచంద్రలు వ్యవహరించనున్నారని వారు తెలిపారు..

మిరపలో తామర పురుగు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

● సీనియర్ శాస్త్రవేత్త రవీంద్రబాబు



మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రవీంద్రబాబు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మిరపపంటలో కనిపించే తామర పురుగు పట్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దర్శి ఉద్యానవన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఎం.రవీంద్రబాబు సూచించారు. గురువారం పోతవరం గ్రామంలో మిరప పంటలు సాగు చేసిన రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శాస్త్రవేత్త రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రస్తుతం మిరపలో తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, దీనివల్ల ఆకులు ఎర్రగా మారడం, మొక్కల పెరుగుదల తగ్గుతుందని చెప్పారు. నివారణకు అసిటాంప్రిడ్ 0.2 గ్రాములు లేదా స్పినోపాడ్ 0.25 ఎంఎల్ లేదా ఫిప్రోనిల్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటితో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. సామూహిక నివారణా పద్ధతిని అవలంబించడం ద్వారా కొంత వరకు పురుగును అరికట్టవచ్చని వివరించారు. నీలం రంగు జిగురు అట్టలను ఎకరాకు 50 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. లద్దె పురుగు ఆకు అడుగు భాగాన గుంపులుగా ఉండి హరిత భాగాన్ని తినడం మూలంగా ఆకులు జల్లెడలా మారుతాయని, వాటి నివారణకు స్పినోసేడ్ 0.25 ఎంఎల్ లేదా ఇమామిక్టన్‌బెన్‌జోఎక్ట్ 0.4 ఎంఎల్ గానీ ఫ్లూబెండామైడా 0.3 ఎంల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తామర పురుగును తట్టుకునే ఎల్‌ఎసీ మిరప రకాలను సాగు చేయాలని ఆయన చెప్పారు. కాల్షియం, మెగ్నీషియం ఒక కేజీ, బోరాన్ జింక్ 0.5 కేజీ చొప్పున పిచికారి చేయడం ద్వారా మొక్కలకు బలం చేకూరుతుందని వివరించారు. అనంతరం మిరప పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష, ఏవో వెంకట్రావు, సిబ్బంది శృతి, పద్మిని, సోనీ, రైతులు పాల్గొన్నారు.

రేపు భీష్మ ఏకాదశి వేడుకలు

మద్దిపాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశి సందర్భంగా ఈ నెల 8న ప్రత్యేక పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు మల్లవరం అన్నదాన కమిటీ నాయకులు నారిపెద్ది వరహాలచౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లవరంలోని శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఆయా కార్యక్రమాలు సంఘ జిల్లా నాయకులు చక్కా శ్రీమన్నారాయణ దంపతుల ఆధ్వర్యంలో జరుగుతాయిన, ఆర్య వైశ్యులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

డైట్ కళాశాలలో వైద్య పరీక్షలు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 6: మైనంపాడు డైట్ కళాశాలలో ఒంగోలుకు చెందిన ప్రైవేట్ వైద్యశాలకు చెందిన ఈఎన్‌టీ వైద్యులు కొర్రపాటి సుధాకర్, బాలు గురువారం చాత్రోపాధ్యాయులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించారు. డైట్ అధ్యాపకులు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు, సీవీఎస్.ప్రసాద్, వీవీ.సుబ్బారావు, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

● డిప్యూటీ కలెక్టర్ మాధురి



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సభ్యులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను రక్షించడానికి విపత్తుల నిర్వాహణకు పూర్తి అవగాహన కలిగిఉండాలని జిల్లా డిప్యూటీ కలెక్టర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.మాధురి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆమె అధ్యక్షతన మండలంలో వివిధ శాఖల అధికారులకు విపత్తుల నిర్వాహణకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ 10 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్, ఎన్డీఆర్‌ఎఫ్‌కి చెందిన వీవీఎస్ ప్రసన్నకుమార్ విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి, హెచ్‌ఎం రవిచంద్ర పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా స్థిరమైన అభివృద్ధికి ప్రణాళికలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సామాజిక, ఆర్థిక సాధికారత, స్థిరమైన అభివృద్ధిని సాధించేందుకు జిల్లాలో పీ4(పీపుల్, పబ్లిక్, ప్రైవేటు పార్టిసిపేషన్) కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గాల వారీగా కార్యచరణ ప్రణాళికలను నిర్దేశించిన సమయం లోగా రూపొందిస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. గురువారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. అంతకు ముందు విజయానంద్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా కార్యచరణ ప్రణాళికలను రూపొందించి సమయంలో లోగా పంపాలని ఆదేశించారు. అందుకోసం నియోజకవర్గ స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలని కలెక్టర్లను ఆదేశించారు. నోడల్ అధికారులతో పాటు ఆరుగురు సభ్యులతో బృందాలను ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలను సేకరించాలన్నారు. ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో చిన ఓబులేషు, వివిధ శాఖల అధికారులు చిరంజీవి, వెంకటనాయుడు, కిరణ్‌కుమార్, శ్రీనివాసరావు, బాలశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య



శ్రీనివాసరావు మృతదేహం

చీమకుర్తి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరివారిపాలెం గ్రామానికి చెందిన గంగవరపు శ్రీనివాసరావు(35) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో శ్రీనివాసరావు తన ఇంటిలో ఫ్యాన్ హుక్కుకు తాడు వేసుకొని గురువారం ఆత్మహత్యకు ఒడిగట్టాడు. మృతుడి జేబులో ఆరుపేజీల లేఖ ఉంది. తాను చనిపోవటానికి గల కారణాలను, కారకులను అందులో తెలిపినట్లు తెలుస్తున్నది. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

ప్లస్‌టు పాఠశాలలను కొనసాగించాలి

● ఆపస్ ప్రతినిధులు



శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ కాలంలో ఏర్పాటు చేసిన(ఇంటర్మీడియెట్) ప్లస్ టు పాఠశాలలను కొనసాగించేలా చూడాలని ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కోరారు. గురువారం ఒంగోలులో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర సంఘటన కార్యదర్శి సీహెచ్.శ్రావణ్‌కుమార్‌కు వారు ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో భాగంగా పాఠశాల విద్యలోనే ప్లస్ టు పాఠశాలలను కొనసాగించి ప్రస్తుతం పనిచేస్తున్న వారిని యథావిధిగా కొనసాగించాలన్నారు. ప్రమోషన్ పద్ధతిలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న ప్లస్‌టు పాఠశాలలకు అధ్యాపకుల నియామకం చేయాలని కోరారు. ప్లస్ టు పాఠశాలలను ఇంటర్మీడియెట్ విద్యకు అప్పగించి కాంట్రాక్టు లెక్చరర్లను నియమించాలని చూడటం సరికాదని, ప్రస్తుతం ఉన్న ప్లస్‌టు పాఠశాలల వ్యవస్థను యథావిధిగా ప్రభుత్వం కొనసాగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరామకృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.దిలీప్ చక్రవర్తి, ప్లస్‌టు అధ్యాపకులు వి.మార్కండేయులు, ఎం.నాగకుమారశర్మ, ఆర్.జగన్నాథరావు, నాగప్రకాష్, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న శివం ఫౌండేషన్



అంత్యక్రియలు చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శివం ఫౌండేషన్ ప్రతినిధులు మానవత్వాన్ని చాటుకున్నారు. అనాధగా చనిపోయిన ఓ భిక్షగానికి అన్నీ తామై దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు. వివరాల్లోకి వెళితే.. నాగరాజు అనే వ్యక్తి ఒంగోలు నగరంలో భిక్షాటన చేస్తూ జీవిస్తుంటాడు. అతను గురువారం అనారోగ్యంతో నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లో మృతిచెంది పడి ఉండగా విషయాన్ని తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు శివం ఫౌండేషన్ వారికి సమాచారాన్ని ఇచ్చారు. దీంతో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు పయ్యావుల రాజా, చెరుకూరి రమేష్, ఎం.సతీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు తలెత్తకుండా చర్యలు : ఎస్ఈ



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

చీమకుర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వేసవిలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా చేపట్టాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. గురువారం చీమకుర్తిలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని పలు విషయాలపై చర్చించారు. చీమకుర్తి పరిధిలో ఉన్న దాదాపు రూ.9కోట్ల బకాయిలను వసూలు చేయాలని తెలిపారు. సూర్యఘర్ పతకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్స్ ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఈఈ పి.శ్రీనివాసులు, డీఈ ఆర్.మోహనరావు, ఏఈలు చంద్రశేఖరరావు, శ్రీనివాసరావులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులంతా సమన్వయంతో పని చేయాలి

● మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య



మాట్లాడుతున్న దామచర్ల సత్య

టంగుటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో అధికారులంతా కలిసి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సత్య కోరారు. మండల కేంద్రం పొన్నలూరులోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం డివిజన్ స్థాయి అధికారుల సమీక్షా సమావేశానికి సత్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని, అందుకే అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ప్రతి గ్రామానికి తాగునీటి సమస్య లేకుండా చూడాలని, పారిశుధ్యం మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కోడ్రగుంట శ్రీనివాసరావు, మండవ ప్రసాద్, కర్ర కోటిరెడ్డి, పిల్లి వెంకటనారాయణరెడ్డి, తహశీల్దార్ వి.పుల్లారావు, ఎంపీడీవో సుజాతతోపాటుగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

9న ఒంగోలులో జరిగే మహాసభను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఈనెల 9వ తేదీన జరిగే జిల్లా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీకే.రాజేశ్వరరావు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం మహాసభల కరపత్రాలను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ మహాసభలకు యాజమాన్య ప్రతినిధులుగా యూనియన్ బ్యాంకు జనరల్ హెడ్ రవికుమార్, కెనరాబ్యాంకు రీజనల్ హెడ్ బి.మారుతిశశిధర్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు సమస్యగా ఉన్న పెన్షన్‌పెంపు, భారంగా మారిన గ్రూపు హెల్త్ ఇన్సూరెన్స్ తదితర అంశాలపై చర్చిస్తామని, జిల్లాలోని బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఫెడరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు బయటపెడితే ఆయిల్ చోరీ!

● రాజీవ్ గృహకల్పలో పేట్రేగుతున్న దొంగలు



పెట్రోలు చోరీ చేసేందుకు బైక్‌కి బాటిల్ పెట్టిన దుండగుడు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): నగరంలో పెట్రోల్ దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. గురువారం తెల్లవారు జామున కొప్పోలురోడ్డులో గల రాజీవ్ గృహకల్ప కాలనీలో సుమారు 15 మోటార్‌సైకిళ్ల పైపులు కట్ చేసి పెట్రోలు దొంగతనం చేశారు. ఉదయం బైక్ స్టార్ట్ చేద్దామంటే పెట్రోలు లేదు, పైప కట్ అయి కనిపించింది. దీంతో ఉదయం అందరూ రిపేర్ చేసే మెకానిక్‌ల వద్దకు వెళ్లాల్సి వచ్చింది. అనంతరం కాలనీవాసులు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి తాలుకా సీఐ అజయ్‌కుమార్ కాలనీ సందర్శించి అక్కడ ప్రజలతో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసుల గస్తీ ముమ్మరం చేస్తామని ఆయన చెప్పారు.

సీసీ కెమెరాల దాతలకు సత్కారం



అసోసియేషన్ సభ్యులను సత్కరిస్తున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థికంగా చేయూతను ఇచ్చిన మార్చెంట్ అసోసియేషన్ సభ్యులు కొత్తూరి శ్రీరంగనాయకులు, క్లాత్ అసోసియేషన్ సభ్యుడు విజయ్‌కుమార్‌ను స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర సత్కరించారు. వీరితో పాటు నిఘా నేత్రాల ఏర్పాటుకు దోహదపడిన గోల్డ్ మార్చెంట్ అసోసియేషన్ సభ్యులకు కూడా ప్రత్యేకంగా అభినందించారు.

క్రైం సమాచారం

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

• గ్రామంలో విచారించిన మార్కాపురం డీఎస్పీ నాగరాజు



కేసుపై విచారిస్తున్న డీఎస్పీ నాగరాజు

పుల్లలచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానేపల్లిలో ఎస్సీ వ్యక్తిపై దాడి చేసి కులం పేరుతో దూషించారన్న కేసులో ముగ్గురు వ్యక్తులపై నమోదు అయిన ఎస్సీ, ఎస్టీ కేసుపై మార్కాపురం డీఎస్పీ నాగ రాజు గురువారం విచారించారు. మానేపల్లి ఎస్సీ పాలేనికి చెందిన కొండా అశోక్ జనవరి నెల 29న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసును డీఎస్పీ గ్రామంలో విచారించారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు ఓసీలపై కేసు నమోదు చేసి విచారించినట్లు ఆయన తెలిపారు. మరొక వర్గం ఇచ్చిన ఫిర్యాదుపై కూడా ఆయన విచారించారు. ఆయన వెంట పుల్లలచెరువు ఎస్ఐ ఎల్.సంపత్ కుమార్, సిబ్బంది వున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

• 24 గంటల్లో గుర్తింపు

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాం భూపాల్‌రెడ్డి కాలనీకి చెందిన ఓ మహిళ ఇంట్లో జరిగిన చిన్న గొడవ కారణంగా అలిగి వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు స్థానిక పోలీసు లకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గా ఆ మహిళ కోసం గాలించారు. ఆ మహిళ కడప జిల్లా పోరుమామిళ్ల ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌కు తీసు కుని వచ్చారు. మహిళకు, కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు. 24 గంటల్లో కేసును చేధించిన సీఐ సురేష్‌కు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన దోషికి నాలుగేళ్ల జైలు

మార్కాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాన్ని నడపడమేకాక ఒక ప్రయాణికుడి మృతికి కారణమైన నిందితునికి నాలుగేళ్ల జైలుశిక్ష విధిస్తూ గురువారం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి బి.దేవేందర్‌రెడ్డి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2017 అక్టోబర్ 4న వేములకోట నుంచి మార్కాపురానికి ఆటోలో చాట్ల యేసుదాసు, ఎలికపాటి ఇమ్మానియేల్‌లు వెళ్తున్నారు. ఈ క్రమంలో కటికల జీవన్‌కుమార్ మార్కాపురం నుంచి స్వగ్రామానికి పూటుగా మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి వస్తున్నాడు. మద్యంమత్తులో జీవన్‌కుమార్ ఎదురుగా వస్తోన్న ఆటోను ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ పక్క సీట్లో కూర్చునివున్న కర్నూలు జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామానికి చెందిన చాట్ల యేసుదాసుకు బలమైన గాయమైంది. దీంతో ఆయన ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. పలువురికి గాయాలయ్యాయి. ఈ మేరకు మార్కాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ దొండపాటి గాంధిరెడ్డి వాదించారు.

అగ్ని ప్రమాదాలు నియంత్రణపై శిక్షణ



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రానున్నది వేసవికాలం కావడంతో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ ప్రొటెక్షన్ కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని గంజివారిపల్లి ఫారెస్టు రెంజ్ అధికారి సుబ్బారావు అధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జిల్లా ఉన్నతాధికారుల అదేశాలతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, శిరిగిరిపాడు రేంజ్ పరిధిలోని సిబ్బందికి ఈ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సక్కునాయక్, ఎఫ్‌బీవోలు తోట నాగేశ్వరరావు, ఖాజా మోహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో నింధితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై చౌడయ్య

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి డబ్బులు అడిగాడు అనే కోపంతో మెడికల్ షాపు యజమానిని దాడి చేసి గాయపరిచిన ఇద్దరు నిందుతులను అరెస్టు చేశారరు. ఈ ఘటన గురువారం చోటుచేసుకొంది. ఎస్సై పి.చౌడయ్య తెలి పిన వివరాల మేరకు ఈ నెల 2న స్థానిక అవంతిక మెడికల్ దుకాణంలో చేదూరి బాబు, రామావత్ కృష్ణనాయక్‌లు మందులు కొనుగోలు చేశారు. వాటికి సంబంధించిన నగదు అడగడంతో లేవు అని సమాదానం చెప్పారు. నగదు లేకుండా మెడిసిన్ ఏలా ఇస్తారు అని యలక మల్లికార్జన అన్నాడు. ఆ రోజు మందులు వెనక్కు ఇచ్చి వెను తిరిగి వెళ్లారు. 3వ తేదిన ఆ ఇద్దరు వచ్చి మల్లికార్జునపై దాడికి దిగారు. ఈ దాడిలో మల్లికార్జునకు గాయాలు అయ్యాయి. బాధితుడు మల్లికార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

మరో మూడు రోజులు సెలవు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం తహసీల్దార్ ఏ. బాలకిషోర్ మరో మూడురోజులు సెలవు కొనసాగించారు. అనారోగ్య కారణాలతో ఈ నెల 4వ తేదీ వరకు సెలవు పెట్టిన ఆయన ప్రస్తుతం సెలవును పొడిగించుకున్నారు. ప్రస్తుతం వివిధ రుణాల కోసం క్యాస్ట్ ఇన్‌కం సర్టిఫికెట్లు మాత్రం డీటీ ద్వారా క్లియర్ చేయిస్తున్నారు.

కుక్కల బెడద నివారించాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాలలో కుక్కలు గుంపులు గుంపులుగా వెళుతూ చిన్నారులను గాయపరుస్తున్న దృష్ట్యా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని బీజేపీ కో-కన్వీనర్ గుమ్మా రాముడు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. చాలాచోట్ల పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు కుక్కల బెడద నుంచి, మరికొన్ని ప్రాంతాలలో ఉన్న కోతుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరారు.

చెట్లకు వీధి దీపాల ఏర్పాటు

• కంభం యానాది కాలనీలో ఘటన • స్తంభాలు తెచ్చిన ఐదేళ్లగా నిరుపయోగమే • వానైనా గాలైనా ప్రమాదమే



వెలగచెట్టుకు కాచిన లైటు

కంభం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని యానాది కాలనీలో చెట్లు విద్యుత్ వెలుగులను విరజిమ్ముతున్నాయి. వివరాల్లోకి వెళితే బస్టాండ్ సమీపంలోని మీసేవ కేంద్రం పక్కన సుమారు 10 యానాది కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో ఎక్కువ మంది కంభం పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. అయితే వీరు నివసించే గృహాల చుట్టూ దట్టంగా చిల్లచెట్లు పెరిగాయి. పారిశుధ్య కార్మికులు చీకట్లో ఇళ్లకు వెళ్లడం ఇబ్బందిగా మారింది. దీంతో విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేసి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరగా విద్యుత్‌శాఖ అధికారులు స్తంభం తీసుకొచ్చారు. దానిని పాతేందుకు బద్దకించిన విద్యుత్ అధికారులు ఆ స్తంభాన్ని అక్కడే వదిలేసి పక్కనే ఉన్న వెలగచెట్టుకు వీధిలైట్లు బిగించారు. అదేవిధంగా ఈ వీధిలైటుకు కావలసిన విద్యుత్ తీగలను కూడా రోడ్డు అవతల ఉన్న స్తంభం నుంచి వేపచెట్టు కొమ్మకు విద్యుత్ తీగలు బిగించి అక్కడి నుంచి వెలగచెట్టు వరకు లైన్ లాగారు. ఒక్క స్తంభం పాతకుండా చెట్టుకు లైటు ఎందుకు బిగించారని కార్మికులను ప్రశ్నించగా విద్యుత్‌శాఖ అధికారులు గుంత తీసేందుకు డబ్బులు అడిగారన్నారు. తమ వద్ద లేదని చెప్పడంతో చెట్టుకు బిగించి వెళ్లారని అమాయకంగా సమాదానమిచ్చారు. గాలి, వర్షం కురిసే సమయంలో చెట్టు కొమ్మలు ఊగి విద్యుత్ వస్తూ పోతూ ఉంటుందని వారు తెలిపారు. రెండు విద్యుత్ స్తంభాలను పాతి వీధిలైట్లు బిగించాల్సిన విద్యుత్ అధికారులు ఇలా నిర్లక్ష్యంగా చెట్ల కొమ్మలకు తీగలు అల్లి లైటు బిగించడంపై విమర్శలు వస్తున్నాయి. ఈవిషయమై విద్యుత్ ఏఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

వేంకటేశ్వరునికి హనుమంత వాహనసేవ



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు, స్నపన తిరుమంజనంలో దేవదేవేర్లు, హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మో త్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఏవీకే నరసింహా చార్యుల ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృత స్నపన తిరుమం జనం నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వ హించి భక్తుల గోవింద నామస్మరణల మధ్య భజనలు చేశారు. రాత్రి హనుమంత వాహనంపై వేంకటేశ్వరునికి నగరోత్సవం నిర్వ హించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చెక్కా మాలకొండ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఊటుకూరి రామకృష్ణారావు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

బ్యాంకర్లు లక్ష్యాల మేరకు రుణాలు ఇవ్వాలి

లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ రమేష్

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి). జీవనోపాధి యూనిట్లు నెల కొల్పుకొనే వారికి లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ రమేష్ కోరారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో గురువారం సాయంత్రం మార్కాపురం, తర్లుపాడు, యర్ర గొండపాలెం, పెద్దదోర్నాల మండలాల డీఆర్‌డీఏ, బ్యాంకుల సిబ్బందితో జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు జీవనోపాధి యూనిట్లను ఏర్పాటుచేయించి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని కోరారు. రుణగ్రహీతల నుంచి నూరుశాతం రికవరీ చేయాలన్నారు. ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్‌ల ఏర్పాటుద్వారా ప్రతి కుటుంబంలో మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేయాలంటే బ్యాంకర్లు సహకరించా లన్నారు. డీఆర్‌డీఏ బ్యాంకు లింకేజి డిపిఎం సనిత మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణా లను మంజూరు చేయించి నూరుశాతం రికవరీ చేయాలన్నారు. సమావేశంలో మార్కా పురం బ్రాంచి కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ బాలక్‌రామ్ మజి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎన్ హరి, ఎర్రగొండపాలెం ఏరియా కో-ఆర్డినేటర్ దానం, మార్కాపురం, తర్లుపాడు, పెద్ద దోర్నాల, వైపాలెం ఎపిఎంలు పిచ్చయ్య, రమేష్‌బాబు, పోలయ్య, నాలుగు మండలాల సీసీలు, బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

లోన్ల రికవరీ వేగవంతం చేయాలి

ఎర్రగొండపాలెం రూరల్ : బ్యాంక్ ఖాతా దారుల లోన్ల రికవరిని వేగవంతం చేయాలని జిల్లా లీడ్ చీఫ్ మేనేజర్ డి.రమేష్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో అన్ని బ్యాంకర్ల మేనేజర్, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారు లకు సేవలను పెంచాలన్నారు. అన్నిరకాల లోన్లను రికవరి చేయాలన్నారు. ముఖ్యంగా మొండి బకాయిల ఖాతాలను క్లోజ్ చేసేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం సనిత, ఏసీ దానం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కె నాగేంద్ర కుమార్, ఎస్‌బీఐ, యూనియన్, ఏపీజీబీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం : ఎంతో వెనుకబడిన పశ్చిమ ప్రకాశ నిరుద్యోగ యువతకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి తోడ్పడాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షులు మందా రాజు కోరారు. స్థానిక కార్పొరేషన్ బ్యాంకులో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) రమేష్‌ను పీడీఎస్‌యూ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.

9న వార్షికోత్సవం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం సమీపంలోని దరిమడుగు రోడ్డులోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుండి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పతాక ఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోలీస్‌స్టేషన్లలో మహిళా సహాయక కేంద్రాలు : ఎస్పీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో మహిళా సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. గురువారం ఒంగోలులోని తన కార్యాలయం నుంచి జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఫిర్యాదిదారుల పట్ల పోలీస్‌స్టేషన్‌లలో పారదర్శకంగా వ్యవహరించాలని చెప్పారు. వారితో మర్యాదగా వ్యవహరించి ఫిర్యాదులను రిసె ప్షన్ రిజిస్టార్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే వారు ఇచ్చిన ఫిర్యాదుకు రసీదు ఇవ్వాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలన్నారు.

వేసవిలో విద్యుత్‌కోతలు లేకుండా చర్యలు

చీమకుర్తి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): వేసవిలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా చేపట్టాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. గురువారం చీమకుర్తిలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యఘర్ పతకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

రైస్‌మిల్లులో జేసీ ఆకస్మిక తనిఖీ



గోడౌన్ తనిఖీ చేస్తున్న జేసీ గోపాలకృష్ణ

పొదిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పట్టణంలోని లక్ష్మిశ్రీని వాస రైస్‌మిల్లును జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాటూరివారిపా లెంలోని 34వ నంబరు రేషన్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. రేషన్ షాపులోని రేషన్ బియ్యాన్ని, అదేవిదంగా పట్టణంలోని లక్ష్మిశ్రీనివాస రైస్‌మిలున్లు తనిఖీ చేసి అందులోని బియ్యాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కృష్ణారెడ్డితో మాట్లాడారు. బియ్యం పరిశీలించి నివేదికను ఇవ్వాల్సిందిగా తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయన వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, రైస్‌మిల్ యజమాని, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం



నగదు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన విద్యా ర్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ట్రావెలింగ్ ఎస్కార్ట్ అలవెన్స్ కింద మంజూరైన రూ.66.000లను విద్యార్థులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు ఆంజనేయులు, ఎస్ఎంసీ ఛైర్మన్ ఖాదర్‌వలి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారులకు మరమ్మతులు



ఒంగోలు నంద్యాల రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

పొదిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రధానరహదారుల మరమ్మతు లకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభిం చింది. ఎన్ని ఇబ్బందులు పడుతున్నా, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారులకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో రహదారులు అధ్వానంగా తయార య్యాయి. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోల్లో ప్రయాణం అయితే ప్రాణాంతకంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రహదారుల మరమ్మతులకు తొలి ప్రాధాన్యత ఇచ్చింది. ఆ మేరకు మండలంలోని మూసివాగు వద్ద నుంచి 24 కిలోమీటర్లు మరమ్మతులకు రూ.3.50 లక్షలు కేటాయిం చారు. అదేవిధంగా పొదిలి వినుకొండ రహదారికి 18 కిలోమీటర్లకు రూ.3.50 లక్షలు, పొదిలి మార్కాపురం రహదారికి పొదిలి నుంచి రెండు కిలోమీటర్లకు రూ.8 లక్షలు, 2 నుండి 7వ కిలోమీటర్ల వరకు రూ.15 లక్షల నిధులను రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం కేటాయించినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ స్రవంతి తెలిపారు. ఆ మేరకు దాదాపు పనులు పూర్తిచేసినట్లు వివరించారు.

తెలంగాణ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

వర్గీకరణ చేయడంపై ఎంఆర్‌పీఎస్ హర్షం

కంభం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేసిన తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎంఆర్‌పీఎస్ కార్యదర్శి షాలెంరాజు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని వర్గీకరణ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి మాదిగ, మాదిగ ఉపకులాలు, మాల, మాల ఉపకులాలను, ఇప్పటివరకు రిజర్వేషన్ పొందని ఉప కులాలను 3 గ్రూపులుగా ఏర్పాటు చేశారన్నారు. 30 సంవత్సరాల ఎంఆర్‌పీఎస్ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై స్పందించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించడం హర్షనీయమన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో జస్టిస్ రాజీవ్‌రంజన్‌మిశ్రా కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో నేదురుపల్లి జయరాజ్, బీసీ నాయకులు వడ్డె రాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ర్యాక్ బహూకరణ



స్టీల్ ర్యాక్ అందజేస్తున్న పిచ్చయ్య

గిద్దలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖగ్రంథాలయానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చ య్య స్టీల్ ర్యాక్‌ను అందజే శారు. వార్తాపత్రికలు, ఇతర రకాల పోటీ పరీక్షలకు అవ సరమైన పుస్తకాలు అమర్చు కునేందుకు వీలుగా స్టీల్ ర్యాక్‌ను అందచేసిన పిచ్చయ్యను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు తిరుపతమ్మ, విశ్రాంత టీచర్లు రామిరెడ్డి, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష అట్టల పంపిణీ

గిద్దలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం జేపీ.చెరువు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చిన్నిసేవాసంస్థ సమకూర్చిన పరీక్ష అట్టలను ఏవో షేక్ అబ్దుల్ రఫిక్ అందజేశారు. కార్యక్రమంలో చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు మాగు లూరి శ్రీకాంత్, పాఠశాల హెచ్‌ఎం ముత్తుముల విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొళాయిల్లో మురుగునీరు సరఫరా

గిద్దలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటగడ్డవీధిలో మంచినీటి కొళాయిల నుంచి మురికినీరు వస్తోంది. దీంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కొలాయిల ద్వారా వచ్చే నీరు రెండు రోజులుగా మురికిగా దుర్వాసనతో వస్తుండడంతో వాటిని వినియోగించేందుకు ప్రజలు ఇష్టపడడం లేదు. కానీ తప్పని పరిస్థితులలో వడగట్టుకుని వినియోగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని మురికినీరు రాకుండా చూడాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్ నుంచి నీరు లీకేజ్

గిద్దలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాండురంగారెడ్డినగర్‌లో భారీవాహనం వెళ్లడంతో రోడ్డు కింద ఉన్న నీటి పైపులు పగిలిపోయాయి. దీంతో కొళాయిలో నీరు రాకుండా వృధాగా పోతోంది. ఆప్రాంత వాసుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ కౌన్సిలర్ పరుచూరి సుభాషిణి టీడీపీ నాయకులు నాగేశ్వరరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే మరమ్మతు చర్యలు మొదలు పెట్టించారు. సాయంత్రానికి మరమ్మతు పూర్తి చేసి నీటి లీకేజ్‌ని అరికట్టి ఆ ప్రాంతవాసులకు కొళాయిల ద్వారా నీరు అందే ఏర్పాట్లు చేశారు.

కుక్కలకు స్టెరిలైజేషన్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో బెడదగా మారిన కుక్కలను రెండో విడత మున్సిపల్ అధికారులు ప్రత్యేక సిబ్బం ది ఆధ్వర్యంలో గురువారం పట్టుకున్నారు. ఈ సంద ర్భంగా కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ.. పట్టణంలోని వివిధ వార్డులలో ఉన్న 25 వీధి కుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్ కోసం ఒంగోలు తరలిస్తున్నా మన్నారు. దశల వారీగా అన్ని వార్డులలో కుక్కల స్టెరిలైజేషన్ కార్యక్రమం చేపడతామన్నారు.

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఆర్‌జేడీ

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలో నూరు శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీ ర్ణత సాధించాలని ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రభు త్వ ఉన్నత పాఠశాలను గురు వారం ఆర్‌జేడీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు క్రీడా స్ఫూర్తి అవసరం

• క్రికెట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఐ సుబ్బారావు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వివిధ ఆటలలో పాల్గొనే సమయంలో ఐకమత్యంతో మెలిగి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని మార్కాపురం సీఐ సుబ్బారావు అన్నారు. స్థానిక ఎస్‌వీకేపీ కళాశాలలో ఎస్ఎస్ఎన్ క్రికెట్ టోర్నమెంట్ జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ పోటీలను గురువారం ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని మంచి ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయన్నారు. పట్టణ ఎస్ఐ సైదుబాబు మాట్లాడుతూ ఆటలలో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుపడతా యన్నారు. చదువుతో పాటు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు షేక్ సాదిక్, షేక్ సుభానీ, సయ్యద్ సద్దాం, బొమ్మిరెడ్డి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బీళ్లుగా మాగాణి భూములు

దర్శి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువుల కింద ఉన్న మాగాణి భూములు సాగుకు నోచుకోక బీళ్లుగా మారుతున్నాయి. పెట్టుబడులు పెరగటంతో చిన్నచిన్న కమతాలను సాగుచేయకుండా వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల మాగాణి భూముల్లోకి వెళ్లేందుకు దారులు లేవు. భూములు ఉరకెత్తి దిగబడుతుండటంతో సాగుకు ఇబ్బందికరంగా మారింది. దీంతో సాగు చేయకుండా వదిలేస్తున్నారు. మండలంలోని పోతకమూరు, తూర్పు వీరాయపాలెం, రాజంపల్లి, జముకులదిన్నె, సామంతపూడి, కొత్తపల్లి, త్రిపురసుందరీపురం తదితర గ్రామాల చెరువుల కింద వందలాది ఎకరాల మాగాణి భూమి ఉంది. ఆ భూములను గత కొన్నేళ్లుగా సాగు చేయకపోవటంతో బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. దీర్ఘకాలికంగా సాగు చేయకపోవటంతో చౌడు భూములుగా మారుతున్నాయి. వరిసాగుకు పెట్టుబడులు పెరగటంతో గిట్టుబాటు కాక వదిలేశామని రైతులు చెబుతున్నారు.


పాతకమూరు చెరువు కింద బీడుగా మాగాణి భూమి

ఏకాగ్రతతో చదువుపై దృష్టి సారించాలి

పామూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు మనస్సును ఏకగ్రతపై దృష్టి సారిస్తే విద్యపై పట్టు పెంచుకోవచ్చునని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు గుత్తి రమణయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక బీసీ సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల కాలంలో ఏకాగ్రతతో దృష్టి సారిస్తే మానసిక ఆందోళన తగ్గి మంచి ఫలితాలు సాధిస్తారన్నారు.

విశ్రాంత వీఆర్వో నాగేశ్వరరావు మృతి

దర్శి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో సింగంశెట్టి నాగేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. ఆయన మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుకు బావ. సమాచారం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో మాజీ ఎమ్మెల్యే పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు ఉన్నారు.

5కి.మీ లోపు గ్యాస్ డెలివరీ చార్జీలు ఉచితం

కనిగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారాన్ని తగ్గిస్తూ గ్యాస్ డెలివరీ చార్జీలను ఉచితం చేస్తూ ప్రకటించటం హర్షణీయమని బీజేపీ నాయకుడు రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలో గ్యాస్ సిలెండర్ డెలివరీ చార్జీలపై విమర్శలు వ్యక్తమవుతున్నా నేపథ్యంలో ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వీటి ప్రకారం మొదటి ఐదు కిలోమీటర్ల వరకూ ఎలాంటి చార్జీలు వసూలు చేయరని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

5 నుంచి 15 కిలోమీటర్ల వరకు కేవలం 20 రూపాయలు మాత్రమే చార్జీలు వసూలు చేయాలన్నారు. 15 కిలోమీటర్లు దాటిన సిలిండర్ డెలివరీకి రూ30లు వసూలు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నిబంధనలకు అనుగుణంగా గ్యాస్ సిలిండర్ వినియోగదారులు రసీదులో పొందుపరచిన రేటును మాత్రమే చెల్లించాలని పేర్కొన్నారు.

నీటి పంపుల మరమ్మతులకు చర్యలు

తాళ్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 17 వరకు నీటి పంపుల మరమ్మతులకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో డి.హనుమంతరావు తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలం ప్రారంభమైనందున గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం తగుచర్యలు చేపట్టిందన్నారు. గ్రామాల్లో మరమ్మతులకు గురైనబోర్లు, డీప్‌బోర్లు, పైపులైన్లు గుర్తించి నీటిసరఫరాకు అంతరాయం జరుగకుండా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వాలి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టు దుర్మరణం

పామూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వస్తున్న యువకుడు ఎదురుగా వస్తున్న టెంపో ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈఘటన పామూరు మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ టి.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పామూరు నుంచి కనిగిరి వైపు మోటారుసైకిల్‌పై యువకుడు వెళుతున్నాడు. ఈక్రమంలో వగ్గంపల్లి ఎస్సీ కాలనీ వద్ద ఎదురుగా తాటాకు వేసుకొని వస్తున్న బైక్‌ను తప్పించేక్రమంలో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ టెంపోను ఢీకొన్నాడు. ఈప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునివద్ద ఎలాంటి అధారాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముండ్లమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముల గ్రామానికి చెందిన యాతం వెంకటేశ్వరరెడ్డి, నారాయణమ్మ దంపతులు సోమవారం ఎలుకల మందుతిని దర్శిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నారాయణమ్మ బుధవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందారు. భర్త వెంకటేశ్వరరెడ్డి పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

శిథిలావస్థలో పోలీస్‌స్టేషన్ భవనం

» ఏరూపంలో ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన

దొనకొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని పోలీసుస్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. తరచూగా భవనం పైకప్పు శ్లాబు పెచ్చులూడి పడుతుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెందు తున్నారు. వరండాలో ఒకవైపు పోలీస్ సిబ్బంది, ప్రజలు కూర్చునేందుకు టేబుల్, కుర్చీలను గతంలో ఏర్పాటుచేశారు. ఆవైపు తరచూ శ్లాబు పెచ్చులూడిపడుతున్నాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది ఆ ప్రదేశంలోని టేబుల్, కుర్చీలను తీసేసి ఖాళీగా ఉంచారు.


పెచ్చులూడిపడుతున్న శ్లాబు



పోలీస్‌స్టేషన్ భవనం

దొనకొండలో బ్రిటీష్‌కాలంలో ఏర్పాటుచేసిన పోలీస్‌స్టేషన్ భవనం పురాతనమైనదనే కారణంతో దాని ప్రక్కనే 2013లో నూతన భవనం నిర్మించారు. నిర్మాణం సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపో వటంతో కొద్ది సంవత్సరాలకే శ్లాబు పెచ్చులూడి పడుతు న్నాయి. కొత్త పోలీస్ స్టేషన్ భవనం కన్నా పాత భవనమే గట్టితనంగా ఉందని ప్రజలు భావిస్తున్నారు.

బుధవారం స్టేషన్ తనిఖీ నిమిత్తం వచ్చిన ఎస్పీ దామోదర్ దృష్టికి ఈ సమస్యను పోలీస్ సిబ్బంది తీసుకెళ్లారు. ఈక్రమంలో ఆయన భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం. తరచూ భవనం పైకప్పు శ్లాబు పెచ్చులూడిపడుతూ పోలీస్ సిబ్బందికి, ప్రజలకు ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలి

» జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

కనిగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో భూ సమస్యలపై వచ్చిన అర్జీలను భూ రికార్డుల ఆధారంగా పూర్తిగా పరిశీలించాలన్నారు. 22ఏ భూములకు సంబంధించి పాత రెవెన్యూ రికార్డులను పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. భూములు ఆన్‌లైన్ నమోదులో జరిగిన అవకతవకలపై చర్యలు తీసు కుంటామన్నారు. అసైన్డ్ భూముల అక్రమ భూ బదలాయింపుల నివేదిక అందజేయాలన్నారు. గ తంలో ఆన్‌లైన్‌లో ఉండి ప్రస్తుతం లేకుండా ఉన్న భూముల వివరాలను సంబంధిత రైతు లు తగిన పత్రాలు తీసుకువస్తే అక్కడిక క్కడే సమస్యలను పరిష్కరిస్తామన్నారు.


రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

కాగా, మండల పరిధిలోని పునుగోడు కండ్రిక పరిధిలో రైల్వేలైన్‌తో రైతులు కోల్పోతున్న భూములను జేసీ గోపాలకృష్ణ తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. భూములను కోల్పోతున్న సమీప గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో పొగాకు మండిలను పరిశీలించి దిగుబడి, ఆదాయ వివరాలను అడిగి తెలుసుకు న్నారు.

కార్యక్రమంలో కనిగిరి సర్వేయర్ వైష్ణవి, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలిచినా, ఓడినా క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలోని ప్రాంగణంలో నూతన టెన్నిస్ కోర్టును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాజీ జడ్పీటీసీ పీవీ రమణారెడ్డి జ్ఞాపకంగా రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ ఇన్విటేషన్ టోర్నమెంట్‌ను కనిగిరిలో నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, సీఐ ఖాజావలి, వెలుగూరి చంద్రశేఖర్, గోవర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి చెన్నై లో బైపాస్ సర్జరీ జరగగా, ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ప ట్టణంలోని కొత్తూరు అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకు లు తమ్మినేని వెంకటరె డ్డి, కరణం అరుణ, మాజీ కౌన్సిలర్ షేక్ వాజి దాబేగం, ధనలక్ష్మి, సి ద్ధాంతి బారాయిమాం, అమ్ములమ్మ, స్వప్న, తులసి, షరీఫ్, జైభీం నాయ కులు సూరే రాజు, తదితరులు పాల్గొన్నారు.


టెన్నిస్ ఆడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వాగుల్లో నీరు కలుషితం

» మురుగునీరు, వ్యర్థ పదార్థాలు వదిలేస్తున్న వైనం
» తాగనీరులేక తల్లడిల్లుతున్న జీవాలు
» దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
» పట్టించుకోని అధికారులు


లింగాలపాడు-మన్నేపల్లి మార్గంలో దోర్నపువాగు చప్టావద్ద వాగులోకి ప్రవహిస్తున్న మురుగునీరు

తాళ్లూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలం లోని పలు గ్రామాల్లో వాగుల్లో నీరు కలుషితమవు తోంది. దీంతో పశువులు, జీవాలు ఆనీరు తాగలేక దాహార్తితో అలమటిస్తున్నాయి. దీనికితోడు ఆప్రాంత మంతా దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పశువుల షెడ్ల నుంచి మురికినీటిని వాగుల్లోకి వదిలేస్తుండ టంతో ఈ దుస్థితి తలెత్తింది.

తాళ్లూరు మండలంలో గత కొంతకాలంగా గేదెల షెడ్లు అధికమయ్యాయి. పాడిపరిశ్రమపై ఆధారపడ్డ పశుపోషకులు లక్షలాది రూపాయలు వెచ్చించి గేదెల ఫారాలు ఏర్పాటుచేస్తున్నారు. నిత్యం షెడ్లల్లో నుంచి వ్యర్థాలను కాలువలు తీసి నేరుగా వాగుల్లోకి వదులుతున్నారు. గతంలో తక్కువ సంఖ్యలో గేదెలు ఉండటంతో పశుపోషకులు తమ ఇంటి సమీపాల్లోని శాఖీ ప్రదేశాల్లో పేడదిబ్బలు వేసి, ఆనెయ్యి దిబ్బలను పొలాలకు ఎరువుగా వాడేవారు. కొంత కాలంగా పశుపోషకులు షెడ్లు ఏర్పాటుచేసి వందల సంఖ్య లో గేదెలను పెంచుతున్నారు. షెడ్ల నుంచి వ్యర్థాలను యథేచ్ఛగా వాగుల్లోకి వదులుతున్నారు. దీంతో వాగుల్లో నీరు రంగుమారి దుర్గంధం వెదజల్లుతున్నది. పొలాల్లో మేతకు వెళ్లే పశువులు, జీవాలు వాగుల్లోని నీటి తాగలేకపోతున్నాయి.


మాధవరం-మన్నేపల్లి మార్గంలో దోర్నపు వాగులోకి ప్రవహిస్తున్న మురుగునీరు

గతంలో వాగుల్లోని నీరు వీటి దాహర్తిని తీర్చేవి. ప్రస్తుతం కలుషిత నీటితో తాగలేక దాహార్తితో తల్లడిల్లు తున్నాయి. వాగుల్లోకి కుళ్లిన దాణా, వ్యర్థ పదార్థాలను పడవేస్తుండటంతో నీరు పూర్తిగా కలుషితమై ముక్కుపుటలాలు పగిలేలా దుర్గంధం వెదజల్లుతున్నది. గేదెల షెడ్ల నిర్వాహకులు షెడ్ల వద్ద గుంతలు తీసుకుని మురిగినీటిని వాగుల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరు తున్నారు. అధికారులు కూడా స్పందించి గేదెల షెడ్ల మురుగునీరు వాగుల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యం

దర్శి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ అసమర్ధ పాలనతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై అప్పుల ఊబిలో కూరుకుపోయిందని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఓప్ర కటన విడుదల చేశారు. వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేసి ఐదేళ్ళ పాటు అరాచక పాలన సాగించిన వైఎస్ జగన్ ఆర్థిక పరిస్థితి గురించి మాట్లాడటం హాస్యా స్పదంగా ఉందన్నారు. గత పాలకుల నిర్వాకంతో రూ.6.46 కోట్లు బడ్జెట్ అప్పు, రూ.1.40 లక్షల కోట్లు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఇచ్చిన ఏఒక్క హామీ అమలుచేయలేక చేతులెత్తేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు నీతులు మాట్లాడటం శోచనీయమన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్న జగన్మోహన్‌రెడ్డి నీతులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యం లో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. వైసీపీ నాయకులు, కార్పోరేటర్లు టీడీపీ కూటమిలో చేరుతామని తమ దగ్గరకు వస్తున్న విషయం తెలుసుకో కుండా బలవంతగా లాక్కుంటున్నామని వైసీపీ నాయకులు చెప్పటం సిగ్గుచేటన్నారు. ప్రజలు అన్నివిషయాలను గమనిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఆపార్టీకి పుట్టగతులు ఉండవని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ తాటికొండ

తాళ్లూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. గురువారం తూర్పు గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడారు. వైద్యసిబ్బంది బాధ్యతగా పనిచేస్తూ ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. అంతకుముందు ఆయన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ తూర్పుగంగవరం పీహెచ్‌సీకి నిధులు సమకూర్చి వసతులు మరింత మెరుగుపరుస్తామన్నారు. వైద్యశాలకు ఏఅవసరం కావాలన్నా పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈసందర్భంగా అసుపత్రిలో అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించారు. ఆసుపత్రిలో మురుగుదొడ్లు, ఇన్వర్టర్లు, కంప్యూటర్లు మరమ్మతులు చేయించాలని తీర్మానించారు. వైద్యశాల నిర్వహణకు అవసరమైన స్టేషనరీ కొనుగోలుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులు కేటాయించేందుకు ఆమోదించారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రతి ఏటా రూ.లక్షా 75వేల ఫండ్ ఆసుపత్రికి వస్తుందని చెప్పారు. ఆనిధులతో మందుల కొనుగోలు, ఆసుపత్రిలో తలెత్తే చిన్న పాటిసమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీడీవో డి.హనుమంతరావు, వైద్యులు మౌనిక, సీహెచ్ శ్రీకాంత్, తహసీల్దార్ ఇమ్మానియేల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక వంగడాలతో అధిక దిగుబడులు


నూతన వంగడాలతో సాగుచేసిన కందిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పీసీపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్వల్పకాలిక రకాలతో అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా దర్శి వ్యవసాయ పరిశోధనా కేంద్రం కృషి చేస్తుందని లాం ఫాం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జంగాలపల్లి గ్రామంలో రైతులు సాగుచేసిన స్వల్పకాలిక సంకర రకాల కంది పంటను పరిశీలించారు. ఈసందర్భంగా సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. మరో శాస్త్రవేత్త సంధ్యారాణి మాట్లాడుతూ కందిలో నాలుగు రకాల నూతన వంగడాలను గ్రామంలో సాగుచేయించినట్లు చెప్పారు. వాటి దిగుబడుల ఆధారంగా రానున్న రోజుల్లో రైతులకు ఈ విత్తనాలను అందించి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సాంబశివరావు, రమేష్, వరప్రసాదు, ఏడీఏ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ముండ్లమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందాడు. ఈఘటన బుధవారం మధ్యాహ్నం భీమవరం - పూరిమెట్ల మార్గంలో ఆర్టీసీ బస్సులో చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ముక్కెళ్ళ గ్రామానికి చెందిన దూదెకుంట చిననారాయణ(56) కుటుంబ సభ్యులందరూ నెలరోజుల క్రితం మిరప కాయలు కోసేందుకు ఉమామహేశ్వరం అగ్రహారం వచ్చారు. వారం రోజుల పాటు మిరప కాయల కోత కూలీకి వెళ్ళి మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్ళాడు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి అగ్రహారం వస్తున్నాడు. ఈక్రమంలో అద్దంకి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో వినుకొండ నుంచి అగ్రహారానికి బయలుదేరాడు. భీమవరం - పూరిమెట్ల మధ్యలో ఆయనకు గుండె పోటు వచ్చి సీట్లో కూలి పోయాడు. వెంటనే కండక్టర్, డ్రైవర్ అప్రమత్త మై అతనికి సపర్యలు చేశారు. అగ్రహారం ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువచ్చి చికిత్స చేస్తుండగా నారాయణ మృతి చెందాడు. దీంతో మిర్చి కోతలకు భార్య, పిల్లలు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వెంటనే అంబులెన్స్‌లో స్వగ్రామానికి బంధువులు తీసుకెళ్లారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వివాదాస్పద భూమి సర్వే


వివాదాస్పద భూమిని సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కురిచేడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామంలో 272 సర్వే నంబరులో 2009లో 54 ఎకరాలకు పట్టాలు ఇవ్వగా, సదరు భూమిలో సాగుకు కొందరు అడ్డు కుంటున్నారని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈవిషయమై గురువారం రెవెన్యూ అధికారులు సర్వేకు వెళ్లగా, విస్తుపోయే విషయాలు బయటకు వచ్చాయి. రెవెన్యూ అధికారులు గతంలో భూమిని చూడకుండానే కొండపోరంబోకు భూమికి పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సదరు భూమి ఇప్పటికి పలువురి చేతులు మారింది. ప్రస్తుతం ఎవరైతే భూమి మీద ఉన్నారో, వారు మాత్రం సర్వే జరిగే సమయంలో భూమి వద్దకు రాకపోవడం విశేషం. అదే సర్వే నంబరులో ఎస్సీలు కొంత భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. దానికి పట్టాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ దశలో దళారులు రంగ ప్రవేశం చేశారు. గతంలో ఒకరి వద్ద నుంచి మరొకరికి, వారి నుంచి మరొకరికి అమ్మకాలు చేయించిన దళారులు మరలా అదే భూమిని ప్రస్తుతం కొనుగోలు చేసిన వ్యక్తికి పట్టాలు ఇప్పించేందుకు పావులు కదుపుతున్నారు. గురువారం సర్వే పూర్తి కాలేదని శుక్రవారం కూడా సర్వే చేయాలని సర్వే అధికారులు తెలియజేశారు. పూర్తిగా సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు.

సదరమ్ క్యాంపులో మెరుగైన సేవలు అందించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సర్వజన ఆస్పత్రిలోని సదరమ్ క్యాంపునకు వచ్చేవారికి మెరుగైన సేవలు, సదుపాయాలు కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలోని సదరమ్ క్యాంపు జరిగే సైకియాట్రి, ఎముకలు, కీళ్ల విభాగాన్ని గురువారం డీసీహెచ్ఎస్ డాక్టర్ సూరిబాబుతో కలిసి పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్లస్ టు పాఠశాలలను కొనసాగించాలి

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన(ఇంటర్మీడియెట్) ప్లస్ టు పాఠశాలలను కొనసాగించేలా చూడాలని ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కోరారు. గురువారం ఒంగోలులో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో భాగంగా పాఠశాల విద్యలోనే ప్లస్ టు పాఠశాలలను కొనసాగించి ప్రస్తుతం పనిచేస్తున్న వారిని యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరామకృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.దిలీప్‌చక్రవర్తి, ప్లస్‌టు అధ్యాపకులు వి.మార్కండేయులు, ఎం.నాగకుమారశర్మ, ఆర్.జగన్నాథరావు, నాగ ప్రకాష్, కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో అభివృద్ధి చేయనున్న కత్తవ చెరువు



అమృత్ 2.0 ఆమోదం

పురాల్లో పట్టాలెక్కనున్న పనులు

- రూ.964.31 కోట్లతో ప్రణాళికలు సిద్ధం
- కేంద్రం నుంచి 50 శాతం నిధులు మంజూరు
- వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులకు మోక్షం
- రాష్ట్ర ప్రభుత్వ, మున్సిపల్ వాటాగా ఆర్థిక సంఘం నిధులు
- పురపాలక సంఘాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

అమృత్ 2.0 ఆమోదంతో మున్సిపాలిటీల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య తీరనున్నది. ఈ పథకం కింద తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం, తాగునీటి చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టనున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పురాల్లో అమృత్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ పనులను కూడా అమృత్ 2.0లో చేర్చారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో నిలిచిపోయిన పనులు చేపట్టేందుకు తాజాగా వ్యయ అంచనాలను అధికారులు రూపొందించారు. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఆ డీపీఆర్‌లను బుధవారం ఆమోదించింది. దీంతో అమృత్ పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. మున్సిపాల్టీలలో తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో విస్తరించి నూరు శాతం గృహాలకు కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీరు ఇచ్చే దిశగా పనులు చేపట్టనున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ కేంద్రాల్లో ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అమృత్ పనులకు ఆమోదంతో మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనుంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపాల్టీలు దామాషా ప్రకారం అమృత్ పనులకు నిధులు సమకూరనున్నాయి. దాదాపు రూ.964.31 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయి. కేంద్రం వాటా కింద 50 శాతం నిధులు మంజూరయ్యాయి. మున్సిపల్ పట్టణాల్లోని ప్రతి ఇంటికి నీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని, సురక్షితమైన తాగునీరు అందించాలన్నది అమృత్ లక్ష్యం. అయితే గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అమృత్ లక్ష్యం నీరుగారిపోయింది. వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకపోవడంతో పాటు కేంద్రం విడుదల చేసిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించుకుంది. దీంతో అమృత్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో తాజాగా అమృత్ పనులకు ఆమోదంతో పురాల్లో పనులు త్వరితగతిన చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అమృత్-1 పథకంలో నిలిచిపోయిన పనులను కూడా కొన్నింటిని అమృత్ 2.0లో చేర్చారు. అమృత్ పనులకు నిధుల భారం రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపాల్టీలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థ వాటా నిధులను 15వ ఆర్థిక సంఘం నుంచి వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మున్సిపాల్టీలపై నిధుల భారం తప్పనుంది.



నరసరావుపేటలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం

గతంలో నిలిచిన పనులకు మోక్షం

అమృత్ పథకం కింద చిలకలూరిపేటలో రక్షిత మంచినీటి పథకం విస్తరణ టీడీపీ హయాంలో రూ.145 కోట్లతో చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం నిధులను నిలిపివేయడంతో పనులు ఆగిపోయాయి. దీంతో ఈ పథకాన్ని అమృత్ 2.0 కింద చేర్చారు. రూ.116 కోట్లతో పథకాన్ని పూర్తి చేసేలా అంచనాలను రూపొందించారు. చిలకలూరిపేట తరహాలోనే ఇతర మున్సిపాల్టీలలో నిధుల కొరతతో నిలిచిపోయిన పనులను కూడా పూర్తి చేసేందుకు డీపీఆర్‌లు సిద్ధం చేశారు. మున్సిపాల్టీలలో రానున్న 25 ఏళ్ల ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి పథకాలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

కలుషిత జలాలు శుద్ధి..

తాగునీటి పథకాల అభివృద్ధితో పాటు మురుగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అమృత్ పథకంలో పెద్దపీట వేస్తున్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపడుతున్నారు. గుంటూరు, నరసరావుపేట పట్టణాల్లో ఇప్పటికే భూగర్భ డ్రెయినేజ్ పథకాలు ఉన్నాయి. మిగతా మున్సిపాల్టీలలో మురుగు నీరు వాగుల్లో కలసి జలాలు కలుషితం అవుతున్నాయి. దీనిని పూర్తిగా నిరోధించేందుకు ప్రతి మున్సిపాల్టీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్లాంట్లను నిర్మించి మురుగు నీటిని శుద్ధి చేసిన అనంతరం నీటిని బయటకు పంపుతారు. మున్సిపాల్టీల పరిధిలో ఉన్న తాగునీటి చెరువులను కూడా అభివృద్ధి చేయనున్నారు. భూగర్భ జలాలు పెంచే దిశగా చెరువులను పునరుద్ధరించనున్నారు.

వ్యయం అంచనా వివరాలు

మున్సిపాల్టీ	వ్యయం (రూ.కోట్లలో)
పల్నాడు జిల్లా..	
నరసరావుపేట	29.42
చిలకలూరిపేట	160.90
వినుకొండ	29.57
దాచేపల్లి	8.61
పిడుగురాళ్ల	36.29
గురజాల	5.27
మాచర్ల	43.43
సత్తెనపల్లి	0.72
గుంటూరు జిల్లా..	
గుంటూరుకార్పొరేషన్	381.12
మంగళగిరి-తాడేపల్లి	76.43
తెనాలి	61.61
పొన్నూరు	22.10
బాపట్ల జిల్లా..	
చీరాల	32.68
బాపట్ల	25.32
రేపల్లె	45.74
అద్దంకి	5.10


మంత్రులు @ 13, 21

గొట్టిపాటి, అనగాని పనితీరుకు ర్యాంకులు

డిసెంబరు వరకు ఫైళ్ల క్లియరెన్స్ ప్రామాణికంగా సీఎం ప్రకటన



గొట్టిపాటి రవికుమార్



అనగాని సత్యప్రసాద్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేలు రెండు కీలక శాఖలకు మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారు ప్రమాణ స్వీకారం చేసి దాదాపు ఎనిమిది నెలలు అవుతోంది. ఈ క్రమంలో వారి పనితీరు ఆధారంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ర్యాంకులు ఇచ్చారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 13వ స్థానం, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ 21వ స్థానంలో నిలిచారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి గతేడాది డిసెంబరు చివరి వరకు ఫైళ్ల క్లియరెన్స్ ప్రామాణికంగా సీఎం చంద్రబాబునాయుడు మంత్రులకు ర్యాంకులు ఇచ్చారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రెవెన్యూశాఖల మంత్రులుగా ఉన్నారు. ఈ క్రమంలో ప్రస్తుత ర్యాంకులు పనితీరు విషయంలో వారు ఇంకా మెరుగుపడాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

రెవెన్యూ చుట్టూనే కేంద్రీకృతం..

గత ప్రభుత్వం అన్ని విధాల భ్రష్టు పట్టించిన రెవెన్యూ శాఖ బాధ్యతలను అనగాని తీసుకున్నారు. గత ప్రభుత్వం భూముల విషయంలో ఇష్టారీతిన నిబంధనలకు ఉల్లంఘనలకు పాల్పడిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి వైసీపీ హయాం లోని భూ బాగోతాల మీద దృష్టి పెట్టి బాధితులకు న్యాయం చేయడమే అజెండాగా రెవెన్యూ సదస్సుల కు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. తవ్వే కొద్దీ భూబా గోతాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. వీటికి పరాకాష్టగా బాపట్లలో సీఎం చంద్రబాబునాయుడు పేరు మీద ఉన్న స్థలాన్నే దొంగ దస్తావేజులతో వేరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతం ఇటీవలే వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇంతటి కీలకమైన శాఖ పనితీరులో మంత్రి అనగానికి 21వ ర్యాంకు దక్కింది.

విద్యుత్‌రంగంలో సంస్కరణలు

గత ప్రభుత్వం ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచి కరెంటు బిల్లులు అంటేనే ప్రజలు భయపడే పరిస్థితిని తీసుకువచ్చింది. గత ప్రభుత్వం అడ్డగోలుగా తీసుకున్న విద్యుత్ ఒప్పందాలను సమీక్షించడంతో పాటు కొత్తగా సోలార్‌కు సంబంధించి పెద్దఎత్తున రాయితీలు ఇవ్వడం లాంటివన్నీ విద్యుత్‌శాఖ ముమ్మరంగా చేస్తోంది. ఈ శాఖ బాధ్యతల్లో ఉన్న గొట్టిపాటి 13వ ర్యాంకు దక్కింది. ఇక జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న కొలుసు పార్థసారథికి 23వ స్థానం దక్కడం గమనార్హం.

సమస్యల పరిష్కారానికి కృషి

- గ్రానైట్ పరిశ్రమల యజమానులతో మంత్రి రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమల యజమానులు, గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం అమరావతిలో మంత్రిని కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రధానంగా తగ్గిన ఎగుమతులు, కూలీల కొరత, గిట్టుబాటు ధర లేకపోవడం తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకుపోయారు. అందరికి ఉపయోగపడేలా మరింత పారదర్శక విధానం అమలు చేయాలని, గ్రానైట్ పరిశ్రమకు విద్యుత్‌తోపాటు వివిధ రకాల పారిశ్రామిక రాయితీలను కల్పించాలని కోరారు. అన్ని సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానని రవికుమార్ హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బల్లికురవ, మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, పత్తిపాటి సురేష్, ఇంటూరి ఆంజనేయులు, పుచ్చకాయల సుబ్బరామయ్య, చల్లగుండ్ల కృష్ణ, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



గ్రానైట్ పరిశ్రమల యజమానులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

పంచాయతీల్లో అక్రమాల నిగ్గు తేల్చండి

- విచారణకు ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల్లో ఇష్టారీతిన నిధులు దుర్వినియోగమైన ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వచ్చిన సంగతి తెలిసిందే. ఇలా వచ్చిన వాటిలో ప్రధానంగా కారంచేడు మండలం కుంకలమర్రు పంచాయతీ కూడా ఉంది. అక్రమాలపై గ్రామస్థులు గతంలో ఇచ్చిన వినతిపత్రం మేరకు కలెక్టర్ వెంకటమురళి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు చీరాల ఆర్డీవో, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలను విచారణ చేపట్టాలని కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో సదరు పంచాయతీలో అక్రమాలకు పాల్పడ్డ వారి వెన్నులో వణుకు మొదలైంది

దాదాపు 18 గ్రామ పంచాయతీల్లో..

గత ప్రభుత్వ ఏలుబడిలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 18 పంచాయతీల్లో పెద్దఎత్తున నిధులు దారి మళ్లడమే కాకుండా రికార్డులు సైతం తారుమారు చేశారన్న అభియోగాలు ఉన్నాయి. దశల వారీగా అన్నింటి మీద విచారణ జరిపి అవకతవకల నిగ్గు తేల్చడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. బల్లికురవ మండల పరిధిలోని నాలుగు పంచాయతీలకు దక్కాల్సిన సీనరేజీ నిధులను రాజకీయ ఒత్తిళ్లతో ఒకే పంచాయతీకి గత ప్రభుత్వం మళ్లించింది. దీనికి సంబంధించి సమగ్ర విచారణను గురువారమే అధికారులు చేపట్టారు.

పర్చూరులో టింబర్ డిపో దగ్ధం

- అర్ధరాత్రి ఘటన.. రూ.2 కోట్లకుపైగా నష్టం

పర్చూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పర్చూరులోని నాగేశ్వరి టింబర్ డిపో బుధవారం అర్ధరాత్రి దగ్ధమైంది. రాత్రి 12 గంటల తర్వాత కలప అడితీలో మంటలు లేచాయి. దీంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు అప్రమత్తమై మంటలను అదుపు చేయడానికి ప్రత్నించారు. అయితే పెద్దఎత్తున మంటలు చెలరేగటంతో నిమిషాల వ్యవధిలోనే డిపోలోనే కలప, కటింగ్ చేసే యంత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రాంగణంలోని కారు కూడా పూర్తిగా కాలిపోయింది. ఎస్ఐ మాల్యాద్రి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. దీంతో బాపట్ల, చిలకలూరిపేట నుంచి కూడా ఫైర్ ఇంజన్లను రంగంలోకి దింపారు. సుమారు ఆరు గంటలపాటు ఫైర్ సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రూ.2 కోట్లకు పైగా ఆస్తినష్టం జరిగిందని టింబర్ డిపో యాజమాని కోడూరి శేషబ్రహ్మచారి తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

తప్పిన పెనుప్రమాదం..

టింబర్ డిపోలో మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళన చెందారు. సకాలంలో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఏ మాత్రం ఆలస్యం జరిగినా సమీపంలోని కాలనీలకు మంటలు వ్యాపించేవి. క్లూస్ టీం అధికారులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి నమూనాలు సేకరించారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న అధికారులు

సీనరేజ్ నిధుల వివాదంపై కదలిక

- మల్లాయపాలెంలో రికార్డుల పరిశీలన
- మంత్రి ఆదేశాలతో సమస్య పరిష్కారం దిశగా అడుగులు

బల్లికురవ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు వీర్ల కొండ గ్రానైట్ క్వారీల నుంచి వచ్చే సీనరేజ్ నిధుల వ్యవహారంలో నాలుగు గ్రామ పంచాయతీల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. గురువారం బల్లికురవ మండలం మల్లాయపాలెంలో డీపీవో ప్రభాకరరావు, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మైనింగ్ ఏడీ రాజేష్ బాబు, సర్వే ఏడీ కనకప్రసాద్ సీనరేజ్ నిధులకు సంబంధించి మల్లాయపాలెం, నక్కబొక్కలపాడు, కె. రాజుపాలెం గ్రామాల సర్పంచ్‌లు జూపల్లి రాఘవరావు, దూళిపాళ్ల బుల్లిరామయ్య, అమరనేని లక్ష్మీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సర్వే నెంబరు 103లో ఏ గ్రామాలకు సంబంధించిన భూములు, క్వారీలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. 2008లో వాటాలు ఎలా తయారు చేశారన్న వివరాలను సర్పంచ్‌ల నుంచి సేకరించారు. అన్ని పంచాయతీలకు న్యాయం చేసేలా సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. గతంలో ఓ అధికారి చేసిన తప్పుకు తమ గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచి పోయాయని, సీనరేజ్ నిధులు కొణిదెన పంచాయతీలో నిరుపయెగంగా ఉన్నాయని, గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం న్యాయం చేయాలని సర్పంచ్‌లు అధికారులను కోరారు. సీనరేజ్ నిధులు తమ ఒక్క గ్రామానికే చెందుతాయని, రికార్డులో కొణిదెన రెవెన్యూ అని ఉందని ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేత గుంజి సుబ్బారావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె. కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, ఈవోపీఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శి షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

గతంలో కేటాయించిన వాటాల వివరాలు ఇలా..

2008లో అప్పటి సర్పంచ్‌లు గ్రానైట్ క్వారీల నుంచి వచ్చే సీనరేజ్ నిధులు నాలుగు పంచాయతీలకు పొలాల విస్తీర్ణం ప్రకారం అధికారుల సమక్షంలో వాటాల మేర కేటాయింపులు చేసుకున్నారు. ఆ ప్రకారం కొణిదెన పంచాయతీకి 24 శాతం, కె.రాజుపాలేనికి 17 శాతం, నక్కబొక్కలపాడుకు 27 శాతం, మల్లాయపాలేనికి 32 శాతం నిధులు కేటాయించేలా ఒప్పందం జరిగింది. అయితే గతంలో పని చేసిన ఓ అధికారి తన ఇష్టానుసారంగా కొణిదెన పంచాయతీకి మాత్రమే నూరు శాతం నిధులు కేటాయిస్తూ సుమారు రూ.1.40 కోట్లను జమ చేశారు. ఈ విషయం తెలుసుకున్న నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, కె.రాజుపాలెం సర్పంచ్‌లు తమకు అన్యాయం జరిగిందని కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. తప్పు జరిగిందని గుర్తించిన అధికారులు నిలుపుదల చేస్తూ ఫ్రీజింగ్ పెట్టారు. దీంతో కొణిదెన సర్పంచ్, మిగిలిన మూడు గ్రామాల సర్పంచ్‌లు కోర్టును ఆశ్రయించారు.



నాలుగు పంచాయతీల సీనరేజ్ నిధుల వాటాలపై రికార్డును పరిశీలిస్తున్న జిల్లా, రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ అధికారులు

మంత్రి ఆదేశాలతో రంగంలోకి అధికారులు

సీనరేజ్ నిధులకు సంబంధించి మూడు గ్రామాల సర్పంచ్‌లు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి వెంటనే జిల్లా అధికారులకు నాలుగు గ్రామాలకు చెందిన భూముల సరిహద్దులను పరిశీలించి అందరికీ న్యాయం చేసేలా సమస్యను పరిష్కరించాలని సూచించారు. మంత్రి ఆదేశాలతో అధికారుల బృందం మల్లాయపాలెం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలన చేసింది. త్వరలో మరో మారు వచ్చి సమస్య పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టనున్నారు.

ఉత్తిపోతలే..

- రూ.80 కోట్లు వృథా
- 4500 ఎకరాలకు అందని సాగునీరు
- ప్రారంభం కాకుండానే మూలకు తమ్మవరం-2

మేదరమెట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తమ్మవరం -2 ఎత్తిపోతల పథకం పరిస్థితి. 360 రోజులు నీళ్లు.. 18 గంటల విద్యుత్ అందుబాటులో ఉంది. పంపులు మోటార్లు బిగించి ఉన్నాయి. అయినా ఎత్తిపోతల సాగడం లేదు. రైతుల అలక్ష్యం కొంత, ప్రజా ప్రతినిధుల సాచివేతతో ఎత్తివేతల మూలన పడింది. 26 ఏళ్ల కిందట ప్రభుత్వం రూ.79 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఎత్తిపోతల పథకం నిరుపయెగంగా మారింది. ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయ్యే నాటికి గుండ్లకమ్మలో నీరు లేకపోవడంతో ప్రారంభం కాకుండానే మూలన పడింది. ఇప్పటికి ప్రారంభోత్సవ శిలాఫలకం లేని ఎత్తిపోతల పథకం ఇదే. గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణాంతో తమ్మవరం ఎత్తిపోతల పథకం ముంపులో చేరింది. 2008లో పునఃనిర్మాణం ప్రారంభమైనా ఎన్నికలు రావడంతో కొంత ఆలస్యం, ఆ తర్వాత నది నుంచి నీటిని తీసుకునే కాలువ(ఇన్‌టెక్ కెనాల్) సట్టు పడడం, సరైన సమయంలో కాంట్రాక్టర్ పని చేయకపోవడంతో పునర్ నిర్మాణ పనులు 2015 వరకు సాగాయి. ఎత్తిపోతల నిర్మాణం సమయంలో తీసిన కాలువల నిర్మాణం పూర్తయ్యే సరికి ఆనావాళ్లు లేకుండా పోయాయి. పునర్ నిర్మాణం పూర్తయినా నీళ్లు ఇవ్వలేని దుస్థితి. 2018లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.11కోట్లు మంజూరు చేయించారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ పనులు మొదలు పెట్టే సరికి ఎన్నికలు వచ్చాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వం 25 శాతంలోపు జరిగిన పనులను రద్దు చేసింది. దీంతో తమ్మవరం-2 ఎత్తిపోతల పథకం మొదటికి వచ్చింది. కొరిశపాడు, నాగులుప్పాలపాడు గ్రామాలలోని 8 గ్రామాల్లో 4500ఎకరాలకు సాగు నీరు అందించే ఈ పథకం మూలన పడింది. ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.80 కోట్లు నిరుపయోగంగా మారాయి. ఎత్తిపోతల పథకం చుట్టూ, అక్కడి సబ్ స్టేషన్ మొత్తం ముళ్ల చెట్లతో నిండిపోయింది. ఈ పంప్ హౌస్ షట్టర్‌లు తెరిచి ఉన్నాయి. లోపలున్న రాగి ఇతర వస్తువులను దొంగలు ఎత్తుకు వెళ్లారు. ఈ పథకం నిర్మాణం పూర్తయిన నాటి నుంచి ఐడీసీ అధికారులు నిర్లక్ష్యంతో రైతులకు సాగు నీరు అందలేదు. పునఃనిర్మాణం సమయంలో పంపు హౌస్ నిర్మాణానికి మాత్రమే నిధులు అడిగారు. కాలువల పునఃనిర్మాణానికి కూడా నిధులు అడిగి ఉంటే ఈ పథకం అప్పుడే నడిచేది. ఐడీసీ అధికారులు ప్రభుత్వాలు మారనప్పుడలా రైతులతో సంబంధం లేకుండా ఇష్టారీతిన కమిటీలు వేయడం పతకం మూలన పడడానికి ఒక కారణం. ఐడీసీ అధికారులు ఎత్తిపోతల పథకం వద్ద వాచ్‌మన్‌ను కూడా నీయమించకపోవడంతో విలులైన వస్తువులు దొంగల పాలయ్యాయి.



ముళ్ల చెట్లతో నిండిపోయిన తమ్మవరం2 ఎత్తిపోతల పథకం పంప్ హౌస్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాకుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అద్దంకి మున్సిపాలిటిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నా ప్రభుత్వ పథకాలు అమలు చేయడం లేదని తెలిపారు. దీనితో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో పాటు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నడపలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎస్సీ , ఎస్టీలకు విద్యుత్ రాయితీ అ మలు కావడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి. బిష్మా, లక్ష్మి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం స్పెషల్ డెస్క్ ఏర్పాటు



రేణంగివరం పోలీస్ స్టేషన్లో మహిళల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డెస్క్

పంగులూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసినట్లు రేణంగివరం ఎస్ఐ వినోద్ బాబు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల రక్షణ కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. మహిళలు ఏ సమయంలో అయినా డెస్క్‌ను సంప్రదించ వచ్చుని, మహిళల రక్షణ కోసం తాము ఎల్ల వేళలా అందుబాటులో ఉంటామని ఎస్ఐ తెలిపారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్‌లు

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై న్యాయ విచారణ

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు విషయంలో పారదర్శకంగా విచారణ జరపాలని పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు కోరారు. గతంలో జరిగిన అత్యవసర సమావేశంలో విగ్రహం ఏర్పాటుకు స్థలం పరిశీలించి అనంతరం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలనే అంశంపై అజెండాలో ఆమోదం తెలుపగా మాజీమంత్రి డా పాలేటి రామారావు విగ్రహానికి అనుమతి వచ్చిందంటూ వైసీపీ నాయకులతో హడావుడిగా భూమిపూజ చేయించడం అన్యాయమని పేర్కొన్నారు. అలాగే కౌన్సిల్‌కు సంబంధించిన 14 మంది కౌన్సిలర్‌లు మరొక ప్రదేశాన్ని కోరారని, ఈక్రమంలో సమగ్ర విచారణ జరపాలని కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు టీడీపీ కౌన్సిలర్‌లు మించాల సాంబశివరావు, సల్లూరి సత్యానందం, పొత్తూరి సుబ్బయ్య తదితర నాయకులు వినతిపత్రం అందజేశారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 13 పరీక్షా కేంద్రాలు పెంపు
- జిల్లావ్యాప్తంగా 183 పరీక్షా కేంద్రాలు
- ఆరు కేంద్రాలకు సీసీ కెమెరాలు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చేనెల 17వతేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్రాలు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల ఎంపికకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి ఆమోద ముద్ర వేశారు. ఈ ఏడాది పదవ తరగతి రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూలు సొసైటీ విద్యార్థులను కూడా కలిపి ఒకేసారి పరీక్షలు నిర్వహించనున్నారు. గతేడాది రెగ్యులర్ విద్యార్థులకు 170 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది ఓపెన్ స్కూలు విద్యార్థులకు ఒకేసారి పరీక్షలు నిర్వహించాల్సి రావడంతో 13 కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 183 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిలైన వారు మొత్తం 29,843మంది పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 29,602 మంది కాగా ఒకసారి ఫెయిలైన వారు 241 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. ఆరు సమస్యాత్మక కేంద్రాలలో కాపీయింగ్‌ను నిరోధించేందుకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఓపెన్ విద్యార్థులకు 23 కేంద్రాలు

జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూలు సొసైటీ విద్యార్థులు 23 పరీక్షా కేంద్రాల్లో కలిసి పరీక్ష రాయనున్నారు. ప్రతి కేంద్రంలో రెండు గదులను ఓపెన్ స్కూలు విద్యార్థులకు కేటాయిస్తారు. ఓపెన్ స్కూలు సొసైటీ రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులు 1,564 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒంగోలు, మార్కాపురంలలో రెండేసి కేంద్రాలు, కనిగిరి, యైపాలెంలో ఐదు కేంద్రాలు, దర్శిలో అత్యధికంగా ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా గిద్దలూరులో మూడు కేంద్రాల్లో రెగ్యులర్‌తోపాటు ఓపెన్‌స్కూలు విద్యార్థులు కూడా పరీక్షలు రానునున్నారు.

ఆరు కేంద్రాలకు సీసీ కెమెరాలు

జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు రాయనున్నారు. సమస్యాత్మక కేంద్రాలుగా ఈ కేంద్రాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పిటికాయగుళ్ల, యేనుగులదిన్నెపాడు, చంద్రశేఖరపురం, యాచవరం, రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఈ పాఠశాలలకు సమర్థులైన అధికారులు, ఉపాధ్యాయులను పరీక్షల విధులకు నియమించమని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఆదేశించారు.

అద్దంకిలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

ఫలిస్తున్న పోలీసుల ప్రణాళికలు

చిక్కుముడి నుంచి బయట పడుతున్న భవానీసెంటర్

రోజూ సాయంత్రం విజిబుల్ పోలీసింగ్

మిగిలిన ప్రాంతాలలో రద్దీ సమయాలలో కానిస్టేబుళ్ల విధులు


భవానిసెంటర్‌లో ట్రాఫిక్ ను పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): అద్దంకి అంటే ట్రాఫిక్ పద్మ వ్యూహం నుంచి బయటపడేదెట్లా అని వాహనచోదకులు బెంబేలెత్తిపోయారు. అయితే పోలీస్ అధికారులు పక్షం రోజులు గా అద్దంకి పట్టణంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక


దర్శి రోడ్డు, ఒంగోలు రోడ్డులలో నుంచి వచ్చే వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

దృష్టి సారించారు. గతంలో అద్దంకి ఎస్సైలు గా పనిచేసి అద్దంకి పట్టణం పై పూర్తి అవగాహన ఉన్న చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి టౌన్ సిఐ సుబ్బరాజులు అద్దంకి పట్టణంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. అద్దంకి పట్టణంలో ప్రధాన కూడలిగా ఉన్న భవాని సెంటర్‌పై దృష్టి సారించి ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచిరా త్రి 8 గంటల వరకు ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుల్స్ విధులు నిర్వహించేలా విధులు కేటాయించారు. వీరికి అదనంగా మరి కొంత మంది సిబ్బందిని కూడా తర చూ భవానీ సెంటర్ లో విధులు నిర్వహించేందుకు కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు. సీఐ సుబ్బరాజుతో పాటు ఇద్దరు ఎస్సైలు, ఇతర సిబ్బంది కూడా ప్రతి రోజూ సాయంత్రం సమయంలో ఖచ్చితంగా పట్టణం పరిధిలో విజుబుల్ పోలీసింగ్ నిర్వహించే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో భవానిసెంటర్ లో అడ్డదిడ్డంగా ప్రయాణానికి చెక్ పడింది. మొత్తం 5 రోడ్ల కూడలి కావటంతో అన్ని రోడ్లలో ట్రాఫిక్‌ను కంట్రోల్


ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న కానిస్టేబుల్

చేస్తూ వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నారు. ఇక అదే సమయంలో ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్, ఇన్‌గేట్, రామ్‌నగర్ లలో కూడా వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు కానిస్టేబుళ్ల విధులు నిర్వహించే విధంగా చేశారు. రోడ్డు మార్జిన్‌లు ఆ క్రమించి తోపుడు బండ్లు ఏర్పాటు చేసే వ్యాపారులకు కూడా ముందస్తు సమాచారం ఇవ్వటంతో పాటు ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తుండటంతో కొంత మేర ఫలితం కనిపిస్తున్నది. ఇదే పంధాను కొనసాగిస్తూ ట్రాఫిక్ ఇక్కట్ల నుంచి బయట పడేందుకు మరింత మెరుగైన చర్యలు చేపట్టే దిశలో డీఎస్పీ మొయిన్, సీఐ సుబ్బరాజులు స్థానికులు, వాహనచోదకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నారు. పోలీస్ అధికారుల చర్యలతో అద్దంకిలో ట్రాఫిక్ కష్టాల నుంచి వాహన చోదకులకు కొంత మేర ఉపశమన కలిగినట్లు అయ్యింది.

కర్ణాటక మార్కెట్ హాట్‌హాట్!

రూ.318 పలికిన కిలో పొగాకు

ఈ సీజన్‌లో ఇదే అధిక ధర

మీడియం, లోగ్రేడ్‌లకు అదే పరిస్థితి

ఇది తాత్కాలికమే అంటున్న నిపుణులు

ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో పొగాకు మార్కెట్ మరోసారి హాట్‌హాట్‌గా సాగుతోంది. వారం పదిరోజుల క్రితం కూటమి కట్టి ధరలపై సీలింగ్ పెట్టి కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం బేళ్ల కోసం పోటీ పడుతున్నారు. దీంతో మేలురకం, మీడియం, లోగ్రేడ్ ఇలా అన్ని రకాల ధరలు గణనీయంగా పెరిగాయి. నాలుగైదు రోజులుగా ఈ పరిస్థితి అక్కడి మార్కెట్లో కనిపిస్తుండగా మేలురకం పొగాకు కిలో గరిష్ఠ ధర గురువారం రూ.318 పలికింది. ఈ సీజన్‌లో ఇదే అధిక ధర కాగా వారం పదిరోజుల క్రితం వరకు ఆ రకం ధరలు కిలో రూ.300 లోపుగానే ఉన్నాయి. అక్కడ ఈ సీజన్‌కు 100 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా ఇంచుమించు అంతమేర రైతులు పండించారు. తొలుత కిలో రూ.230తో కొనుగోళ్ల ప్రారంభించిన వ్యాపారులు తొలి నెల రోజులు ధరలు పెంచకుండానే కొంటూ వచ్చారు. అనంతరం క్రమంగా ధరలు పెరిగి డిసెంబర్‌లో అలా గరిష్ఠ ధర రూ.300లకు, జనవరిలో రూ.315కు పెరిగాయి. సంక్రాంతి అనంతరం తిరోగమనంలో మార్కెట్ నడిచింది. వ్యాపారులు కూటమి కట్టి ధరలను కిలో రూ.300కు సీలింగ్ పెట్టి కొన్నారు. అలాగే మీడియం, లోగ్రేడ్లను కూడా అప్పటివరకు ఉన్న ధరల కన్నా కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు తగ్గించి వేశారు.



విదేశీ ఆర్డర్ల ఖరారుతో..

గత పక్షంరోజుల పాటు తిరోగమనంలో సాగిన మార్కెట్ ప్రస్తుతం తిరిగి ఊపందుకుంది. గరిష్ఠ ధర కిలో రూ.315 నుంచి రూ.318 వరకు పలుకుతుండగా మీడియం ధరలు కిలో రూ.280 నుంచి రూ.290 వరకు అలాగే లోగ్రేడ్‌లు సైతం కిలో రూ.250 వరకు లభిస్తున్నాయి. ఎందుకు పనికిరాదనుకునే ఎన్.ఓ.డి. బేళ్లను సైతం కిలో రూ.220పైగా కొంటున్నారు. ఇప్పటివరకు అక్కడ 51 మిలియన్ కిలోలు కొనుగోళ్ల జర్గా సగటున కిలోకు రూ.268 ధర లభించింది. కాగా ఒక్కసారిగా ఈ స్థాయిలో అక్కడ ధరలు పుంజుకోవడానికి ప్రధాన కారణం పలు కంపెనీలకు విదేశీ ఆర్డర్లు ఖరారు కావడమేనని తెలుస్తోంది. సాధారణంగా కర్ణాటకలో ఈ సమయంలో రోజువారీ వేలంకేంద్రాలకు సగటున 1,200 నుంచి 1,500 బేళ్ళు వస్తుంటాయి. అలాంటిది ఇప్పుడు 800 నుంచి వెయ్యి బేళ్ల వరకు మాత్రమే వస్తున్నట్లు సమాచారం. దీంతో వచ్చి బేళ్ల కోసం వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తుండటంతో ఆ మేర ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే మార్కెట్ తాత్కాలికమేనని రానున్న రోజుల్లో అక్కడ కూడా మళ్లీ ధరలు తగ్గే అవకాశం ఉంటుందని పొగాకు రంగంలోని నిపుణులు చెప్తున్నారు. ఆంధ్ర మార్కెట్‌ప్రారంభం నాటికి ధరలు మరింత తగ్గే అవకాశం ఉండే అవకాశాలు ఉన్నాయని చెప్తున్నారు.

ఐదు పోస్టులు.. ఒకే ఒక్కరు

మరో మూడు పోస్టులలో ఇంకొకరు

జలవనరులశాఖలో విచిత్ర పరిస్థితి

డీఈలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తే ఈఈ పోస్టులు భర్తీ


జలవనరుల శాఖ కార్యాలయం (ఫైల్)

ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సాగునీటి వనరులను పర్యవేక్షించే జలవనరులశాఖ ఒంగోలు కేంద్రంగా ఉన్న సర్కిల్ పరిధిలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. అత్యంత కీలకమైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) పోస్టులు పలు రెగ్యులర్ అధికారులు లేక ఖాళీగా ఉండగా ఒకే అధికారి ప్రస్తుతం ఐదు పోస్టులు నిర్వహిస్తున్నారు. మరో అధికారి మూడింటిలో కొనసాగుతున్నారు. ఒంగోలు కేంద్రంగా ఉన్న సర్కిల్ పరిధిలో సుమారు 4.47 లక్షల ఎకరాల ఆయకట్టు ఎన్ఎస్‌పీ పరిధిలోనూ, 40వేల ఎకరాలు మీడియం, లక్షా 35వేల ఎకరాలు మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్నాయి. అంటే ఉమ్మడి జిల్లాలోని మొత్తం సాగర్ ఆయకట్టు, మోపాడు రిజర్వాయర్, కంభం చెరువు, పీబీ ఆనకట్ట వంటి మీడియం అలాగే 953 సాగునీటి చెరువులు అన్ని ఈ సర్కిల్ పరిధిలో ఉంటాయి. వాటి పర్యవేక్షణ ఒంగోలు సర్కిల్ ఎస్ఈ చూస్తుండగా అత్యంత కీలకమైన డివిజన్ స్థాయి ఈఈలు ఎనిమిది మంది ఉంటారు. వాటిలో ప్రస్తుతం ఎస్ఈగా రెగ్యులర్ అధికారైన వరలక్ష్మి మూడు మాసాల క్రితం బాధ్యతలు స్వీకరించి పనిచేస్తుండగా ఎన్ఎస్‌పీ విభాగంలో ఉన్న మూడు ఈఈ పోస్టులలో ఒక్కరే ఉన్నారు.

దర్శి ఈఈకి నాలుగు ఇన్‌చార్జి బాధ్యతలు

గతంలో చీమకుర్తికి ఈఈగా ఉన్న అధికారి పదోన్నతిపై లింగంగుంట్ల ఎస్ఈగా వెళ్లగా అద్దంకి ఈఈని ఒంగోలులోని ప్రాజెక్టుల ఎస్ఈగా నియమించారు. ఇక దర్శిలో ఈఈగా రామకృష్ణ ఉన్నారు. ఆయన గతంలో ఎస్ఈ కార్యాలయంలో డిప్యూటీ ఎస్ఈగా పనిచేస్తుండగా దర్శి ఈఈగా బదిలీ చేశారు. ఇటీవల ఉద్యోగోన్నతిపై అద్దంకి, చీమకుర్తి ఈఈలను బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో ఇంతవరకు ఎవరిని నియమించలేదు. ఎస్ఈ ఆఫీసులో డీఈఈగా ఉన్న అధికారికి దర్శి మార్చినా ఇక్కడ ఎవరిని నియమించలేదు. మూడు ఈఈ పోస్టులు ఖాళీగా ఉండగా ప్రస్తుతం దర్శి ఈఈగా ఉన్న రామకృష్ణ దర్శిలో రెగ్యులర్ బాధ్యతలతోపాటు ఒంగోలు ఎస్ఈ కార్యాలయంలో డీఎస్ఈ పోస్టు అలాగే చీమకుర్తి ఈఈ పోస్టులకు మూటింటికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. అలాగే ఒంగోలులోని గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఉన్న ఎన్ఎస్‌పీ నిర్వహణ అనే మరో ఈఈ పోస్టును కూడా చాలాకాలంగా ఇన్‌చార్జిగా ఉన్నారు. అంటే రామకృష్ణ అనే అధికారి ఈఈతోపాటు మరో నాలుగు ఇన్‌చార్జిలు కలిపి మొత్తం ఐదు పోస్టులలో ఒక్కడే పనిచేస్తున్నారు సాగర్ నీరు ఆయకట్టు భూములకు అందించడం, తాగునీటి వనరులకు చేర్చడంలో ఈఈ స్థాయి అధికారి అత్యంత కీలకం. అదేసమయంలో సర్కిల్ కార్యాలయంలో మొత్తం క్షేత్రస్థాయి శాఖపరమైన ఉత్తర, ప్రత్యుత్తరాలు, ఇతర నిర్వహణ పరమైన అంశాలు, జిల్లా యంత్రాంగం సమీక్షలు, ఉన్నత స్థాయి అధికారులకు నివేదికలు పంపడం వంటి అంశాలలో సర్కిల్ ఆఫీసులోని డీఎస్ఈ పోస్టు చాలా ప్రధానమైనది. అలా కీలకమైన పలు పోస్టులలో ఒకే అధికారి ఉండగా ఆయన సర్కిల్ ఆఫీసులోని డీఎస్ఈ పోస్టు బాధ్యతలతోనే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుండగా ఇతర ప్రాంతాలలో పర్యవేక్షణ కొరవడింది.

వారానికి ఒకరోజు కష్టమే..

ఇక ఈ సర్కిల్ పరిధిలోని మార్కాపురంలో రెగ్యులర్ ఇరిగేషన్ ఈఈ పోస్టు ఉండగా అక్కడ పూర్ణానందరెడ్డి పనిచేస్తున్నారు. ఆయనకు రాళ్లపాడు ప్రాజెక్టుతో పాటు దోర్నాలలోని వెలిగొండ ప్రాజెక్టు ఈఈ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలా మూడు పోస్టులలో ఆయన కొనసాగుతున్నారు. ఒంగోలు రెగ్యులర్ ఈఈ పోస్టులో డీఈ స్థాయి అధికారైన శివరాం ఇన్‌చార్జిగా ఉన్నారు. అలా ఇతర ఈఈ పోస్టుల్లోనూ డీఈలను ఇన్‌చార్జిలుగా నియమించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం స్థానిక అవసరాలకు అనుగుణంగా జిల్లా స్థాయిలో సర్దుబాటుకు అవకాశం కల్పించలేదు. దీంతో ఐదు కీలక పోస్టులలో ఒకరు, మరో మూడింటిలో ఇంకొక అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో కీలకమైన ఈ సమయంలో కనీసం వారు ఇన్‌చార్జిలుగా ఉన్న కార్యాలయాలకు వారానికి ఒక రోజు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక సాగునీటి పర్యవేక్షణ, పనుల పరిశీలన, కార్యాలయాలకు వచ్చే రైతులు, ఇతర ప్రజలకు సమాధానం చెప్పే పరిస్థితి లేకుండాపోయింది.


ఎస్‌వీఆర్ పార్థీవదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో టీడీపీ నాయకులు

ఎస్‌వీఆర్‌కి ఎమ్మెల్యే ఏలూరి నివాళి

మార్టూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన శానంపూడి వెంకటేశ్వరరావు (ఎస్‌వీఆర్) పార్థీవదేహానికి గురువారం ఉదయం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ భర్త వెంకటేశ్వరరావు అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిన విషయం విదితమే. జొన్నతాళి గ్రామంలోని ఆయన ఇంటికి తీసుకు వచ్చిన వెంకటేశ్వరరావు పార్థీవదేహం వద్ద ఎమ్మెల్యే ఏలూరి తో పాటు టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామేపల్లి హరిబాబు, అడుసుమల్లి శ్రీనివాసరావు,కామినేని జనార్దన్, షేక్‌రజాక్ తదితరులు పాల్గొన్నారు.


అనుమానితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు వెల్లడిస్తున్న ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్

అదుపులో అనుమానితులు

- రూ.లక్ష విలువగల సొత్తు స్వాధీనం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పలువురు అనుమానితుల్ని ఈపూరుపాలెం పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు చేసేక్రమంలో ఈపూరుపాలెం సినిమా హాల్ వద్ద ఓ కారులో ముగ్గురు మహిళలు ఇత్తడి పూత వస్తువులు, స్టీలు ప్లేట్స్, నూతన వస్త్రాలు, ఐరన్ బాక్సులు తరలిస్తుండగా వారిని తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫైళ్ల పరిష్కారంలో ఐదవ స్థానంలో మంత్రి స్వామి

- కేబినెట్ భేటీలో ప్రకటించిన సీఎం



ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫైళ్ల పరిష్కారంలో జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఐదవ స్థానంలో నిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల కన్నా ముందు వరుసలో డాక్టర్ స్వామి ఉన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జూలై నుంచి డిసెంబరు వరకు ఆరు మాసాల కాలాన్ని పరిగణనలోకి తీసుకొని పరిష్కారంలో మంత్రుల పనితీరు ఎలా ఉందనే అంశాన్ని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం ప్రస్తావించారు. తాను ఆరవ స్థానంలో ఉన్నట్లు స్వయంగా ప్రకటించిన చంద్రబాబు ఆరు నెలల్లో అందరికన్నా వేగంగా ఫైళ్లను పరిష్కరించి మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తొలిస్థానంలో ఉన్నట్లు చెప్పారు. అలాగే మంత్రులందరూ ఎవరెవరు ఏ స్థానాల్లో ఉన్నారన్న విషయాన్ని కూడా ప్రకటించారు. అందులో జిల్లాకు చెందిన డాక్టర్ స్వామి 5వ స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. సీఎం 6వ స్థానంలో, డిప్యూటీ సీఎం 10వ స్థానంలో, నారా లోకేష్ 8వస్థానంలో ఉండగా ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 13వ స్థానంలో ఉన్నారు.


విద్యాశాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పాఠశాలల హేతుబద్ధీకరణ పూర్తి

- పునఃనిర్మాణ ప్రక్రియను ఆమోదించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాఠశాలల హేతుబద్ధీకరణకు విద్యాశాఖ రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆమోదించారు. జిల్లాలో పాఠశాలల పునఃనిర్మాణానికి సంబంధించి మండలాల వారీగా తయారుచేసిన పీపీటీలను ఆమె సమీక్షించారు. పాఠశాలలను హేతుబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం విధివిధానాలను జారీచేయడంతో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో బడులను హేతుబద్ధీకరణ చేసేందుకు పాఠశాల యాజమాన్య కమిటీల అభిప్రాయాలను సేకరించారు. తదనుగుణంగా జిల్లాలోని 38 మండలాల పాఠశాలల పునఃనిర్మాణ ప్రక్రియను ఆమోదించడంతోపాటు కొన్నిచోట్ల చిన్న చిన్న మార్పులు చేయాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు సమర్పించిన వివరాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలల హేతుబద్ధీకరణకు తీసుకున్న పలు అంశాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఈవో ఏ. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి చిన్నయ్య, పక్కన వెలుగు సిబ్బంది

బ్యాంకు రుణాలపై రైతులకు అవగాహన

పర్చూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : రైతులకు బ్యాంకుల ద్వారా అందించే రుణాలపై గురువారం ఏపీఎం రామకృష్ణ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధికారి చిన్నయ్య మాట్లాడుతూ ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలన్నారు. దీంతోపాటు రైతులకు బ్యాంకు నుంచి ఇచ్చే రుణాలపై సన్న, చిన్నకారు రైతులకు తప్పక వివరించాలన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. 50శాతం సబ్సిడీతో లభించే షేడ్‌నెట్ గురించి వివరించారు. రైతులకు సాగు ఖర్చులు తగ్గించి ఆదాయ వనరులను పెంచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో సిబ్బంది రవీంద్రబాబు, రవికుమార్, ప్రమీల, శ్రీనివాసులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో పిందెలు రాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మార్టూరు,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి):బూడిద తెగులు నివారణకు, మామిడిలో పిందెలు రాలిపోకుండా ముందస్తు జాగ్రత్తగా మందులను వినియోగించాలని రైతులకు ఉద్యానఅధికారి హనుమంతనాయక్ సూచించారు. గురువారం మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో మామిడి తోటలలో సస్యరక్షణ చర్యలపై ఏర్పాటుచేసిన రైతు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పూత,పిందె దశలో చేపట్టవలసిన చర్యలను వివరించారు. వాతావరణ మార్పుల దృష్ట్యా పంటలకు ఆశించే తెగుళ్లు, రసంపీల్చేపురుగులు, పోషకాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కన్సల్టెంట్ కె. విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మామిడి రైతులతో మాట్లాడుతున్న ఉద్యానఅధికారి హనుమంతనాయక్

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని సచివాలయంలో గురువారం చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. చీరాల పరిధిలో మత్స్యకారుల సమస్యల పరిష్కారం దిశగా కృషిచేయాలని కోరారు. గత ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించినట్లు చెప్పారు. మత్స్యకార భరోసా, వలలు, బోట్లు వంటి వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఈక్రమంలో టీడీపీ కూటమి మత్స్యకారులను ఆదుకోవాలన్నారు. హార్బర్, టూరిజం అంశాలను అలాగే చీరాల పరిస్థితులను, అబివృద్ధి పనులను సీఎం దృష్టికి రాష్ట్ర మంత్రులు కింజరపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వివరించారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు


సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే కొండయ్య


చిన్నకొత్తపల్లి సచివాలయంలో రిజిస్టర్‌ను పరిశీలించి ప్రశ్నిస్తున్న ఎంపీడీవో సింగయ్య

ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయంలో పని చేసే ఉద్యోగులు సమయపాలన పాటించి సకాలంలో కార్యాలయానికి హాజరు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య ఆదేశించారు. గురువారం మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆ యా విభాగాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న చిన్నారులకు సంబంధించి ఆధార్ కార్డులు ఉన్నాయా, లేవా అనే విషయాలను వెంటనే పరిశీలించి తగిన సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావు, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ మంత్రి వనమా

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ వెంకట మురళీని గురువారం మాజీ మంత్రి, చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఛైర్మన్ వనమా వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కలెక్టర్ సేవలను కొనియాడారు. ఆయన వెంట కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, మేనేజర్ రమణమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ అన్నం శ్రీనివాసరావు ఉన్నారు.


కలెక్టర్‌ను సన్మానిస్తున్న మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు

వద్దన్నా ఆటోల్లోనే కూలీలు

తనిఖీలతో అవస్థలు
మార్గ మధ్యంలోనే వదిలేసిన డ్రైవర్‌లు
కాలి నడకతో ఇళ్లకు చేరిన వైనం


దర్శి రోడ్డులో నుంచి అద్దంకి పట్టణంలోకి బారులుగా నడిచి వస్తున్న కూలీలు

అద్దంకి, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా పోలీస్ అధికారులు మూకుమ్మడిగా గురువారం సాయంత్రం తనిఖీలు చేపట్టటంతో ఆటోల డ్రైవర్‌లు ఎక్కడికక్కడ నిలిపి వేసి అందులో ప్రయాణించే కూలీలను రోడ్డు పైనే వదిలివేయటంతో వారికి కాలి నడక తప్పలేదు. అద్దంకి పట్టణంతో పాటు సమీప గ్రామాల నుంచి ముండ్లమూరు, తాళ్లూరు మండలాలలో మిర్చి కోతలకు , తిమ్మాయపాలెం వద్ద ఇటుక బట్టీల పనులకు నిత్యం వందల సంఖ్యలో కూలీలు వెళ్ళి వస్తుంటారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ట్రాలీ ఆటోలతో పాటు ప్రయాణికుల ఆటోలలో పరిమితికి మించి వెళుతూ ప్రమాదపు అంచున ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఆటోలు అదుపు తప్పి బోల్తా పడి ప్రయాణికులకు తీవ్ర గాయాలు కూడా అయ్యాయి. ప్రమాదమని తెలిసి కూడా అవసరం కోసం కూలీలు ఆటోలలో ప్రయాణాలు సాగిస్తూనే ఉన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా గురువారం సాయంత్ర ం సీఐ సుబ్బరాజు, ఎస్సై లు ఖాదర్‌బాషా, రవితేజలు అద్దంకి పట్టణంతో పాటు తిమ్మాయపాలెం, కలవకూరు రోడ్డులలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. దీంతో పోలీస్ అధికారులకు దొరికిపోతామని ఆటో డ్రైవర్‌లు కూలీలను ఎక్కడికక్కడ దించి వెళ్లిపోయారు. దీంతో కూలీలు వందల సంఖ్యలో కాలినడకన రెండు, మూడు కిలోమీటర్ల దూరం తిమ్మాయపాలెం నుంచి అద్దంకి పట్టణంలోని వివిధ కాలనీలకు చేరుకున్నారు.


తిమ్మాయపాలెం వద్ద తనిఖీల కోసం ఉన్న ఎస్సై రవితేజ, సిబ్బంది

పోలీస్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేసిన నేపథ్యంలో వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లే సమయాలలో ఆయా రూట్లలో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా చర్యలు చేపడితే వారికి రవాణా కష్టాలు తప్పటం తో పాటు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి కూలీలు పనులకు వెళ్లే రూట్లను గుర్తించి ఆయా సమయాలలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు సూచిస్తున్నారు.

సింథైట్ ఫ్యాక్టరీలో అధికారుల పరిశీలన

మిరప వ్యర్థాల వాడకం, కోరుపై విచారణ

మేదరమెట్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సింథైట్ ఫ్యాక్టరీలో మిరప వ్యర్థాల వాడకంపై గురువారం చీరాల ఆర్డీవో తుమాటి చంద్రశేఖర్ నాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ జి.రాఘవరెడ్డి తదితర అధికారులు పరిశీలన చేశారు. ఫ్యాక్టరీలో మిరప వ్యర్థాలను వాడవద్దని గత ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, రాఘవరెడ్డి తదితర అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం మిర్చి సీజన్ మొదలవుతున్నందున్న బాయిలర్‌లో మిరప వ్యర్థాలు వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలని కంపెనీ దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో అధికారులు పరిశీలనకు వచ్చారు. గతంలో విపరీతంగా కోరు వస్తున్నదని గ్రామస్థులు ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేపట్టగా అధికారులు ఈ ఆదేశాలను జారీ చేశారు. ఐఐటీ చెన్నైకి చెందిన నిపుణులు పరిశీలన చేసి వ్యర్థాలను బాయిలర్‌లో వాడుకోవడానికి అనుమతి ఇచ్చారని ఫ్యాక్టరీ యాజమాన్యం అధికారులు తెలియజేసింది. వ్యర్థాలు వాడడం వలన ఎటువంటి కోరు రాదని వారు అధికారులకు తెలిపారు. గ్రామస్థులు మాత్రం వ్యర్థాలు వాడడానికి వీలు లేదని, గతంలో అవి వాడడం వలనే కోరు వచ్చిందని అధికారులకు తెలిపారు. అధికారులు ఇరువైపులా వాదనలు విన్నారు. కోరు రాకుండా ఏమి వాడినా అభ్యంతరం లేదన్నారు. తాము గత కొన్ని సంవత్సరాలుగా కోరుపైనే పోరాడుతున్నామని, ఫ్యాక్టరీ నుంచి వచ్చిన వ్యర్థ జలాలు యర్రబాలెం చెరువులో కలుస్తున్నాయని అధికారులకు తెలియజేశారు. అధికారులు పరిశీలించి శాంపిల్స్ తీసుకున్నారు. ఎనిమిది మంది సభ్యులతో కూడిన విచారణ బృందం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ట్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ మాధవనాయుడు, జిల్లా ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ హుస్సేన్, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు, డీఐసీ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ గాయత్రిదేవి, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఫ్యాక్టరీ జీఎం అమరనేని అంజనేయులు, సలాం, జయరామన్, గ్రామస్థులు చావా రాజేష్, కనుమూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .


సింథైట్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఆర్‌డీవో, పీసీడీ ఈఈ రాఘవరెడ్డి తదితర అధికారులు

వేటకువెళ్లి సముద్రంలో అదృశ్యం

● ఐదు రోజులైనా కానరాని ఆచూకీ ● రోదిస్తున్న మత్స్యకార కుటుంబం



విచార వదనంలో మత్స్యకారుడి బంధువులు (ఇన్‌సెట్లో) అదృశ్యమైన రమణ (ఫైల్)

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బతుకు పోరాటంలో సముద్రతీరంలో ప్రమాదవశాత్తు అదృశ్యమయ్యాడు. ఎంత వెదికినా ఆచూకీ లేదు. దీంతో వాడరేవు మత్స్యకార కుటుంబం రోదిస్తోంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని వాడరేవు గ్రామానికి చెందిన ఓసిపిల్లి రమణ(53)మత్స్యకారుడు. ఇతనికి భార్య నూకమ్మ, కుమారుడు సత్తిబాబు, ఇద్దరు కుమార్తెలు. ఆదివారం ఉదయం మనవడు చింతకాయల ప్రసాద్, మురళీ, పారా సూరిరావులతో కలిసి రమణ చేపల వేటకు వెళ్లాడు. ఈక్రమంలో రాత్రి సమయంలో సముద్రంలో బోటులో ప్రయాణిస్తూ సుమారు 100 కిలో మీటర్ల మేర విజయవాడలోని బందరు వైపు వేటకు వెళ్లారు. అక్కడ బోటులోనే మనవడితో అర్ధరాత్రి వరకు సరదాగా మాట్లాడుకున్నారు. బాగా ఆలస్యం కావడంతో ఇక పడుకుందామని చెప్పడంతో అందరూ పడుకున్నారు. 3 గంటల సమయంలో టీ పెట్టుకునేందుకు లేచి చూడగా తాత బోటులో కనిపించలేదు.. దీంతో బిత్తరపోయిన మనవడు ప్రసాద్ మిగిలిన వారితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. కనిపించిన బోట్లలోని మత్స్యకారులందరిని ఆరా తీశారు. ప్రయోజనం లేకపోవడంతో మరుసటి రోజు ఉదయం సోమవారం కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈక్రమంలో సుమారు ఐదు రోజులుగా గాలింపు చేస్తూనే ఉన్నారు. అయినా కుటుంబ పెద్ద జాడలేకపోవడంతో ఇప్పటికే ఆశలు వదిలిన కుటుంబ సభ్యులు చివరి చూపయినా దక్కాలని వేడుకుంటున్నారు. ఈ హృదయ విదారక ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

అగ్ని ప్రమాదం విచారకరం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

పర్చూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి శేష బ్రహ్మాచారి టింబర్ డిపో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం అర్ధరాత్రి దగ్ధం అయ్యింది. విషయం తెలియడంతో గురువారం రాత్రి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆయన నివాసానికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం అగ్ని ప్రమాదానికి గురైన టింబర్ డిపోను ఆయన పరిశీలించారు. అగ్ని ప్రమాద సంఘటన విచారకరం అన్నారు. అధైర్య పడవద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ షంషుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, ఫ్యాక్టరీ శ్రీనివాసరావు, కారుమంచి కృష్ణ, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, లక్కిపోగు సుమన్, చెరుకూరి చింపయ్య, కొరిటాల సురేష్, కాపు రవిచంద్ర, విన్నకోట సతీష్, పోహూరి శ్రీనివాసరావు, తులసి శ్రీనివాసరావు, గౌస్, పఠాన్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులు

పర్చూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రమాదం విషయం తెలుసుకున్న మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శేషగిరిరావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలాని, బాపట్ల జిల్లా ఫైర్ అధికారి మాధవ నాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. టింబర్ డిపో యజమాని కోడూరి శేషబ్రహ్మాచారిని అడిగి తెలుసుకున్నారు. అర్ధరాత్రి 1.30గంటల సమయంలో టింబర్ డిపోలో మంటలు వస్తున్నాయని తనకు ఫోన్ వచ్చిందన్నారు. వెంటనే వెళ్లి చూడగా డిపో మొత్తం మంటలు వ్యాపించి ఉన్నాయని, కేకలు వేసి చుట్టు పక్కల వారిని అప్రమత్తం చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగుంటదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో టింబర్ డిపో యజమాని పేర్కొన్నారు.


ప్రమాదం జరిగిన టింబర్ డిపోను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, టీడీపీ నేతలు

తహసీల్దార్‌కు సన్మానం

చినగంజాం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : స్థానిక తహ సీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు గురువారం సన్మానించారు. గత నెల 26వ తేదీ రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ వెంకటమురళి నుంచి ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంసాపత్రాన్ని అందకున్న సందర్భంగా ఆయన్ను రాష్ట్ర ఐక్య వేదిక కమిటీ సభ్యులు బొకేలు, మెమెంటో అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రభాకరరావు వివిధ హోదాలలో ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాలను ఏడుసార్లు అందుకోవడం అభినందనీయమని ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రకాశం, బాపట్ల జిల్లాల అధ్యక్షులు జగన్నాథం యోహాను, విస్తర్ల వెంకట సుబ్బారావు, మదర్సా ప్రిన్సిపాల్ సయ్యద్ హుస్సేన్, అద్దంకి చైతన్య బధిరుల పాఠశాల ఛైర్మన్ పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపాల్ పెద్దినేని సురేంద్రబాబు, విద్యార్థినులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు

సెయింట్ ఆన్స్‌లో

సివిల్ విద్యార్థులకు రెండు రోజుల వర్క్‌షాపు

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులకు ప్రాజెక్టు ప్లానింగ్ సాఫ్ట్‌వేర్, మైక్రో సాఫ్ట్ ప్రాజెక్టుపై రెండు రోజుల వర్క్‌షాపు గురువారం ప్రారంభమైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జగదీష్, డీన్ శ్రీహరి, ప్రొఫెసర్ రవీంద్రనాథ్ చౌదరి, కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు

మిరప పంట పరిశీలన

మార్టూరు,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రైతు పెంట్యాల శరత్ సేంద్రియ వ్యసాయంతో పండిస్తున్న మిరప పంటను గురువారం ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ ఎం. శేషుమాదవ్ పరిశీలించారు. మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో రైతు శరత్ సేంద్రియ వ్యవసాయంద్వారా బొప్పాయి, కూరగాయలు, చిరుధాన్యాలు, తృణధాన్యాలతోపాటు మిరప పంటను సాగుచేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ రాబోయే సంవత్సరంలో మిర్చి పంటను సేంద్రియ పద్ధతులలో పండించేవిధానంపై రైతులకు శిక్షణ ఇస్తానని తెలిపారు. నాణ్యమైన మిరప పంట సాగుకు ఎన్ఐఆర్‌సీఏ తరపున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలకు సహకారం అందిస్తామన్నారు.


మిరప పంటను పరిశీలిస్తున్న ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ శేషుమాదవ్

సుస్థిరసాగుపై అవగాహన

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సుస్థిర సాగుపై అవగాహన వలన మేలైన దిగుబడులు సాధించవచ్చని గ్రామసిరి ఐటీసీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ఎస్ఎస్ శాస్త్రి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పిట్టువారిపాలెంలో మండల వ్యవసాయాధికారిణి సుమతి ఆధ్వర్యంలో రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా సేంద్రియ వ్యవసాయ సహాయక అధికారి టి. మోహన్ మాట్లాడుతూ జీవనో పాదులు పెంచుకోవడం, నవ ధాన్యాల సాగు వంటి అంశాలను పూర్తి స్థాయిలో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


గుంటుపల్లి గ్రామ సరిహద్దును పరిశీలిస్తున్న సర్వే ల్యాండ్ ఏడీ తదితరులు

ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల వివరాలను సేకరించాలి

బల్లికురవ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేయిస్తున్న భూ రీసర్వేలో గ్రామాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులతో పాటు స్థలాల వివరాలను సేకరించాలని జిల్లా సర్వే ల్యాండ్ ఏడీ కనకప్రసాద్ కోరారు. గురువారం గుంటుపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను అధికారులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా గ్రామ సరిహద్దు మ్యాప్‌ను పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే వెంటనే పూర్తి చేసేలా సిబ్బంది పనిచేయాలన్నారు. రైతులు, ప్రజల సమక్షంలో సర్వే చేయాలని, ఎక్కడా వివాదాలు రాకుండా చూడాలన్నారు. ఆనంతరం చెన్నుపల్లి ఈనాం భూముల రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ రవినాయక్, సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● కుడిచేయి మణికట్టు, కాళ్లకు తీవ్ర గాయాలు
● మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలింపు

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఆర్వోబీ వంతెన సమీపంలో స్థానిక హరి ప్రసాద్ నగర్‌కు చెందిన కన్నపరెడ్డి సత్యన్నారాయణ గురువారం రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో అతని కుడిచేయి మణికట్టు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. రైల్వే పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.


తీవ్ర గాయాలతో ఏరియా వైద్యశాలలో సత్యనారాయణ

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : అప్పు చెల్లించే విషయంలో తల్లిపై మనస్తాపం చెందిన కుమార్తె(వివాహిత) ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ఉరి నుంచి తప్పించి చీరాల్లోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామంలోనే మరొకరి వద్ద తల్లికి కొంత అప్పు ఇప్పించగా అవి చెల్లించే క్రమంలో జాప్యం జరిగింది. ఈక్రమంలో అప్పు ఇచ్చిన వారు కుమార్తెను నిలదీశారు. ఈవిషయంపై తల్లీకూతుళ్ల మధ్య వాదన జరిగింది. దీంతో మనస్తాపం చెందిన కుమార్తె గురువారం ఈ ఘటనకు పాల్పడింది.

వరిగడ్డి వామి దగ్ధం

మార్టూరు,ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో ఎస్టీ కాలనీ సమీపంలో చెరువుకట్టపై గురువారం మల్లా వీరయ్యకు చెందిన వరిగడ్డి వామి దగ్ధమయింది. సుమారు రూ. 12 వేల విలువైన ట్రాక్టరు గడ్డి కాలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. గడ్డివామి నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు సమీపంలో ఉన్న చెరువులోనుంచి ట్యాంకరు తో నీటిని తీసుకు వచ్చి మంటలను ఆర్పివేశారు.అయితే అప్పటికే గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది.


మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు

20 కేసుల నమోదు

ఇంకొల్లు,ఫిబ్రవరి 6,(ఆంధ్రజ్యోతి) : స్థానిక జెండా చెట్టు కూడలిలో ఇంకొల్లు ఎస్సై సురేష్ గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సక్రమంగా రికార్డులు లేని లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై 20 కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.1200 జరిమానా విధించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.




పల్లెకు మళ్లీ సంక్రాంతి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి తదితరులు

- సౌత్‌మోపూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- గతనెల 28న 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'
- రూ.కోటితో వివిధ పనులకు రూరల్ ఎమ్మెల్యే హామీ
- రూ.1.22 కోట్లతో వాగ్దానం నెరవేర్చిన కోటంరెడ్డి
- ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ప్రయత్నానికి భారీ స్పందన
- గ్రామస్థుల హర్షాతిరేకాలు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా గా...' అనే వినూత్న కార్యక్రమానికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. గత నెల 27న నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామ సమస్యలను ఆంధ్రజ్యోతి తెరపైకి తీసుకువచ్చి, ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో మరుసటి రోజు (జనవరి 28న) సౌత్‌మోపూరులో అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా... కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలతోపాటు అధికార యంత్రాంగం పాల్గొన్నారు.



ఈ సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలను సభాముఖంగా పాలకులు, అధికారుల దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆంధ్రజ్యోతి ద్వారా బహిర్గతమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అతి త్వరలోనే ఈ నిధులు ఖర్చు చేసేందుకు శంకుస్థాపన కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ గురువారం సౌత్‌మోపూరు లోని గంగమ్మగుడి కూడలి వేదికగా రూ.1.22 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అధికార యంత్రాంగంతో తరలివచ్చి సంక్రాంతి తరువాత సౌత్‌మోపూరుకు మరో పండుగను తీసుకువచ్చారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నిధుల కేటాయింపు ఇలా..

- ప్రధాన రోడ్డును లెవలింగ్ చేసి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.55 లక్షలు
- వాణిశ్రీ ఉన్నత పాఠశాలకు ప్రహరీగోడ నిర్మించేందుకు రూ.20 లక్షలు
- మొగళ్లపాళెంలో సీసీరోడ్లకు రూ. 10 లక్షలు
- కనుజులమిట్ట (ఎస్టీకాలనీ)లో శ్మశానం ప్రహరీగోడ నిర్మాణానికి రూ. 10 లక్షలు
- బీసీకాలనీలో అరుగు నిర్మాణానికి రూ. 2లక్షలు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రోడ్డు నిర్మాణానికి రూ. 5 లక్షలు
- గమళ్లపాళెంలో రోడ్డు నిర్మాణానికి రూ. 4 లక్షలతో పాటు డ్రైన్లు, ఇతర నిర్మాణాలకు మరో రూ. 16 లక్షలు

ఇవన్నీ కలిసి ఎంపీ ల్యాడ్స్ ద్వారా వచ్చిన రూ.1.22 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏకకాలంలో గురువారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పది రోజుల వ్యవధిలో సమస్యలను పరిష్కరించేందుకు శంకుస్థాపనలు చేస్తామని గతంలో ప్రకటించామని, ఈ క్రమంలో గురువారమే పనులకు శంకుస్థాపన చేశామన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించేలా చేసిన ఏబీఎన్, ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పత్రిక వార్తలకే పరిమితం కాకుండా ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన ఏబీఎన్, ఆంధ్రజ్యోతిక ధన్యవాదాలని ఆయన పేర్కొన్నారు.

జైకా పనులు కాక !

- నిరుపయోగం కానున్న నిధులు • రూ.65 కోట్లకు చేసింది రూ.19.68 కోట్ల పనులే!
- వైసీపీ పాలనలో నిర్లక్ష్యం • 40 శాతమూ కాని చెరువుల అభివృద్ధి
- మార్చిలోపు పూర్తి చేయాలని ఆదేశం • గత ఐదేళ్లలో రెండు ప్యాకేజీలే పూర్తి
- 11 వర్కులపై వేలాడుతున్న కత్తి • బిల్లుల భయంతో పనులు చేయని కాంట్రాక్టర్లు

> "చెరువు కట్టలను పటిష్ట పరచడం, తూములను ఆధునికీకరించడం, కాలువలను బాగు చేయడం జైకా వర్కుల ప్రధాన లక్ష్యం. మొత్తం 13 ప్యాకేజీలుగా జిల్లాలోని చెరువులను అభివృద్ధి చేయాలని టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చాలాచోట్ల పనులు సవ్యంగా సాగలేదు."



ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణలో భాగంగా కట్టకు జరుగుతున్న రివిట్‌మెంట్ పనులు

నెల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు నేడు శాపాలుగా జిల్లా ప్రజలను వెంటాడుతున్నాయి. చెరువుల అభివృద్ధికి జైకా నిధులిచ్చినా నాటి పాలకులు ఉపయోగించుకోలేకపోయారు. అభివృద్ధి చేయాల్సిన చెరువులను గాలికొదిలేశారు. ఇప్పుడు ఆ వర్కులన్నింటినీ మార్చిలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఆ తర్వాత చేసే పనులకు నిధులు సమకూరవు. ఈ నేపథ్యంలో జిల్లాలో కీలకమైన 11 వర్కులు అసంపూర్తిగానే క్లోజ్ అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒక్కో వర్కు కింది రెండు, మూడు చెరువులను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఎంత వేగంగా పనులు చేసినా మార్చిలోపు అసంపూర్తి పనులు పూర్తి చేయడం సాధ్యపడదని ఇరిగేషన్ ఇంజనీర్లు చెబుతున్నారు. గడువు ముగిసేలోపు వీలైనన్ని ఎక్కువ పనులు చేయించేందుకు వారు యత్నిస్తున్నారు.

13 ప్యాకేజీలు.. పూర్తయింది రెండే!

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 2018-19 నుంచి 2023-24 సంవత్సరాల మధ్య ప్రధానమైన ఆయకట్టు చెరువులను అభివృద్ధి చేసేందుకు జైకా సంస్థ ముందుకొచ్చింది. ఇందుకుగాను సుమారు రూ.65 కోట్లు సమకూర్చేలా ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. చెరువు కట్టలను పటిష్ట పరచడం, తూములను ఆధునికీకరించడం, కాలువలను బాగు చేయడం జైకా వర్కుల ప్రధాన లక్ష్యం. మొత్తం 13 ప్యాకేజీలుగా చెరువులను అభివృద్ధి చేయాలని టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. ప్యాకేజీ 1, 7, 9, 10, 11 కింద ఉదయగిరి నియోజకవర్గంలో, ప్యాకేజీ 2, 3, 6 కింద గూడూరు నియోజక వర్గంలో, ప్యాకేజీ 4 కింద వెంకటగిరి నియోజకవర్గంలో, ప్యాకేజీ 5, 8, 13 కింద సర్వేపల్లి నియోజకవర్గంలో, ప్యాకేజీ 12 కింద కావలి నియోజకవర్గంలో చెరువులు, కాలువలను బాగు చేయాల్సి ఉంది. ఈ మొత్తం 13 ప్యాకేజీల్లో ఆరు ప్యాకేజీ వర్కులను 2018-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో టెండర్లు పిలిచి అప్పగించారు. మిగిలిన వర్కులకు వైసీపీ ప్రభుత్వంలో 2022-24 మధ్య కాలంలో టెండర్లు పిలిచారు. అయితే చాలా పనులు సంగం కూడా పూర్తి కాలేదు. కేవలం రెండు ప్యాకేజీలు మాత్రమే పూర్తయ్యాయి. కొన్ని 15, 20 శాతం మాత్రమే పనులు చేసినవి కూడా ఉన్నాయి. మొత్తం ఆరు ప్యాకేజీల్లోని వర్కులు 40 శాతంలోపే జరిగాయి. అన్ని వర్కుల అగ్రిమెంట్ విలువ రూ.50.76 కోట్లు ఉంటే ఇప్పటి వరకూ రూ.19.68 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయి. అంటే సరాసరి 40 శాతం కూడా జైకా పనులు పూర్తి చేయలేదు.

కక్షసాధింపు ధోరణితో ఆలస్యం

వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అంతకముందు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో మంజూరైన పనులపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరించింది. దీంతో జైకా సంస్థ చేపట్టిన పనులు ముందుకు సాగలేదు. అలానే వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన పనులు కూడా ఆశించినంతగా ముందుకు కదల్లేదు. ఇందుకు ప్రధాన కారణం


మిగతా 6వ పేజీలో..

నారాయణకు 14.. ఆనంకు 16!

- ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు • గౌరవప్రద స్థానాలపై ప్రజల హర్షం

నెల్లూరు, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): పరిపాలనలో జవాబుదారీతనం, బాధ్యతలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చే నాయకుడిగా గుర్తింపు పొందిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రజల్లో ఆవిశ్వాసం చెక్కుచెదరనివ్వకుండా పాలన సాగించే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఆరునెలల్లో తనతోసహా మంత్రుల పనితీరుకు ర్యాంకులు ప్రకటించారు. ఈ ర్యాంకుల ద్వారా పనితీరును మరింత మెరుగుపరుచుకునే దిశగా మంత్రులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పాలనా రంగంలో చంద్రబాబుది ప్రత్యేక శైలి. ఆయన్ను రాజకీయ నాయకుడిగా కన్నా మంచి పరిపాలనాధ్యక్షుడిగానే ప్రజలు ఎక్కువగా గుర్తిస్తారు. రాష్ట్రం క్లిష్టపరిస్థితులు ఎదుర్కొన్న అన్ని సందర్భాల్లోనూ ప్రజలు చంద్రబాబునే అధికారపీఠంపై కూర్చోబెట్టడం ఇందుకు నిదర్శనం. తన పాలనాదక్షతపై ప్రజలకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా చంద్రబాబు ఎప్పటికప్పుడు పాలనలో కొత్త ఒరవడిని, సాంప్రదాయాలను ప్రవేశపెడుతూనే వస్తున్నారు. జన్మభూమి, ప్రజల వద్దకు పాలన, శ్రమదానం లాంటి వినూత్న పథకాలతో మంచి పరిపాలనాధ్యక్షుడిగా ప్రజల్లో ముద్రవేసుకున్నారు. ఇప్పుడు అదే ఒరవడితో తనతో సహా క్యాబినెట్ మంత్రుల అందరి పనితీరును ప్రతి ఆరు నెలలకు ఒకసారి లెక్కకట్టి ప్రజల ముందు పెడుతున్నారు. ఈ ర్యాంకుల ద్వారా మంత్రుల్లో పోటీతత్వం పెంచి పనితీరును మరింత మెరుగుపరచాలని, ప్రజలకు ప్రభుత్వం పట్ల మరింత విశ్వసనీయత పెంచుకోవాలనే ప్రయత్నంలో భాగంగా ఈ ఐదేళ్ల పాలనకు సంబంధించి మొదటి ఆరు నెలల కాలంలో ఫైళ్ల క్లియరెన్స్‌కు సంబంధించి మంత్రులకు ర్యాంకులు ప్రకటించారు. ఈ ర్యాంకుల వరుసలో తాను ఆరవ స్థానంలో ఉన్నానని చంద్రబాబు స్వయంగా ప్రకటించుకున్నారు. ఇక జిల్లాకు చెందిన మంత్రులు పొంగూరు నారాయణ,





ఆనం రామనారాయణరెడ్డిలు ర్యాంకుల వరసలో మధ్యలో ఉన్నారు. ఫైళ్ల క్లియరెన్స్ విభాగంలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకు 14వ ర్యాంకు వచ్చింది. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి 16వ ర్యాంకు వచ్చింది.

గత జూలై నుంచి డిసెంబరు వరకు మంత్రిత్వ శాఖల వారీగా ఫైళ్ల క్లియరెన్స్‌ను ఆధారంగా చేసుకొని ఈ ర్యాంకులను ప్రకటించారు. అయితే ఈ మొదటి ఆరు నెలల కాలంలో ప్రభుత్వ ఏర్పాటు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా చాలా రోజులు వృథా అయ్యాయని, ఆ కారణంగా ఫైళ్ల క్లియరెన్స్‌శాతం తక్కువగా ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. జనవరి నుంచి ఫైళ్ల క్లియరెన్స్ వేగం పెరిగిందని, 2025 జూన్ నాటికి ఫైళ్ల క్లియరెన్స్ మరింత వేగం పెరుగుతుందని పలువురు మంత్రులు సీఎం దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. తొలివిడత ర్యాంకులు జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు గౌరవప్రదమైన స్థానంలో ఉండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారుల మెడకు ఉచ్చు

- 'ఆంధ్రజ్యోతి' కథనాలపై నివేదిక కోరిన మంత్రి • బాధ్యుల్లో వణుకు

నెల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విధానాలను పక్కన పెట్టి కాంట్రాక్టర్లకు అక్రమ మార్గంలో మేలు చేసేలా వ్యవహరిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారుల మెడకు ఉచ్చు బిగుసుకుంటోంది. జిల్లా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.. 'ఆంధ్రజ్యోతి' కథనాలపై నివేదిక కోరారు. 25 శాతంలోపు పనులు జరిగిన వర్కులను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన తరుణంలో జిల్లా అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదిక పంపారు. అయితే అంతకముందే తెప్పించుకున్న నివేదిక ప్రకారం జిల్లాలోని సీఆర్ఐఎఫ్ రోడ్లు 25 శాతం కన్నా తక్కువ జరిగినట్లు నిర్ధారించి వాటిని ప్రభుత్వం రద్దు చేసింది. అయినా నెల్లూరు-మైపాడు రోడ్డు పనులు హడావుడిగా మొదలుపెట్టి చేశారు. బాగున్న రోడ్డును గందరగోళం చేశారు. దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు కూడా కాంట్రాక్టర్‌కు వంత పాడుతూ ప్రభుత్వ ఆదేశాలను పక్కకు నెట్టేశారు. ఇలా ప్రభుత్వ నిర్ణయాలను ధిక్కరిస్తున్నారని గత నవంబరులో 'ఛ.. నిజంగా..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. 25 శాతంలోపు పనులు జరగని వాటిని కూడా జరిగినట్లుగా చూపించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆ కథనంలో పేర్కొంది. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ మంత్రి కార్యాలయం.. అర్జెంటుగా ఐదు రోజుల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈను ఆదేశించింది. అలానే ఆత్మకూరు-సోమశిల రోడ్డు పనులు అత్యంత నాసిరకంగా చేయడంతో సదరు కాంట్రాక్టర్ నుంచిచ రికవరీ చేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆ నివేదికను చాలా కాలం పాటు తొక్కిపెట్టారు. ఈ క్రమంలో గతేడాది నవంబరు 12వ తేదీన 'ఫైలు తొక్కిపెట్టి.. రూ. కోట్లు కొల్లగొట్టి..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ప్రజాధనాన్ని లూటీ చేసిన కాంట్రాక్టర్‌ను కాపాడేందుకు అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తూ క్వాలిటీ కంట్రోల్ సీఈ నివేదికను తొక్కిపెడుతున్నారన్న విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. అయినా ఆ కాంట్రాక్టర్ నుంచి ఇంత వరకూ రోడ్డు నాసిరకంగా వేసినందుకు రికవరీ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కూడా ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆర్‌అండ్‌బీ మంత్రి కార్యాలయం నుంచి ఎస్‌ఈకు లేఖ రాశారు. ఈ రెండు అంశాలను టాప్ ప్రియారిటీగా భావించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో బాధ్యులైన అధికారుల్లో వణుకు మొదలైంది.

కుంభమేళాకు పోదాం..!

- ఆర్టీసీ బస్సులకు భలే ఆదరణ • టికెట్ రూ.9వేలు కావడంతో భక్తుల ఆసక్తి
- రేపు కదిలే బస్సు దాదాపు ఫుల్ • మరికొన్ని సర్వీసులు నడిపే యోచన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు వెళ్లాలనుకునే వారికోసం ఆర్టీసీ వేసిన ప్రత్యేక బస్సుకు విశేష స్పందన లభిస్తోంది. జిల్లాలోని భక్తుల సౌకర్యార్థం నెల్లూరు-1వ డిపో అధికారులు శనివారం ఒక బస్సు నడపాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ముందస్తు రిజర్వేషన్ ప్రకటించిన ఐదు రోజుల్లోనే ఒక బస్సు దాదాపు ఫుల్ కావడంతో మరో బస్సును కూడా నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

● చార్జీలు అందుబాటులో ఉండటం వల్లే..

నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కుంభమేళాకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. హైదారాబాద్, నాగపూర్ మీదుగా 9వ తేదీ సాయంత్రానికి కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందన్నారు. 10వ తేదీ అంతా ప్రయాగ్‌రాజ్‌లోనే ఉండి 11వ తేదీ రాత్రి అయోధ్యకు బస్సు బయలు దేరుతుంది. 12వ తేదీ ఉదయం అయోధ్య చేరుకుని బాల రాముని దర్శించుకున్న తర్వాత అదేరోజు రాత్రి కాశీకి పయనమవుతుంది. 13వ తేదీ కాశీ చేరుకుని అక్కడ బస చేస్తారు. 14వ తేదీ వారణాసి నుంచి బయలుదేరి 15వ తేదీ రాత్రికి నెల్లూరుకు బస్సు చేరుకుంటుంది. ఎనిమిది రోజుల ఈ యాత్రకు ఒకరికి టికెట్టు రూ.9 వేలుగా నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఇది కేవలం బస్ చార్జీ మాత్రమే అని, భోజనం, వసతి సౌకర్యాలను ప్రయాణికులు ఎవరికి వారే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. అయినప్పటికీ ప్రస్తుత రవాణా ఖర్చులతో పోలిస్తే ఆర్టీసీ చార్జీలు తక్కువగా ఉన్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. కాగా, గత నెలలో కుంభమేళాకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నెల్లూరు నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అందులో ఒక టికెట్టు ధర రూ.22 వేలకుపైగా ఉండటంతో ప్రజల నుంచి పెద్దగా ఆదరణ లభించలేదని సమాచారం.

● మరికొన్ని బస్సులు నడిపే దిశగా...

ఆర్టీసీ నెల్లూరు రీజియన్ నుంచి కుంభమేళాకు పలు డిపోల నుంచి మరికొన్ని బస్సులు నడిపేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీ వరకు కుంభమేళా జరుగుతుండటం, ప్రజల నుంచి స్పందన బాగుండటంతో ఈ నెల 10 తర్వాత అధిక సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేసే అవకాశం ఉందని సమాచారం.



విద్యార్థులందరికీ డీవార్మింగ్ తప్పనిసరి

- వారి మానసిక, శారీరక ఆరోగ్యానికి అవి ఎంతో మేలు
- పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్ ఆనంద్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యార్థులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలని కలెక్టర్ ఓ ఆనంద్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 19 ఏళ్లలోపు వయసు ఉన్న ప్రతి విద్యార్థికి ఈ మాత్రలు అందించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులతోపాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులకు నులిపురుగుల మందులపై అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవటం వల్ల పిల్లల్లో రక్తహీనత తగ్గి, ఆకలి పెరిగి, పోషకాలు మెరుగుపడతాయన్నారు. దీంతో చదువులపై ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. శారీరక, మానసిక అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందన్నారు. అనంతరం 'అందరూ భాగస్వాములై పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం' అనే నినాదంతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, డీఈవో బాలాజీరావు, సమగ్ర శిక్ష ఏపీవో వెంకటసుబ్బయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నగరం ఆత్మకూరు బస్టాండు వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జి పిల్లర్లకు వేసిన మురల్ ఆర్ట్ కళకళలాడుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో రకరకాల వృత్తులు, కళాకారులు, ప్రముఖుల చిత్రాలను ఇక్కడ అందంగా ప్రదర్శించారు. అయితే నిర్వహణ లోపంతో ఆ బొమ్మలు దుమ్ముకొట్టుకు పోయాయని ఇటీవల ఆంధ్రజ్యోతి చిత్రమాలి కను ప్రచురించింది. దీనికి స్పందించిన యంత్రాంగం మురల్‌ఆర్ట్‌కు కొత్తగా పెయింటింగ్ చేయిస్తోంది. దీంతో ఆ చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

లింగసముద్రం పరిసర గ్రామాల్లో నాలుగైదు రోజుల నుంచి విచిత్ర వాతావరణం పరిస్థితులు నెలకొన్నాయి. వేకువ జామున పొగ మంచు పల్లెలను కమ్మేస్తోంది. ఆ తర్వాత ఎండ మండిపోతోంది. ఇక, రాత్రయితే చలి వణికిస్తోంది. గురువారం వేకువజామున నాలుగు గంటల నుండే దట్టంగా మంచు కురిసింది. తెల్లవారిన తర్వాత కూడా రోడ్లపై 10 అడుగుల దూరంలో ఏముందో కూడా కనిపించనంతగా మంచు తెరలు కప్పేశాయి. ఈ చల్లదనాన్ని ప్రజలు ఆస్వాదిస్తుండగానే భానుడు భగభగమనడంతో అప్పుడే ఎండాకాలం వచ్చేసిందంటూ ఉసూరుమన్నారు.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి)



వెట్టిచాకిరీ నిర్మూలన
చట్టాలపై అవగాహన అవసరం

- వర్క్‌షాప్‌లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వెట్టిచాకిరీ నిర్మూలన చట్టాలపై అధికారులకు అవగాహన అవసరమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో వెట్టిచాకిరీ నిర్మూలన చట్టంపై వర్క్‌షాప్ జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వెట్టిచా కిరీ నిర్మూలన చట్టాలపై అవగాహన పెం చుకోవాలని సూచించారు. కనీస వేతనం చెల్లించకపోవడమే కాకుండా శారీరక శ్రమను దోచుకోవడం, ఆర్థిక స్వేచ్ఛను హరించడం కూడా వెట్టిచాకిరీ కిందకు వస్తాయని తెలిపారు. వెట్టిచాకిరి వ్యవస్థ లోని కార్మికులను గుర్తించడంలో అధికారు లు ముఖ్య పాత్ర పోషించాలన్నారు ఇందు కు అవసరమైన శిక్షణ జిల్లా స్థాయిలో పొంది తదనంతరం డివిజనల్, మండల స్థాయిలోని అధికారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వెట్టిచాకిరీ కార్మికులను గుర్తించే విధానాన్ని ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి గంటా ప్రియాంక పీపీటీ ద్వారా వివరించారు. ఈ వర్క్‌షాపులో అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధి షేక్ బషీర్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో సుజాత, డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు నాగరాజకుమారి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన అధికారులు

ఆ.. ఆర్‌ఐలు ఎవరు?

- రహస్యంగా ఆరా తీస్తున్న కమిషనర్, ఏసీబీ?

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఆర్‌ఐల్లో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్న వారు ఎవరు....? అవినీతి సొమ్ము వసూళ్లకు ఏజెంట్లను పెట్టుకుని దందా చేస్తున్న వారెవరు...? అని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ రహస్యంగా ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆర్‌ఐల అవినీతి బాగోతంపై ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనికి కమిషనర్ స్పందిస్తూ గోప్యంగా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఆర్‌ఐల లాగిన్లలో ఫైళ్లు ఎంత కాలంగా పెండింగ్ పెట్టారు...? ఎందుకు పెట్టారు....? ఉన్నత స్థాయికి ఎందుకు పంపలేదు...? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారని, ప్రైవేట్ వ్యక్తులతో రెవెన్యూ పనులు చేయిస్తున్న ఆర్‌ఐలు ఎవరని కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదులపైనా విచారణకు ఆదేశించారు. కాగా, ఆర్‌ఐల అవినీతి పర్వంపై అవినీతి నిరోధక శాఖ కూడా దృష్టిపెట్టిందని తెలిసింది.

జైకా.. పనులు కాక !


(5వ పేజీ తరువాయి)

పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడమే. సకాలంలో బిల్లులు ఇవ్వని కారణంగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్లకు రూ.14.51 కోట్లు బిల్లులు చెల్లించారు. ఆ బిల్లులు కూడా ఇటీవల కాలంలోనే ఎక్కువగా చెల్లించడం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జైకా వర్కుల్లో పురోగతి కనిపించింది. అయితే జైకా ఇచ్చిన గడువు ఈ మార్చితో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా మార్చిలోపు జైకా వర్కులను పూర్తి చేయాలని ఆదేశించింది. దీనిని ప్రధానాంశంగా తీసుకున్న ఇరిగేషన్ ఎస్ఈ దేశనాయక్ బుధవారం అందరు ఈఈలు, డీఈఈలతో సమావేశం నిర్వహించి జైకా పనులపై సమీక్షించారు. రెండు నెలల్లో 60 శాతం పనులు పూర్తి చేయడం సాధ్యపడదు కాబట్టి వీలైనంత ఎక్కువ మేర పనులు పూర్తి చేసేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

పనుల్లో వేగం పెంచుతున్నాం

జైకా వర్కులు మార్చిలోపు క్లోజ్ చేయాలని ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో పనులు వేగంగా పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాము. కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచుతున్నాం.

- ఇరిగేషన్ ఎస్ఈ దేశనాయక్



నెల్లూరు నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయం

తల్లిలా ఆలన... తండ్రిలా పాలన చూస్తూ అనాథ పిల్లలకు అక్కున చేర్చుకుని ఆదరిస్తోంది నగరంలోని జనహిత-వాత్సల్య అనాథ శరణాలయం. ఈ సంస్థను 36 సంవత్సరాలనాడు వేదాంతం సంగమేశ్వరశాస్త్రి, పొన్నలూరు సీతారామిరెడ్డి, సామంతు గోపాలరెడ్డి తదితరులు బీవీ నగర్ ప్రాంతంలో ప్రారంభించారు. నాడు చిన్న సంస్థగా ప్రారంభమై నేడు వేలాదిమందికి ఆశ్రయం కల్పించి, వారి ఉన్నతికి బాటలు వేస్తోంది. ప్రతి నెలా రూ.14 లక్షల వరకు ఈ సంస్థ నిర్వహణకు ఖర్చవుతున్నా వెనుకంజ వేయకుండా ఎందరో దాతల సహకారంతో ముందుకు సాగుతోంది.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

తల్లిలా ఆలన...
తండ్రిలా పాలన

అనాథలను అక్కున చేర్చుకున్న వాత్సల్య • విద్యాబుద్ధులు నేర్పి.. ప్రయోజకులను చేసి • ఎందరో దాతల సహకారంతో విస్తృత సేవలు

ఈ వాత్సల్యను ప్రారంభించిన వేదాంతం సంఘమేశ్వర శాస్త్రిది గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని కుంబవరం అగ్రహారం. 1942లో జన్మించిన ఆయన ఆర్ఎస్ఎస్ కార్యదర్శిగా పనిచేస్తూ నెల్లూరు విభాగ్ ప్రచారక్‌గా వచ్చారు. ఆ సమయంలో బిచ్చమెత్తుకుంటున్న పిల్లలను చూసి చలించిపోయారు. వారికి అండగా నిలవాలన్న తలంపుతో 1992, జనవరి 26న వాత్సల్య సేవా సంస్థను ప్రారంభించారు. అనాథల కోసం ఆశ్రమ నిర్వహణకు జనహిత ట్రస్టు నెలకొల్పి సన్యాసం స్వీకరించి, వాత్సల్యానంద భారతిగా మారారు. అయితే, 2012లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తుదిశ్వాస విడిచారు. కానీ వాత్సల్య రూపంలో ఆయన ఆశయం సజీవంగా సాగుతోంది. అనాథల పట్ల ఆయన చూపిన ప్రేమను జనహిత-వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉన్న జీవీ సాంబశివరావు కొనసాగిస్తున్నారు.


సహచరి పెళ్లిలో వాత్సల్య విద్యార్థినులు

నిరాదరణ బాలికలకు అండగా..

నిరాధార బాలబాలికల కోసం వాత్సల్య పేరిట వసతి గృహం, వృద్ధుల కోసం వానప్రస్థ ఆశ్రమం నడుస్తోంది. ఆధ్యాత్మిక భక్తి భావాలు ఉట్టి పడేలా ప్రసన్నాంజనేయస్వామి ఆలయాన్ని వాత్సల్యలో నిర్మించారు. భారతీయ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను స్థాపించి 1 నుంచి 10వ తరగతి వరకు బోధిస్తున్నారు. అలాగే పిల్లల కోసం వేద-సంస్కృత పాఠశాలను కూడా ఏర్పాటు చేశారు. వాత్సల్య శరణాలయంలో ఉన్న విద్యార్థులతోపాటు పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలకూ ఉచిత విద్యను అందిస్తున్నారు. వాత్సల్యలో ప్రస్తుతం 85 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. వీరికి చదువుతోపాటు వేదం, కీబోర్డు, డాన్సు, కోలాటం, భగవద్గీత, కంప్యూటర్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. అంతేగాక ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు వాత్సల్య నిర్వాహకులు ప్రోత్సహిస్తూ చదివిస్తున్నారు.


కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

పెళ్లిపెద్దలుగా మారి..

వాత్సల్యలో ఆశ్రయం పొంది చదువుకున్న 8 మంది విద్యార్థినులకు వివాహాలు జరిపించింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో వాత్సల్య విద్యార్థులు పాల్గొని డాన్సు, కోలాటం, భగవద్గీత, వేదం తదితర పోటీలలో విజేతలుగా నిలిచి ఎన్నో బహుమతులు సాధించారు. క్రికెట్, కబడ్డీ వంటి క్రీడల్లోనూ ఇక్కడున్న పిల్లలు రాణిస్తున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు రకరకాల మోడల్స్ ప్రదర్శించి అవార్డులు పొందారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఇంటర్ ఆపై చదువులు చదువుకున్న విద్యార్థినులకు వాత్సల్యలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. అదేవిధంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీలోనూ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. అమెరికాకు చెందిన డాక్టర్ ప్రేమ్ సాగర్‌రెడ్డి హెల్త్‌కేర్ సహకారంతో ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణను ఏర్పాటు చేశారు.

జీవితంలో స్థిరపడేలా తీర్చిదిద్దుతున్నాం



వాత్సల్యకు ఇతోధికంగా సహకారం అందిస్తూ, ముందుకు నడపడానికి ప్రోత్సహిస్తున్న దాతలందరికీ ధన్యవాదాలు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులను కన్న బిడ్డల్లా చూసుకుంటున్నాం. వారికి సంస్కార వంతమైన విద్యాబుద్ధులు నేర్పించి జీవితంలో స్థిరపడేలా చేస్తున్నాం.

- జీవీ సాంబశివరావు, జనహిత-వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి

ఇంటర్ ప్రాక్టికల్స్
పక్కాగా నిర్వహించాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : ఆర్‌ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలను జిల్లాలో పక్కాగా నిర్వహించాలని, ఎక్కడైనా అవకతవకలు జరిగినా, సిబ్బంది నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని ఆర్‌ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు హెచ్చరించారు. నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాలలో గురువారం ఫిజిక్స్ బోటనీ అధ్యాపకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాలన్నింటిలో సదుపాయాలను, సీసీ కెమెరాలను ఎగ్జామినర్లు పరిశీలించి పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. పొరపాట్లు, ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, సబ్జెక్ట్ నిపుణులు గౌస్‌బాషా, ప్రభాకర్, ఆర్‌ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ రాజారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు

ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 37 మంది గైర్హాజరు

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు రెండవరోజు గురువారం 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 283 మందికి 263 మంది హాజరుకాగా 20 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 277 మందికి 260 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరయ్యారు.

టీకాల అమలుపై సర్వే

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల అమలుపై ఈ నెలతోపాటు సెప్టెంబరు నెలలో సర్వే జరుగుతుం దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. టీకాలను పక్కాగా అమలు చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, పర్యవేక్షకులకు వ్యాధినిరోధక టీకాలపై శిక్షణ ఇచ్చారు. గర్భిణులు, రెండు ఏళ్లలోపు పిల్లలు, ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి వారికి ప్రణాళిక ప్రకారం వ్యాక్సిన్ వేయాలని సూచించారు. గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం సర్వే నిర్వహణకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సర్వేలో వ్యాధినిరోధక టీకాల పనితీరును పరిశీలించాలని, వ్యాక్సిన్ వేయని పిల్లలు ఉంటే వారికి టీకాలు వేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ నెల 10వ తేదీలోపు సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వేలో గుర్తించిన చిన్నారుల వివరాలు ఈ నెల 28కల్లా ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో మైక్రో యాక్షన్ ప్లాన్ మార్చి 5 నాటికి సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, మాస్టర్ ట్రైనర్ డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, ప్రపంచ ఆరోగ్యసంస్థ సర్వైలెన్స్ అధికారి డాక్టర్ మోనికస్టిఫీ, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

సోమశిలలో 65.678 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 1,309 క్యూసెక్కులు ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 65.678 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

స్ఫూర్తినిస్తున్న 'సక్షమ్' సేవలు

- రక్త, నేత్ర, అవయవదానానికి నిరంతర కృషి
- 20మందితో ప్రారంభమై నేడు 2వేల మందితో...
- ప్రతి ఏటా 10రక్తదాన శిబిరాల ఏర్పాటు
- ఇప్పటివరకు 93కి చేరిన నేత్రదాతలు

కందుకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రక్తదానం, నేత్రదానం, అవయవ దానానికి కందుకూరులోని సక్షమ్ స్వచ్ఛంద సేవా సంస్థ విశేష కృషి చేస్తోంది. అలాగే వీటిపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా చర్యలు తీసుకుంటోంది. మొదట్లో అతికష్టంగా ఈ కార్యక్రమాలను నిర్వహించిన సంక్షమ్ కార్యకర్తలు, నేడు ప్రజల్లో వచ్చిన చైతన్యంతో సులభంగా చేయగలుగుతున్నారు. 38 ఏళ్ల కిందట సేవాభారతి పేరుతో రక్తదాతలను ప్రోత్సహించడం లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టిన చెన్నా రామాంజనేయులు నేడు సక్షమ్ వేదికగా వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదట యువకుల సాయంతో 20మంది రక్తదాతలను తయారు చేయగలిగిన ఆయన, నేడు వేలాదిమంది రక్తదాతలను సిద్ధం చేశారు.

రెండోదశలో నేత్రదానం

రక్తదానం విజయవంతం కావటంతో నేత్రదానంపై దృష్టి పెట్టారు. నేత్రదాతలను ప్రోత్సహించటం ప్రారంభించారు. 2007లో అలవల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కందుకూరులో మొదటి నేత్రదాతగా నిలిచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 93మంది కందుకూరులో నేత్రదానం చేశారు. గత కొన్నేళ్లుగా నేత్రదానంలోనూ ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించడంలో చెన్నా రామాంజనేయులు సఫలీకృతుడయ్యాడు.

మూడోదశలో అవయదానం

నేత్రదాతలు పెరగటంతో ఇప్పుడు సక్షమ్ అవయవదానం, మరణానంతరం దేహదానంపై దృష్టి కేంద్రీకరించారు. ముఖ్యంగా ఎవరైనా బ్రెయిన్‌డెడ్, కోమా కి వెళ్లిన పరిస్థితుల్లోనూ మరణం అంచున ఉన్న వారి కుటుంబసభ్యులను అవయవదానానికి ఒప్పించగలిగితే ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టవచ్చన్న లక్ష్యంతో సక్షమ్ కృషిచేస్తోంది. ఇప్పటికే సక్షమ్ ద్వారా వందమందికి పైగా అవయవదానానికి తమ అంగీకారం తెలుపుతూ సమ్మతి పత్రాలపై సంతకాలు చేయించారు.


తలసీమియా బాధిత చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం

దివ్యాంగుల సేవలోనూ..

అన్నిదానాలను విజయవంతంగా పూర్తి చేసిన ఈ సంస్థ నేడు దివ్యాంగులకు సేవచేయడంపై దృష్టి పెట్టింది. దివ్యాంగులను గుర్తించి వారికి ఉన్న లోపాన్ని అధిగమించి మెరుగైన జీవనం సాగించేందుకు అవసరమైన పరికరాలను సమకూరుస్తోంది. కేంద్రం అందజేస్తున్న వివిధ రకాల తోడ్పాటు కార్యక్రమాలపై వారికి అవగాహన కల్పించి, అవసరమైన పరికరాలు తెప్పిస్తోంది. అందులో భాగంగా పలువురికి వీల్‌ఛైర్లు, ట్రై సైకిళ్లు, మోటారు ట్రైసైకిళ్లు, వికికిడి యంత్రాలు, చేతికర్రలు ఉచితంగా పంపిణీ చేస్తున్నది.

ఏటా 10రక్తదాన శిబిరాలు

సక్షమ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీల ద్వారా కందుకూరులో ప్రతి ఏటా సరాసరి 10కి తక్కువ కాకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నది. గాంధీ, అంబేద్కర్, ఎన్టీఆర్‌ల జయంతి, ఇతర ముఖ్యమైన పర్వదినాలతో పాటు పోలీసు అమరవీరుల దినోత్సవం, జాతీయ రక్తదాతల దినోత్సవం లాంటి సందర్భాల్లో విధిగా రక్తదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నది. బ్లడ్‌బ్యాంకుల్లో రక్తనిల్వలు తగ్గిన సమయాల్లో కూడా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నది.

సొంత ఖర్చులతో వెళ్లి సాయం

కందుకూరుతోపాటు నెల్లూరు, ఒంగోలు, గుంటూరు తదితర నగరాల్లో ఎవరికైనా అత్యవసరంగా రక్తం అవసరమన్న సమాచారం తెలిసినా.. అరుదైన బ్లడ్‌గ్రూపుల రక్తం అవసరమని వచ్చినా సొంత ఖర్చులతో వెళ్లి రక్తం ఇచ్చి ప్రాణం కాపాడుతున్నారు. ఒకప్పుడు కేవలం 20 మంది రక్తదాతలతో ప్రారంభమై నేడు 2వేల మందికి పైగా పాల్గొంటున్నారంటే అతిశయోక్తి కాదు.


దివ్యాంగురాలికి మోటారు ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు (ఫైల్)

తగినన్ని ఐ బ్యాంకులు లేక సమస్య..



నేత్రదానంపై ప్రజల్లో ఎంతో చైతన్యం వచ్చి.. దాతలు ఉన్నా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం. నేత్రదాతలు పెరిగిన మేరకు నేత్రసేకరణ చేసే ఆసుపత్రి పెరగకపోవటం సమస్యగా మారింది. ఓ వ్యక్తి చనిపోయాక 6 నుంచి 8గంటలలోగా కార్నియా సేకరించాలి. అనంతరం 72గంటలలోపు ఆపరేషన్ చేసి కార్నియా అంధుడికి అమరిస్తేనే అది ఉపయోగం. కందుకూరు ఏరియా ఆసుపత్రి, ఒంగోలు రిమ్స్‌లో ఐ బ్యాంకు ఏర్పాటు చేసి ఓ వాహనాన్ని, కార్నియా సేకరించే టెక్నీషియన్‌ను ఏర్పాటు చేస్తే ప్రతిఏటా కనీసం వందమంది నేత్రదాతలను సిద్ధం చేయగలం. ప్రస్తుతం పట్టణంలో మాత్రమే నేత్రాలు సేకరిస్తున్నాం. తగిన ప్రోత్సాహం ఉంటే గ్రామాల్లోనూ ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తాం.

- చెన్నా రామాంజనేయులు, సక్షమ్ కార్యదర్శి

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొండాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):ఆర్‌డీఎస్‌ఎస్ పథకం కింద మండలంలో నూతనంగా చేపట్టిన పనులకు విద్యుత్ సరఫరా పనుల కోసం శుక్రవారం కొండాపురం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గురువారం ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ దినేష్ తెలిపారు. అలాగే కొమ్మి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8-30గంటల నుంచి 10-30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బీసీ వెల్ఫేర్ అధికారులకు సత్కారం



సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

కావలి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ వెల్ఫేర్ అధికారులుగా పదోన్నతులు పొందిన సాల్మన్‌రాజ్, నరసింహులును గురువారం వెంగళరావునగర్‌లోని సంయుక్త సంస్థ కార్యాలయంలో సురేంద్ర అధ్యక్షతన స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవికుమార్, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, ప్రసాదరావు, అజిత్‌బాబు పాల్గొన్నారు.

బీసీలకు 34శాతంపై హర్షం

ఉలవపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై నెల్లూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి అమ్మనబ్రోలు రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర బీసీల తరుఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీసీలను ఓటు బ్యాంక్‌లా చూడకుండా వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక లబ్ధి చేకూరేలా రిజర్వేన్ అమలు చేస్తామని యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నిలపెట్టుకున్నారని గుర్తుచేశారు.

వైసీపీ అభివృద్ధికి కృషి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తొడుగుపల్లి మానం మస్తానయ్య వైసీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ పార్టీ అబివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు మేకపాటి అభినవ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ సీనియర్ సహాయకులు అలేఖ్యతో కలిసి పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. అర్హులు 7వ తేదీలోపు ఓబీఎం ఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయ న కోరారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

సంగం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక కొండ రహదారి కూడలిలో సీఐ వేమారెడ్డి ట్రాక్టర్ డ్రైవర్లకు గురువారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రాత్రి వేళ్లలో ప్రమాదాలు జరగకుండా ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎస్‌ఐ రాజేష్ ఉన్నారు.

పీఫోర్ సర్వే పరిశీలన

సీతారామపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో గురువారం పీఫోర్ సర్వేను ఏపి ఎస్‌బిపిఎస్ యంగ్ ప్రొఫెసర్ వెంకటేష్ పరిశీలించారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద నాలుగు ప్రాంతాలను పిఫోర్ సర్వేకు ఎంపిక చేయడం జరిగిందని వాటిలో సీతారామపురం ఒకటన్నారు. బిట్ -1,బిట్ -2 సచివాలయ పరిధిలోని 2195 కుటుంబాలపై చేపడుతున్న సర్వేలో ప్రజల ఎకనామిక్ గ్రోత్ ఎలా ఉంది అని ఆరా తీశారు. ఎన్యుమెటర్ లు సర్వేను పక్కడ్బందీగా నిర్వహించి వివరాలను ఆన్లైన్ చేయాలని తెలిపారు. సర్వేను ఈ నెల 9వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అత్మకూరు డివైఎస్‌ఓ సురేష్, ఎఎస్‌ఓ కుమార్, ఈవోపిఆర్డీ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

వీరు..గిరి'జనం' కాదా?

- కావలి గిరిజన కాలనీల్లో మౌలిక వసతుల కరువు
- ఇబ్బందుల మధ్య కాలం వెళ్లదీత
- పట్టించుకోని అధికారులు

కావలి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):గిరిజనుల అభివృద్ధే ధ్యేయమని గిరిజనుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని నాయకులు ఇస్తున్న హామీలు కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితం అవుతున్నాయే తప్ప వారి బతుకులు మాత్రం ఏమాత్రం మారడం లేదు. గిరిజనుల నివసించే ప్రాంతాలు.. కాలనీలను చూస్తే ఆ విషయం అర్థం అవుతుంది. పట్టణంలోని 5, 16వ వార్డుల్లో గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. ఈ వార్డుల్లో ఇప్పటికీ సీసీ రోడ్లు, డ్రైనేజీ, నీటి వసతి లేదు. వీరి అభివృద్ధికి ఏర్పాటు చేసిన ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతుండటంతో వారు కూలీలుగానే మిగిలిపోతున్నారు.

● మౌలిక వసతులు కరువు

మట్టిరోడ్లు కావడంతో నాలుగు చినుకులు పడితే చిత్తడిగా మారి నడవ లేని పరిస్థితి ఉంటుంది. డ్రైనేజీలు లేకపోవడంతో నివాసాల మధ్యే మురు గునీరు నిల్వ చేరి దుర్గంధం వస్తుంది. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రయితే విష పురుగులు బెడద ఎక్కువగా ఉంటుంది. అలాగే తాగునీటి వసతి కూడా ఉండదు. గతంలో వేసిన రెండు బోర్లు చెడిపోయినా పట్టించు కోవడం లేదు. నీటికోసం వ్యవసాయం బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉం ది. దీనికితోడు వీరికి ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక పోవడంతో కూలీలుగానే మిగిలిపోతున్నారు.

సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయి

- మొగలి కల్లయ్య, ఏపీ ఎరుకల, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఏర్పడ్డ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయి. ఈ నిధులు గిరిజనేతరుల ప్రాంతాలకు మళ్లిస్తూ పక్కదారి పడుతున్నాయి. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు గిరిజన ప్రాంతాలకే వినియోగించాలి. అధికారులు స్పందించి గతంలో గిరిజన అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలన్నీ అమలు చేయాలి.



ముసునూరు గిరిజన కాలనీలోని మట్టిరోడ్డు

రూ.1.60కోట్లతో సీసీ రోడ్డు పనులు

- ఇందిరమ్మ కాలనీలో వర్కులు
- నిర్మాణం కోసం ఆక్రమణల తొలగింపునకు చర్యలు

కావలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక 16వ వార్డుపరిధిలోని కొత్త శివాలయం నుంచి గురురాఘవేంద్ర కాలనీని రైల్వే అండర్‌పాస్ వంతెన వరకు 1.5కిలోమీటర్లు మేరక సీసీ రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పనులు చేపట్టేందుకు రూ.1.60 కోట్లు మం జూరయ్యాయి.. వర్షం పడితే ఇక్కడ స్థానికులు పడే ఇబ్బందులను కొందరు స్థానిక నాయకులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు.

రోడ్డు వెడల్పునకు చర్యలు

ప్రధానరోడ్డును 6మీటర్ల వెడల్పుగా మార్చేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. అందులో భాగంగా రోడ్డు ఉండే వరకు మార్కింగ్ వేశారు. గురువారం చేపట్టిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, టీపీవో వివేకానంద, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. కొత్త శివాలయం నుంచి 108కాలనీ వరకు రోడ్డు ఆక్రమణలకు గురికావటంతో ఆ ప్రాంతంలో కొన్నిచోట్ల, 5మీటర్లు, మరికొన్ని చోట్ల 4మీ వెడల్పున రోడ్డు వేసేలా చిన్న ఆక్రమణలను తొలగింపునకు చర్యలు చేట్టారు. ఆక్రమణల్లో ఇళ్ల జోలికి వెళ్లకుండా అడ్డుగా ఉన్న ప్రహరీలు తొలగించాలని చెప్పారు. తొలగింపులో ఎవరైనా మరీ పేదలు ఉంటే వారికి ఎక్కడైనా ప్రత్యమ్నాయంగా స్థలం చూపిస్తామని తెలిపారు. ఈ రోడ్డు వేసేందుకు మార్కింగ్ చేస్తూ డిజైన్ రూపొందిస్తు న్నారు. ఆక్రమణలు తొలగింపు పూర్తయిన వెంట నే నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టేందుకు అధి కారులు సిద్ధం అవుతున్నారు.



కొలతలు వేస్తున్న మున్సిపల్ అధికారులు

6కెడికె1 సదుపాయాలపై ప్రజంటేషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్

టీఆర్‌ఆర్‌లో ఘనగా ఓపెన్ డే

కందుకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఓపెన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఇతర జూనియర్ కాలేజీలు, పొన్నలూరు, సింగరాయకొండ, టంగుటూరు, వలేటివారిపాలెం జూనియర్ కాలేజీలు, చుండి మోడల్ స్కూల్ విద్యారులు, అధ్యాపకులను కళాశాలకు ఆహ్వానించి మౌలిక సదుపాయాలు, విద్యార్థుల

120రోజుల ప్రణాళికతో వందశాతం ఫలితాలు

● జీ.సురేష్, కలిగిరి ఎంఈవో



కలిగిరి, ఫిబ్రవరి 6,(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటివరకు 90శాతం మేర అపార్ నమోదు పూర్తయిందని మండల ఎంఈఓ జి.సురేష్ తెలిపారు. కాంపోనెంట్ నిధులతో పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు చేపడతామన్నారు. 120రోజుల ప్రణాళికతో పదిలో వందశాతం ఫలితాలు సాధించే చర్యలు తీసుకున్నట్లు ప్పారు.

ఇంటర్వ్యూ

? అపార్ నమోదు ఎంతవరకొచ్చింది.

! ఇప్పటివరకు 85శాతం పూర్తయింది. మిగిలిన వారికి ఆధార్‌కార్డు లేక, వివరా లు తప్పుగా నమోదవడంతో జాప్యం జరుగుతోంది. వాటిని సరిచేసి వందశాతం పూర్తి చేస్తాం.

? మాధ్యాహ్న భోజనం అమలెలా ఉంది.

! అన్నిపాఠశాలల్లో నిర్దేశించిన మెనూ ప్రకారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతోంది.

? సాయంత్రం స్టడీ అవర్‌లో అల్పాహారం ఇస్తున్నారా.

! దాతలు ముందుకొచ్చి సహాయం అందిస్తే అల్పాహారం అందజేస్తున్నాం.

? 120రోజుల ప్రణాళిక ఎలా అమలవుతోంది.

! ఈ ప్రణాళికను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అందుకు తగ్గట్టుగా వారు చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల ప్రగతి మెరుగవుతుంది.

? కాంపోనెంట్ నిధులతో ఏ పనులు చేస్తున్నారు.

! వచ్చిన కాంపోనెంట్ నిధులతో మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఉపకరణాల కొనుగోలు చేస్తున్నాం.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

● సింహ వాహన సేవలందుకున్న వేంకటేశ్వరుడు

కావలి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంకురోడ్డు వద్ద నున్న హనుమత్‌క్షేత్ర లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయాణాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాల్లో స్థానిక వెంగళరావునగర్‌లో శ్రీవారు సింహ వాహనంపై భక్తులకు దర్శ నమిచ్చారు. అడుగడునా భక్తజనం దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం తోమల సేవ, హోమం, ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ముందుగా ముసునూరు అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు నివాసం వద్ద కళాకారులు వివిధ వేషాధారణలో ప్రదర్శనతో ఇచ్చారు. శుక్రవారం శ్రీవారికి హనుమంత వాహ న సేవలందించనున్నారు.



సింహ వాహనంపై వేంకటేశ్వరస్వామి

ప్రాథమిక విద్యను బలహీనపరిచే చర్యలు ఆపాలి



బిట్రగుంట: ఎంఈవోలతో మాట్లాడుతున్న కడనూతల దళితులు



అనంతసాగరం: ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను బలహీనపరిచే చర్యలను ఆపాలని యూటీఎఫ్ మాజీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు లక్కు కృష్ణప్రసాద్ కో రారు. గురువారం పట్టణంలోని ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ కమిటీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను పట్టణంలోని ఎల్‌ఆర్ పల్లి ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసేందుకు ఎంఈవో పేరెంట్స్ కమిటీ అనుమతి కోరారన్నారు. కానీ విద్యార్థులు పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి ప్రతిరోజు కిలోమీటరుకుపైగా నడిచి ఎల్‌ఆర్ పల్లి పాఠశాలకు పంపడం ప్రమాదం కొనితెచ్చుకున్నట్లేనని పేరెంట్స్ కమిటీ ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తూ తీర్మానించారని పేర్కొన్నారు. కావున ఆది ఆంధ్ర పాఠశాలను విలీనం చేసే ప్రక్రియను ఆపాలని కోరారు.

● బిట్రగుంట: దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను వేరే పాఠశాలోకి విలీనం చేయాలన్న అధికారుల ప్రయత్నాలను ఉప సంహరించుకోవాలని గ్రామస్థులు ఎంఈవోలు నరసింహారావు, జయమ్మలను కోరారు. ఈ విషయంపై వారు మండల విద్యా వనరులకేంద్రానికి పెద్ద సంఖ్యలో వెళ్లి విన తిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యాకమి టీ చైర్మన్ నక్కాప్రసున్న, దాసరి బాబురావు, పఠ్రి రవి, గోపికృష్ణ, సునీల్, శ్రీను ఉన్నారు.

● ఉదయగిరి: తిరుమలాపురం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులు చదివే తమ పిల్లలను దుంపవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయవద్దని పీఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో-2 శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పాఠశాల ఉంటే తమ పిల్లలు అక్కడికెళ్లి చదువుకుంటారని, విలీనం చేస్తే విద్యకు దూరమవుతారన్నారు. పీఎంసీ తీర్మానం చేసి అక్కడే ఆయా తరగతులు కొనసాగేలా చర్యలు చేపట్టాలని, లేదంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. స్పందించిన ఎంఈవో మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

● కలువాయి: మోడల్ ప్రైమరీ పాఠశాలలో 3,4,5 తరగతులను కలిపే ప్రతిపాదనలకు నిరసనగా మండల కేంద్రంలోని పలు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు వెస్ట్ ప్రాథమిక పాఠశాల ముందు ఆందోళన చేశారు. బస్టాండు సమీపంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలకు పిల్లలను పంపడం కష్టమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్న పాఠశాలలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే కలువాయి గిరిజన కాలనీ వాసులు కూడా అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. తమ కాలనీలోని పాఠశాలలో ఉండే 3,4,5 తరగతులను తరలించవద్దని ఎంపీడీవో కార్యాయలం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. పెన్నబద్వేలిలో యూపీ పాఠశాల విద్యార్థులను జడ్పీ ఉన్నత పాఠశాలలో కలపడంపై ఆందోళన చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఎంఈవో రేణుకకు వినతి పత్రం అందజేశారు.

● అనంతసాగరం: ముత్తుకూరు, గార్లదిన్నె పాడు ప్రాథమిక పాఠశాలల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. తమ పిల్లలను పాతదేవరాయపల్లిలో మోడల్ స్కూల్‌కు విలీనం చేసే ప్రక్రియ జరుగుతుందని, ఈక్రమంలో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని, అధికారులు ఆ ప్రయత్నం విరమించుకోవాలని కోరారు.



ఆత్మకూరు: ఆది ఆంధ్ర పాఠశాల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



ఉదయగిరి: ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీ కాలనీ వాసులు

మరమ్మతు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక 31వ వార్డులోని పెద్దపవని రోడ్డులో ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు ఎదురుగా మరమ్మ తులకు గురైన మంచినీటి పైపులైన్‌ను గురు వారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. గురువారం ఇంజనీరింగ్ సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. మరలా లీకేజీతో అవడంతో కమిషనర్ దగ్గరుండి పనులను పరిశీలించారు. శుక్రవారం వైకుంఠపురం, పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీ, నార్త్ జనతాపేట ప్రాంతాలకు మంచి నీటి సరఫరా పునరుద్ధరణ చేపట్టారు.

పాఠశాలలో కుక్కల బెడద

లింగసముద్రం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం పాఠశాల వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇవి ఈ పాఠశాల వద్ద ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాం దోళనకు గురి చేస్తుంది. వాహనాల్లో వెళుతున్న వారిని, పాదచారులను కరుస్తున్నాయి.

విద్యుత్ మొండి బకాయిలు వసూలు చేయండి

ఉదయగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్ని కేటగిరిలకు సంబంధించిన విద్యుత్ మొండి బకాయిలను త్వరితగతిన వసూలుచేయాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్ సూచించారు. గురువారం ఉదయగిరి పట్టణంలోని ఈఆర్వో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 200 యూనిట్ల కంటే అదనంగా వాడిన బకాయిలను సైతం వసూలు చేయాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులను తనిఖీ చేసి సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, ఏఈలు ఖుద్దూస్‌బాషా, శ్రీహరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

అన్నవరం ఎస్టీకాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

జలదంకి, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం ఎస్టీ కాలనీలో రూ.10లక్షల ఉపాధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులను గురువారం టీడీపీ నేతలు పూనూరు భాస్కర్‌రెడ్డి, చైత న్య రెడ్డిలు ప్రారంభించారు. ఎన్నికల ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రోడ్లు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

సముద్రాల కుటుంబానికి నేతల పరామర్శ



పాల్గొన్న నేతలు

బిట్రగుంట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అల్లిమడుగు సంఘంకు చెందిన గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సముద్రాల దావీదు సోదరుడు సముద్రాల నాని ఇటీవల మృతి చెందారు. గురువారం పలువరు నేతలు స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నాని చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కావలి ప్రముఖ వైద్యులు ప్రభాకర్‌నాయుడు, మన్నవ రవిచంద్ర, మామిడాలమధు, బచ్చుమధుసూదన్, రాష్ట్ర గిరిజన నేతలు పాలకీర్తిరవి, బాపట్ల వెంకటపతి, తుమ్మ మస్తాన్, జిల్లా గిరిజన నేత బోగిరి ప్రభాకర్ ఉన్నారు.

యానాదుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉదయగిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): యానాదుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బ్రుందం మండలంలోని కొత్తపల్లి యానాది కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని, భూపట్టాలు ఇచ్చినా హద్దులు చూపలేదని, ఆర్ అండ్ బీ స్థలాల్లో ని వాసం ఉంటున్న తమను ఖాళీ చేయాలని అధికారులు బెదిరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య, తలశిల చంద్రమౌళి, సీహెచ్‌ఉష, టీ సతీష్‌చంద్ర పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

పారిశుధ్యం, చోరీల నివారణపై అవగాహన

చేజర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేజర్ల ఎస్‌ఐ తిరుమలరావు గురువారం మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో వ్యాపారులకు పారిశుధ్యం, చోరీల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ తిరుమలరావు మాట్లాడుతూ గ్రామంలో దుకాణాల వద్ద చెత్తా చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా తమ దుకాణంలో సిసి కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఈవోపిఆర్డి రామయ్య మాట్లాడుతూ దుకాణాల ముందు చెత్త వేసినా, ఇంట్లో మరుగునీరు రోడ్డు మీదకు వదిలినా జరిమానా విధిస్తామని, అయినప్పటికీ ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే పోలీసులకు సమాచారం ఇచ్చి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యాపారులు స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి పనికీ వీఆర్వోల రేటు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల వీఆర్వోలు ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి అందికాడికి ప్రజల నుంచి దోచుకుంటున్నారు.15 సచివాలయాల్లో 8మంది వీఆర్వోలున్నారు. ఒ క్కో వీఆర్వోకు ఉన్నతాధికారులు రెండు సచి వాలయాల బాధ్యతలను అప్పగించారు. అ యితే ఇప్పుడు కాకపోతే ఎప్పుడు సంపాదిం చాలనే ఉద్దేశ్యమో తెలియదు కానీ వారు అ డిగినంత ఇస్తేనే ఫైలు కదులుతుంది. లేదంటే ఫైలు కదలదు. ఎందుకివ్వాలని రూల్స్ మాట్లాడితే అది లేదు..ఇది లేదు అంటూ సవాలక్ష కొర్రీలు వేస్తున్నారు. ఫైలు నెలలు త రబడి వీఆర్వోల దగ్గరే ఉండి పోతుంది. వారి మాట వింటే క్షణాల్లో పని అయిపోతుంది. చేసేది లేక అడిగినంత ఇచ్చి నగదు ఇచ్చి పనులు చేసుకుంటున్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ విన్నర్‌గా మణికంఠ

కావలి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విక్రమసింహపురి యూనివర్సిటీ స్టాఫ్ అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో కావలి పీజీ కళాశాల పీడీ సీహెచ్ మణికంఠ షటిల్ బ్యాట్మింటన్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. టీటీ డబుల్స్‌లో మణికంఠ, సుదీప్ జట్టు విన్నర్స్‌గా బ్యాంట్మింటన్ డబుల్స్‌లో రన్నర్స్‌గా నిలిచారు. గురువారం వీఎస్‌యూలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైస్ చాన్స్‌లర్ ఆచార్య భాస్క ర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, మణికంఠ సందీప్‌లకు అభినందనలు తెలిపారు.



పాఠశాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలి

వింజమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలని గ్రామస్థులు కోరారు. గురువారం మండలంలోని నల్లగొండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చౌటపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం జరిగింది. చైర్మన్ లక్ష్మీదేవి అధ్యక్షత వహించగా సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తమ పాఠశాలను మూత వేయకుండా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొనసాగించాలని వినతిపత్రం ప్రధానోపాధ్యాయులకు సమర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డీపీ నర్సింహులు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

● కలువాయి: నాణ్యమైన విద్యను అందించాలన్న ప్రభుత్వ ఉద్దేశాన్ని తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులకు తెలియజేసి మోడల్ ప్రైమరీ పాఠశాలలకు వారి పిల్లలను పంపించేందుకు ఒప్పించాలని కలువాయి ఎంఈవో-1 రేణుక ఉపాధ్యాయులకు సూచించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ప్రతిపాదనలపై గురువారం ఉపాధ్యాయులతో విద్యాశాఖ అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఒక తరగతికి ఒక టీచర్ బోధిస్తారని దీంతో పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులక అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో-2 శేషగిరిరావు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు